www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 20 శుక్రవారం | జూన్, 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 275

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal, Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur

Navabhoomi daily fallows..







హైదరాబాద్ వాసులకు తీపికబురు.. అందుబాటులోకి ఫ్లైఓవర్



2

ఒక ఆశయంతో కూడిన ప్రయాణం




2

విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసం!



2

భార్యపై 93 ఏళ్ల వృద్ధుడి ప్రేమ..



9

మహిళతో మంత్రి సన్నిహిత ఫొటోలు లీక్



10


పోలీసులమని బురిడీ కొట్టించి.. కోటి కొట్టేసిన కేటుగాళ్లు



2

ముమ్మట్టికి తీవ్ర అస్వస్థత

- ఆసుపత్రికి హుటాహుటిన తరలింపు



2

# ఆగని పోరు

- ఇరాన్-ఇజ్రాయెల్ పోరు తీవ్రం...!
- రష్యా, చైనా కీలక నిర్ణయం..!
- లొంగిపోవాలని ఖమేనికి ట్రంప్ హెచ్చరిక
- ఇరాన్ ఎప్పటికీ లొంగిపోదు: ఖమేనీ
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కి ఖమేనీ కౌంటర్
- యుద్ధంలో జోక్యం చేసుకోవద్దంటూ వార్నింగ్

2



**టెల్ అవీవ్-నవభూమిబ్యూరో**

ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం ఏడో రోజూ నిరాటంకంగా కొనసాగుతోంది. అంతే కాదు ఈ పోరులో ఇరు దేశాలకూ జరుగుతున్న నష్టం కూడా అంతకంతకూ పెరిగిపోతోంది. ఇజ్రాయెల్ లోని సోరొకా ఆస్పత్రితో పాటు టెల్ అవీవ్‌లోని స్టాక్ ఎక్ఛేంజ్ పైనా ఇరాన్ క్షిపణుల వర్షం కురిపించగా.. ఇజ్రాయెల్ కూడా టెహ్రాన్ లోని లక్ష్యాలపై ప్రతిదాడులు చేస్తోంది. తమ ఆస్పత్రిపై ఇరాన్ దాడిపై మండిపడుతున్న ఇజ్రాయెల్ సుప్రీం లీడర్ ఖమేనీని అంతం చేస్తామని ప్రకటించింది. గురువారం ఉదయం ఇజ్రాయెల్‌పై ఇరాన్ డజన్ల కొద్దీ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఇందులో పౌర ప్రాంతాలపై అనేక దాడులు జరిగాయని ఇజ్రాయెల్ సైనిక అధికారులు తెలిపారు. ముఖ్యంగా దక్షిణ ఇజ్రాయెల్‌లోని సోరోకా ఆసుపత్రితో సహా పౌర నివాస ప్రాంతాలపై దాడులు జరిగాయని తెలిపారు. సోరోకా ఆస్పత్రిపై జరిగిన దాడిని ఇజ్రాయెల్ తీవ్రంగా ఖండించింది. ఇది తీవ్రవాదంతో సమానమని అభివర్ణించింది.

సోరోకా ఆసుపత్రి ఇతర పౌర ప్రాంతాలలో పౌరులపై జరిగిన దాడికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ప్రకటించారు. టెహ్రాన్ ఈ దాడికి ఖచ్చితమైన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ .. తమ దేశానికి ముప్పులను తొలగించడానికి, అయతుల్లాల పాలనను అణగదొక్కడానికి ఐడీఎఫ్ తన కార్యకలాపాలను ముమ్మరం చేస్తుందన్నారు. ఇరాన్‌లోని వ్యూహాత్మక లక్ష్యాలపై, టెహ్రాన్‌లోని ప్రభుత్వ లక్ష్యాలపై దాడుల తీవ్రతను పెంచాలని ఐడీఎఫ్‌ను ఆదేశించినట్లు ట్వీట్ చేశారు. జోక్యం చేసుకుంటే ఏమవుతుందో మీకూ తెలుసు..

**అమెరికాకు ఖమేనీ వార్నింగ్**

గతవారం రోజులుగా ఇరాన్, ఇజ్రాయేల్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఇజ్రాయేల్ దాడి చేస్తే మూల్యం చెల్లించక తప్పదని ఇరాన్ హెచ్చరించింది. అమెరికా జోక్యం చేసుకుంటే భారీ నష్టం వాటిల్లుతుందని ఖమేనీ స్పష్టం చేశారు. ఇరాన్‌పై దాడి అంత సులువు కాదని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి హెచ్చరించారు. ఇరాన్ పశ్చిమ ప్రాంతాల్లోని లక్ష్యాలపై ఇజ్రాయేల్ వైమానిక దాడులు చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి.

మరోసారి ఇరాన్, ఇజ్రాయేల్ పరస్పర దాడులతో పశ్చిమాసియాలో పరిస్థితులు వేడెక్కాయి. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని, లేకుంటే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలపై టెహ్రాన్ తీవ్రంగా స్పందించింది. తమపై ఇజ్రాయేల్ దాడిచేసి ఘోర తప్పిదం చేసిందని, అందుకు మూల్యం అనుభవించక తప్పదని ఇరాన్ సుప్రీం లీడర్ అయుతుల్లా అలీ ఖమేనీ హెచ్చరించారు. ఇజ్రాయేల్ దాడుల వేళ ఆయన వీడియో సందేశం విడుదల చేశారు. ఇరాన్ ఎప్పటికీ లొంగిపోదనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. అమెరికా అధ్యక్షుడు హెచ్చరికలను ఉద్దేశిస్తూ.. అటువంటి బెదిరింపులకు భయపడమనే విషయం ఇరాన్ చరిత్ర తెలిసిన వారికి

# అణు యుద్ధాన్ని ఆపింది నేనే

- భారత్, పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ అదే పాట
- భారత్, పాక్‌ల మధ్య అణు యుద్ధాన్ని ఆపింది నేనేనంటూ,,ట్రంప్ పాతరాగం
- భారత ప్రధాని మోదీ ఒక అద్భుతమైన వ్యక్తి..అంటూ ట్రంప్ కితాబు
- భారత్‌తో త్వరలోనే వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటున్నామన్న ట్రంప్

2



**వాషింగ్టన్ డిసి-నవభూమిబ్యూరో**

భారత్, పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ అదే పాటపాడారు. భారత్, పాక్‌ల మధ్య అణు యుద్ధాన్ని ఆపింది తానేనంటూ డప్పుకొట్టుకున్నారు. పాకిస్థాన్ విజ్ఞప్తి మేరకే తాత్కాలిక కాల్పుల విరమణకు తాము అంగీకరించామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటన చేసిన కొద్దిగంటల్లో ట్రంప్ తన వల్లే యుద్ధం ఆగిపోయిందని చెప్పడం గమనార్హం. భారత్, పాకిస్థాన్ యుద్ధాన్ని తాను ఆపితే దీనిపై కనీసం ఒక కథనమైనా రాయలేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. అంతేకాదు, గత రాత్రే భారత ప్రధాని మోదీ తాను మాట్లాడానని, ఆయన ఓ అద్భుతమైన వ్యక్తి అని కితాబిచ్చారు. అంతేకాదు, భారత్‌తో త్వరలోనే వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటున్నామని చెప్పారు. అంతలోనే పాకిస్థాన్ అంటే తనకు ఎంతో ప్రేమని ట్రంప్ అన్నారు.

కెనడాలో జరుగుతోన్న జీ7 శిఖరాగ్ర సదస్సు నుంచి మధ్యలోనే వెళ్లిపోయిన డొనాల్డ్ ట్రంప్.. ప్రధాని నరేంద్ర మోదీతో 35 నిమిషాలపాటు ఫోన్‌లో సంభాషించారు. ఈ సందర్భంగా విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి మీడియాకు వివరాలు వెల్లడిస్తూ.. ప్రధాని మోదీ 'పాకిస్థాన్‌కు కాల్పుల విరమణ కోరాల్సిన పరిస్థితి వచ్చింది' అని ట్రంప్‌నకు వివరించారని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ గురించి మాట్లాడుతూ, జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చర్యలు చేపట్టిందని మోదీ ట్రంప్‌నకు వివరించారు. ఈ చర్యలు అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా తీసుకున్నట్టు చెప్పారు. భారత్ కేవలం పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలను,

# బనకచర్లపై తెలంగాణ సీరియస్

- కేంద్రానికి సీఎం రేవంత్‌రెడ్డి అల్టిమేటం!
- బనకచర్ల వివాదం.. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ కలిసిన రేవంత్
- ఏపీ పునర్విభజన చట్టం-2014 నిబంధనలను ఏపీ ఉల్లంఘన
- తెలంగాణ ప్రజలు, రైతుల్లో నెలకొన్న ఆందోళన కేంద్ర మంత్రి దృష్టి

2



**ఢిల్లీ-నవభూమిబ్యూరో:** గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ప్రీ-ఫీజిబిలిటీ నివేదికను తిరస్కరించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌ను అభ్యర్థించారు. తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా ఏపీ ప్రతిపాదిస్తున్న ఈ ప్రాజెక్టు గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్ (GWDT-1980), ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014 నిబంధనలను ఉల్లంఘిస్తోందని వారు కేంద్ర మంత్రికి స్పష్టం చేశారు.

ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో జలశక్తి మంత్రి, ఆ శాఖ కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులతో గురువారం జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణ ప్రజలు, రైతుల్లో నెలకొన్న ఆందోళనలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బనకచర్ల ప్రాజెక్టును ఏపీ గోదావరి వరద జలాల ఆధారంగా చేపడుతున్నామని చెబుతోందని, అయితే GWDT-1980లో వరద జలాలు, మిగులు జలాల ప్రస్తావనే లేదని సీఎం గుర్తుచేశారు.

2014 ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం, ఏ రాష్ట్రంలోనైనా కొత్త ప్రాజెక్టు నిర్మించాలంటే ముందుగా నదీ

# ఆపరేషన్ చేయూత

- కొత్తగూడెం ఎస్పీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టులు
- మొత్తం 12 మంది ఎస్పీ ఎదుట లొంగిపోయి జన జీవన స్రవంతిలోకి
- ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మొత్తం 12 మంది మావోయిస్టుల్లో 9 మంది పురుషులు, 3 మహిళలు



2



**కొత్తగూడెం-నవభూమిబ్యూరో:** మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ ఎదుట భారీగా మావోయిస్టులు లొంగిపోయారు. మొత్తం 12 మంది ఎస్పీ ఎదుట లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలిసేందుకు నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌లో ఇప్పటికే కీలక నేతలను కోల్పోయిన పార్టీకి ఇది షాక్ అనే చెప్పాలి. హేమచంద్రాపురం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఎదుట వీరు లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మొత్తం 12 మందిలో 9 మంది పురుషులు, 3 మహిళలు ఉన్నారు. లొంగిపోయిన వారిలో ఇద్దరు డివిజన్ కమిటీ మెంబర్స్, నలుగురు ఏసీఎం క్యాడర్‌కు చెందిన వారు ఉన్నారని ఎస్పీ వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఆపరేషన్ చేయూత' కార్యక్రమంలో భాగంగానే వీరు లొంగిపోయినట్లు ఎస్పీ స్పష్టం చేశారు. 2025 జనవరి నుంచి ఇప్పటి వరకు వివిధ క్యాడర్‌లలో పనిచేస్తున్న మొత్తం 294 మంది

## గంజాయి, బెట్టింగ్ బ్యాచ్,రౌడీలకు
# విగ్రహాలా..

- సత్తెనపల్లి ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్
- హింసను ప్రోత్సహించి పోలీసులపై నిందలు మోపుతారా
- వైసీపీ శ్రేణులపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు గుస్సా..
- జగన్ హయాంలో ఎన్నో అరాచకాలు...
- ఇప్పుడూ అలానే చేస్తే ఊరుకోం..సీఎం హెచ్చరిక

2




**అమరావతి-నవభూమిబ్యూరో:**

మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సత్తెనపల్లి పర్యటన సందర్భంగా అల్లర్లు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. గురువారం ఏపీ సచివాలయంలో సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. ఓ వైపు యోగా జరుగుతుంటే.. మరోవైపు వైసీపీ శ్రేణులు రప్ఫా రప్ఫా అంటున్నారని మండిపడ్డారు. చంపండి.. నరకండి.. అని ఎవరైనా అంటారా అని ప్రశ్నించారు. గంజాయి, బెట్టింగ్ బ్యాచ్‌లు, రౌడీలకు విగ్రహాలు పెడతారా అని నిలదీశారు సీఎం చంద్రబాబు.

ప్రజలను ఇబ్బంది పెడతారా..ఇరుకు వీధుల్లో మీటింగ్‌లు పెట్టి ప్రజలను ఇబ్బంది పెడతారా అని సీఎం చంద్రబాబు అడిగారు. హింసను ప్రోత్సహించి పోలీసులపై నిందలు మోపుతారా అని ఫైర్ అయ్యారు. ఏపీలో ఎప్పుడైనా ఇలాంటి పోకడలు చూశారా అని ప్రశ్నించారు. నేరస్థులతో రాజకీయాలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. తాము ఎవరినీ టార్గెట్ చేయడం లేదు.. చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. రౌడీయిజం చేసేవారిని, చట్టాన్ని ఉల్లంఘించేవారిని వదిలేయాలా అని నిలదీశారు. ఒక్కసారి ఉన్మాదులుగా మారితే వారిని మార్చగలమా అన్నారు. భవిష్యత్‌ను

## విమాన ప్రమాదంలో
# బ్లాక్ బాక్స్ ధ్వంసం




**అహ్మదాబాద్-నవభూమిబ్యూరో:** ఇటీవల జరిగిన ఘోర విమాన ప్రమాదంలో అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు. అసలు ప్రమాదం జరగడానికి గల కారణాలపై అనేక విశ్లేషణలు జరుపుతున్నారు. ప్రమాద కారణాలు తెలుసుకునే బ్లాక్ బాక్స్‌ను ఇప్పటికే ఘటనా స్థలంలోనే స్వాధీనం చేసుకున్న అధికారులు.. అందులో నుంచి డేటాను సేకరించేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ప్రమాద తీవ్రతకు బ్లాక్ బాక్స్ ధ్వంసం కావడంతో.. దాన్ని విదేశాలకు పంపించి.. సమాచారాన్ని విశ్లేషించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

దేశ చరిత్రలోనే ఘోరమైన విమాన ప్రమాదంగా నిలిచిన గుజరాత్ ఎయిరిండియా విమానం కూలిన ఘటన దేశం మొత్తాన్ని తీవ్ర విషాదానికి గురిచేసింది. అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం.. బీజే మెడికల్ కాలేజీ భవనంపై కూలిన సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రమాదానికి కారణం.. విమానం రెండు ఇంజిన్లు ఒకేసారి ఫెయిల్ కావడమేనని

# కూటమి పనితీరు భేష్

- ఏపీలో ఎంపీ, ఎమ్మెల్యేలు, మంత్రులపై రైజ్ సర్వే
- తాజా పరిస్థితులపై సర్వేయర్ ప్రవీణ్ పుల్లట సర్వే
- కూటమి పనితీరు బాగుందని 52.8% మంది ప్రజలు
- గత వైసీపీ ప్రభుత్వ పనితీరు బాగుందని 38 శాతం మంది

2



**అమరావతి-నవభూమిబ్యూరో:** ఏపీలో కూటమి సర్కార్ ఏడాది పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రతీ అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గంలో పరిస్థితులు ఎలా ఉన్నాయి, ఎమ్మెల్యేలు, ఎంపీలపై ప్రజలు ఏమనుకుంటున్నారు, రాష్ట్రవ్యాప్తంగా అధికార కూటమిపై ప్రజా అభిప్రాయం ఎలా ఉందన్న దానిపై రైజ్ సర్వే ఫలితాలు వెలువడ్డాయి. ఈ మేరకు 175 అసెంబ్లీ సీట్లతో పాటు 25 పార్లమెంట్ సీట్లలోనూ తాజా పరిస్థితుల్ని వివరిస్తూ సర్వేయర్ ప్రవీణ్ పుల్లట తమ సర్వే ఫలితాలు ప్రకటించారు.

రైజ్ సర్వేలో ప్రభుత్వ పనితీరుపై ప్రజా స్పందన చూస్తే.. కూటమి పనితీరు బాగుందని 52.8 శాతం ప్రజలు అభిప్రాయపడ్డారు. బాగా లేదని 26 శాతం, పర్వాలేదని 21.2 శాతం ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే ఏ ప్రభుత్వ పనితీరు బాగుందని అడిగితే కూటమి ప్రభుత్వ పనితీరు బాగుందని 51 శాతం, వైసీపీ ప్రభుత్వ పనితీరు బాగుందని 38 శాతం అభిప్రాయపడ్డారు. మరో 11 శాతం చెప్పలేమన్నారు. ఎక్కువ సంక్షేమం అందించిన సీఎం జగన్ అని 52 శాతం, చంద్రబాబని 48 శాతం చెప్పారు.

కూటమి ఎమ్మెల్యేల పనితీరు గురించి అడిగితే బాగుందని కేవలం 28 శాతం మందే చెప్పారు. బాగోలేదని ఏకంగా 64 శాతం మంది చెప్పారు. మరో 8 శాతం చెప్పలేమన్నారు. ఏ సీఎం హయాంలో అభివృద్ధి ఎక్కువగా జరిగిందని అడిగితే చంద్రబాబు అని 59 శాతం, జగన్ అని మరో 41 శాతం మంది

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in



# నవ వార్త





## ఎగ్ బిర్యానీ భేష్..

**హైదరాబాద్-నవభూమి:** పిల్లలకు మధ్యాహ్న భోజనంలో భాగంగా అందిస్తున్న ఎగ్ బిర్యానీని రుచి చూసిన జిల్లా కలెక్టర్ హరిచందన దాసరిభేషుగ్గా ఉందని కితాబిచ్చారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఎంజీనగర్‌లోని మురాద్‌నగర్, చాచా నెహ్రూనగర్‌లోని అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంధుల హాస్టల్, బస్తీ దవాఖానాలను కలెక్టర్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలను సందర్శించి రిజిస్టర్లు, మెనూ ప్రకారం అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. అంగన్వాడీ పాఠశాలలోని పిల్లలు కలెక్టర్‌కు స్వాగత పూర్వకంగా గులాబీ పువ్వు ఇవ్వగా చిరునవ్వుతో స్వీకరించారు. ఎలా చదువుతున్నారని, ఉపాధ్యాయులు బాగా బోధిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రం పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీరు, విద్యుత్ సమస్య లేకుండా చూడాలని సూచించారు. అనంతరం మురాద్‌నగర్, చాచా నెహూనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలోని వాష్ బేసిన్, టాయిలెట్స్‌ను పరిశీలించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని హెడ్ మాస్టర్‌ను ఆదేశించారు. పాఠశాలల్లో యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ అందాయా అని అడిగి తెలుసుకున్నారు. వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంధుల హాస్టల్ కేంద్రాన్ని సందర్శించి అక్కడి వారితో మాట్లాడారు. ఈ కేంద్రాల్లో ఎక్కువగా ఇంటర్ , డిగ్రీ , పీజీ పిల్లలు ఉండడంతో కాంపిటేటివ్ పరీక్షలకు సిద్ధం చేయాలని, వారికి నాణ్యమైన ఆహారం అందించాలని, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు.

## హైదరాబాద్ వాసులకు తీపికబురు.. అందుబాటులోకి మరో ఫ్లైఓవర్, జూన్ 28న ప్రారంభం



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్ నగర వాహనదారులకు గుడ్‌న్యూస్. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు మరో కీలక ఫ్లైఓవర్ అందుబాటులోకి రానుంది. శిల్పా లే ఔట్ ఫేజ్ 2 ఫ్లైఓవర్‌ను జూన్ 28న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ ఫ్లైఓవర్‌కు దివంగత కాంగ్రెస్ నేత పి. జనార్దన్ రెడ్డి పేరు పెట్టాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. కొండాపూర్ నుండి గచ్చిబౌలి వరకు నిర్మించిన ఫ్లైఓవర్ 1.2 కిలోమీటర్ల పొడవుతో, ఆరు లేన్లతో విస్తరించి ఉంది. దీని నిర్మాణానికి సుమారు రూ. 178 కోట్లు ఖర్చయింది. ఈ ఫ్లైఓవర్ గచ్చిబౌలి జంక్షన్ వద్ద నిర్మించిన మూడో ఫ్లైఓవర్. ఇప్పటికే ఇక్కడ గచ్చిబౌలి జంక్షన్ ఫ్లైఓవర్, శిల్పా లే ఔట్ ఫేజ్ 1 ఫ్లైఓవర్ ఉన్నాయి. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే ఔటర్ రింగ్ రోడ్ నుండి కొండాపూర్, హఫీజ్‌పేట్ వైపు వెళ్లే వాహనదారులకు, ముఖ్యంగా ఐటీ కారిడార్‌లోని గచ్చిబౌలి, హైటెక్ సిటీ, మాదాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాంతాలకు వెళ్లే వారికి ట్రాఫిక్ కష్టాలు తీరిపోనున్నాయి. గచ్చిబౌలి జంక్షన్ వద్ద ఏర్పడే రద్దీ తగ్గి, ప్రయాణ సమయం ఆదా అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఫ్లైఓవర్ పెయింటింగ్, లైటింగ్ పనులు దాదాపు పూర్తయ్యాయి, సుందరీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రారంభోత్సవానికి ముందే ఈ పనులన్నింటినీ పూర్తి చేయాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి రావడం హైదరాబాద్ నగర మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఒక ముఖ్యమైన అడుగు. ఇది స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ లో భాగంగా నిర్మించబడింది. ఈ ఫ్లైఓవర్ ఐటీ ఉద్యోగులకు, ఇతర ప్రయాణికులకు సౌలభ్యంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. కాగా, హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించడానికి తెలంగాణ ప్రభుత్వం అనేక కీలక చర్యలు చేపడుతోంది. పెరుగుతున్న వాహనాల సంఖ్య, నగరం విస్తరణ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య ఒక సవాలుగా మారింది. దీనిని అధిగమించేందుకు మౌలిక సదుపాయాల కల్పనకు సిద్ధమైంది.
స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద నగరంలో పలు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, లింక్ రోడ్లను నిర్మిస్తున్నారు. శిల్పా లే ఔట్ ఫేజ్ 2 ఫ్లైఓవర్ వంటి ప్రాజెక్టులు దీనిలో భాగమే. దీనివల్ల కీలక జంక్షన్లలో ట్రాఫిక్ రద్దీ తగ్గి, ప్రయాణ సమయం ఆదా అవుతుంది. రద్దీ ఎక్కువగా ఉండే రోడ్లను విస్తరించడం, కొత్త రహదారులను నిర్మించడం ద్వారా ట్రాఫిక్ రద్దీకి చెక్ పెట్టొచ్చని భావిస్తున్నారు.

## పోలీసులమని బురిడీ కొట్టించి..
### కోటి రూపాయలు కొట్టేసిన కేటుగాళ్లు



**హైదరాబాద్-నవభూమి:** తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తామని చెప్పి ఓ గ్యాంగ్ బంగారు దుకాణం యజమాని నుంచి కోటి రూపాయలు కాజేసింది. సికింద్రాబాద్ పరిధిలోని ఆర్‌కే జ్యువెలరీ యజమానిని ఆరుగురు సభ్యుల ముఠా ఎస్‌వోటీ పోలీసుల పేరుతో మోసం చేసింది. ముందుగా పోలీసు వేషంలో జ్యువెలరీ వ్యాపారి దగ్గరికి వెళ్లిన ఈ గ్యాంగ్.. మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే బంగారం విక్రయిస్తామని నమ్మబలికి జ్యువెలరీ షాప్ యజమానితో కోటి రూపాయల బేరం కుదుర్చుకుంది. కానీ, అనుమానం రావడంతో నగలు చూపించాలని వ్యాపారి ముఠా సభ్యులను అడిగాడు. ముఠా సభ్యులు బంగారాన్ని చూపించడంతో నిజమని నమ్మాడు. ప్లాన్ ప్రకారం నకిలీ పోలీసులు కూడా కోటి రూపాయన నగదు చూపించాలని వ్యాపారిని కోరారు.
దీంతో డీల్ ప్రకారం, ఆర్‌కే జ్యువెలరీ యజమాని కోటి రూపాయల నగదు తెచ్చేందుకు సెకండ్ బజార్‌లో ఉన్న తన కార్యాలయానికి వెళ్లాడు. నగదు తీసుకొస్తుండగా దార్లో ముగ్గురు వ్యక్తులు ఎస్వోటీ పోలీసుల పేరుతో ఎంట్రీ ఇచ్చారు. వ్యాపారిని బెదిరించి డబ్బు సీజ్ చేస్తున్నామని చెప్పి కారులో పరారయ్యారు. ముఠా చేతిలో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు వెంటనే క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు జూబ్లీ బస్ స్టాప్ వద్ద ముఠాలోని ఐదుగురిని అరెస్టు చేశారు. కాగా, నిందితుల్లో కీలక సూత్రధారిగా ఉన్న 8వ బెటాలియన్‌కు చెందిన కేశవ్ అనే కానిస్టేబుల్ కొట్టేసిన డబ్బుతో పరారయ్యాడు. ప్రస్తుతం పోలీసులు అతడి కోసం గాలిస్తున్నారు.

## విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసం!



**హైదరాబాద్-నవభూమి::** విదేశాల్లో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసం చేసిన వ్యవహారంలో ఈగల్ ఎక్స్‌పర్ట్ ఇమ్మిగ్రేషన్ కన్సల్టెన్సీ డైరెక్టర్ సరోజా శిష్యంత్‌ను తాజాగా అరెస్టు చేసినట్లు సీఐడీ అదనపు డీజీ షికా గోయల్ చెప్పారు. ఇప్పటికే ఈ కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్లు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీలో 'అబ్రాడ్ స్టడీ ప్లాన్ కన్సల్టెన్సీ' నిర్వహిస్తున్న గంటా అనిల్‌కుమార్ అతని సోదరుడు సునీల్ కుమార్.. మిత్రులతో కలిసి మరో చోట ఈగల్ కన్సల్టెన్సీ ఏర్పాటు చేశారన్నారు. వీరంతా కలిసి నిరుద్యోగులకు విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.5 లక్షల నుంచి 8 లక్షల వరకు వసూలు చేసి.. అక్కడ ఉద్యోగాలు కల్పించకుండా మోసం చేస్తున్నారని ఆమె వివరించారు. వీరి ద్వారా నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్ తీసుకుని మాల్టా దేశం వెళ్లి మోసపోయిన బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ ప్రారంభించామన్నారు. ఈ ముఠా హైదరాబాద్‌తో పాటు విజయవాడ, ఢిల్లీలోనూ ఆఫీసులు తెరిచి మోసాలకు పాల్పడ్డారని తెలిపారు.

## ఆపరేషన్ చేయూత

**(1వపేజీ తరువాయి)**మావోయిస్టులు లొంగిపోయారని తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు తక్షణ సహాయం కింద రూ.25 వేల నగదు అందజేశారు. ఈ లొంగుబాటుతో మావోయిస్టు కార్యకలాపాలకు గట్టి ఎదురుదెబ్బ తగిలిందని, ఆపరేషన్ చేయూత విజయవంతంగా కొనసాగుతోందని అధికారులు పేర్కొన్నారు. మావోయిస్టులు హింసా మార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని ఎస్పీ రోహిత్ రాజ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం, మారేడుమిల్లి మండలాల సరిహద్దులో బుధవారం (జూన్ 18) జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు కీలక మావోయిస్టు నేతలు మృతిచెందారు. కొండమొదలు, కొయ్యలగూడెం, చింతకూరు పరిసర అటవీ ప్రాంతాల్లో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఈ ఎదురు కాల్పులు జరిగాయి. ఎదురుకాల్పుల్లో మృతిచెందిన వారిలో స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు అరుణ అలియాస్ వీఆర్ చైతన్య ఉన్నారు. ఈమె ఇటీవల భద్రతా బలగాల కాల్పుల్లో మృతిచెందిన మావోయిస్టు అగ్రనేత చలపతిరావు భార్య కావడం గమనార్హం. వీరితో పాటు కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ ఉదయ్, అలాగే ఏవోబీ స్పెషల్ జోన్ కమిటీ ఏసీఎం అంజు కూడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఘటనాస్థలంలో భద్రతా బలగాలు మూడు ఏకే 47 రైఫిల్స్‌ను స్వాధీనం చేసుకున్నాయి.
కేంద్రంలో ఎన్డీఏ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మావోయిస్టులపై ఉక్కుపాదం మోపుతోంది. 2026 మార్చి నాటికి మావోయిజాన్ని పూర్తిగా మట్టుబెడతామని, మావోయిస్టుల జాడ లేకుండా చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. దీనిలో భాగంగా, మావోయిస్టులకు కంచుకోట అయిన ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలోకి వేల సంఖ్యలో కేంద్ర బలగాలను దించారు. అప్పటి నుంచి మావోయిస్టుల ఏరివేత ముమ్మరంగా కొనసాగుతోంది. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 200కు పైగా మావోయిస్టులను భద్రతా బలగాలు హతమార్చాయి. వీరిలో దాదాపు 30 మంది అగ్రనేతలు ఉన్నట్లు తెలుస్తోంది.

## అన్నదమ్ముల మధ్య కుక్క పంచాయతీ

**హైదరాబాద్-నవభూమి:**అన్నదమ్ముల మధ్య మొదలైన కుక్క పంచాయతీ ఆఖరికు హైకోర్టుకు చేరింది. కుక్క కోసం హైకోర్టుకు వెళ్లడం ఏంట్రా నాయనా అనుకుంటున్నారా.. అసలింతకు అన్నదమ్ముల మధ్య కుక్క వల్ల వచ్చిన గొడవేంటి.. అనే వివరాలు తెలియాలంటే ఇది చదవాల్సిందే. ముందస్తు నోటీసు ఇవ్వకుండానే జీహెచ్ఎంసీ సిబ్బంది తన పెంపుడు కుక్కను తీసుకెళ్లారంటూ ఒక వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. కానీ జీహెచ్ఎంసీ తరఫున ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ.. సదరు వ్యక్తి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుతోనే.. జీహెచ్ఎంసీ సిబ్బంది కుక్కను తీసుకెళ్లినట్లు కోర్టుకు వివరించాడు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్, చిక్కడపల్లిలో నివాసం ఉంటున్న ఈబీ దక్షిణామూర్తి అనే వ్యక్తి.. జీహెచ్ఎంసీ సిబ్బంది తనకు ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండానే.. లైసెన్స్ ఉన్న తన పెంపుడు కుక్కను తీసుకెళ్లారని.. దానిని తిరిగి తనకు అప్పగించాలంటూ హైకోర్టులో పిటిషన్ వేశాడు. ఈక్రమంలో బుధవారం నాడు.. దక్షిణామూర్తి వేసిన పిటిషన్‌ను జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారించారు.
ఈ సందర్భంగా దక్షిణామూర్తి తరఫున న్యాయవాది వాదనలు వినిపించారు. జీహెచ్ఎంసీ సిబ్బంది తన క్లైంట్ పెంపుడు కుక్కను తీసుకుని వెళ్లేప్పుడు అతడికి ఎలాంటి నోటీసలు ఇవ్వలేదని కోర్టుకు తెలిపాడు. పైగా ఆ కుక్కకు వైద్య అవసరాలు ఉన్నాయని.. అంతేకాక దానికి తీసుకుని వెళ్లి కోతులు ఉండే బోన్‌లో పెట్టారని దక్షిణామూర్తి తరఫు న్యాయవాది వాదించారు. దీనిపై ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ.. దక్షిణామూర్తి పెంపుడు కుక్క.. డ్యాగో అర్జెంటీనా అనే బ్రీడ్‌కు చెందినదని.. దానిపై నిషేధం ఉందని తెలిపారు. అంతేకాక దక్షిణామూర్తి సోదరుడు ఈబీ నరసింహమూర్తి ఫిర్యాదుతోనే జీహెచ్ఎంసీ సిబ్బంది కుక్కను తీసుకెళ్లినట్లు ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు వివరించారు. నరసింహమూర్తి దీనిపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేశాడని తెలిపారు. దక్షిణామూర్తి.. కుక్కను తమపై ఉసిగొల్పి బెదిరిస్తున్నాడని నరసింమూర్తి ఫిర్యాదులో వెల్లడించారని చెప్పుకొచ్చాడు. అంతేకాక కుక్క కరిచిన మెడికల్ రిపోర్టులే కాకుండా.. ఈ ఘటనకు = సంబంధించిన సీసీటీవీఫుటేజీ కూడా ఉన్నట్లు నరసింహమూర్తి ఇచ్చిన ఫిర్యాదులో ఉందని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇరువైపుల వాదనలు విన్న కోర్టు.. దక్షిణామూర్తి పెంచుకునే కుక్కబ్రీడ్‌పై నిషేధం ఉన్నప్పుడు దానికి లైసెన్స్ ఎలా ఇస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఆ బ్రీడ్‌పై ఉన్న నిషేధ ఉత్తర్వులు అందజేయాలని సూచించింది. అంతేకాక కుక్కను యజమానికి అప్పగించాలంటూ జీహెచ్ఎంసీకి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కుక్కను జాగ్రత్తగా చూసుకోవాలని.. జన సంచారం ఉన్న చోట దానిని వదిలిపెట్టవద్దని దక్షిణామూర్తికి సూచించింది. విచారణను జులై 9కి వాయిదా వేసింది.

## మమ్ముట్టి తీవ్ర అస్వస్థత

మమ్ముట్టి తీవ్ర అనారోగ్యానికి గురైనట్లు తెలుస్తోంది. తీవ్ర అనారోగ్యంతో ఆయన ఆస్పత్రిలో చేరినట్టు సమాచారం. దీంతో ఆయనకు ఏమైందని అభిమానులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల మమ్ముట్టి ఆరోగ్యం గురించి అనేక వార్తలు వైరల్ అవుతున్నాయి. మమ్ముట్టి క్యాన్సర్‌తో బాధపడుతున్నారనే ప్రచారం జరిగింది. అందుకే ఆయన సినిమాలకు కూడా దూరంగా ఉంటున్నారని పుకార్లు షికార్లు చేశాయి. తాజాగా దీనిపై మమ్ముట్టి సన్నిహితుడు రాజ్యసభ ఎంపీ జాన్ బ్రిట్టాస్ క్లారిటీ ఇచ్చారు.

## గంజాయి, బెట్టింగ్ బ్యాచ్,రౌడీలకు విగ్రహాలా..

**(1వపేజీ తరువాయి)** తీర్చిదిద్దే నాయకుల గురించి ప్రజలు ఆలోచించాలని కోరారు సీఎం చంద్రబాబు.
'కొందరికి క్రైమ్ కూడా అలవాటు అయిపోయింది. అంతా యోగా చేస్తే పబ్లిక్ అటెన్షన్ డైవర్ట్ చేయాలని ఇలాంటివి చేస్తున్నారు. ఇప్పుడు రప్పా రప్పా అంటున్నారు. గంగమ్మ జాతరలో పొట్టేలు నరికినట్లుగా నరికేస్తాం అంటున్నారు. ఒకప్పుడు చెడ్డ లక్షణాలు ఉన్న వ్యక్తిని రాజకీయాల్లో దూరం పెట్టేవారు. ఇప్పుడు వారినే వెనకేసుకుని తిరుగుతున్నారు. మేము ఎప్పుడైనా పోలీసులు వద్దంటే నిబంధనలకు విరుద్ధంగా వెళ్లామా. గంజాయి, బెట్టింగ్ బ్యాచ్, అత్యాచారాలు చేసే వారికి విగ్రహాలు పెడుతున్నారు. ఏపీలో గంజాయి చాలా వరకు కంట్రోల్ చేశాం. గంజాయి, డ్రగ్స్ అరికట్టడానికి ఈగల్ టీం ఏర్పాటు చేశాం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**జగన్ హయాంలో ఎన్నో అరాచకాలు...**

'గత జగన్ ప్రభుత్వ హయాంలో ఎన్నో అరాచకాలు జరిగాయి. తాను చేసిందే చట్టం అంటే ఎలా కుదురుతుంది. మీరు మారాలి.. లేకుంటే ప్రజలు మార్చాలి. వైసీపీ నేతలు సమాజానికే పెద్ద సమస్యగా మారిపోయారు. అన్ని నేరాల్లో వాళ్లే ఉంటున్నారు.. మళ్లీ రాజకీయం చేస్తున్నారు. ప్రశాంతంగా ఉండే కుప్పంలో అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. తప్పుడు పనులతో అతలాకుతలం చేస్తామంటే సరికాదు. ఏడాది క్రితం చనిపోయిన వ్యక్తికి ఇప్పుడు పరామర్శా. వైసీపీ హయాంలోనే నాగమల్లేశ్వరరావు చనిపోయాడు. వైసీపీ నేతల వాహనం ఢీకొని చనిపోతే పట్టించుకోరా. రౌడీయిజం చేయాలని అందరినీ ప్రోత్సహిస్తున్నారు' అని సీఎం చంద్రబాబు ప్రశ్నల వర్షం కురిపించారు.

**మేము ఎందుకు భయపడతాం..**

'ఏపీ మొత్తం ఒక మంచి పని చేస్తే వైసీపీ నేతలు మాత్రం నేరాలకు పాల్పడుతున్నారు. నేరస్థుల మెంటాలిటీ అలానే ఉంటుంది. ఇష్టానుసారం వ్యవహరిస్తే చట్టం ఊరుకోదు. విచిత్రమైన మనస్తత్వం ఉన్నవాళ్లు అలా మాట్లాడుతారు. ఆయన చేసిన పనులను చూసి జనం ఆ తీర్పు ఇచ్చారు. జగన్‌కు సత్తెనపల్లి పర్యటన నిమిత్తం 3 కార్లు, 100 మంది జనానికి మాత్రమే ఏపీ పోలీసులు అనుమతి ఇచ్చారు. అంతకంటే ఎక్కువమంది ఎలా వెళ్తారు. మేం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాకు అనుమతులు ఇచ్చారా. 2029లో ఎన్నికలు ఉంటాయి.. ఇప్పుడు నీ వెంట వచ్చిన జనాన్ని చూసి మేము ఎందుకు భయపడతాం. అప్పటికీ నీ ఆటలు ఎలా సాగుతాయనేది చూస్తాం. మీ భవిష్యత్తును తీర్చిదిద్దే నాయకుడి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. రాష్ట్ర నాయకుడిని ఎన్నుకునేటప్పుడు ఎంత జాగ్రత్తగా ఉండాలి. ప్రజలు అడిగితే మేము సమాధానం చెబుతాం. కానీ మా నేతలను వైసీపీ శ్రేణులు నిలదీస్తే తాట తీస్తాను .. ఇందులో సందేహం లేదు. నీ వాహనాలు ఢీ కొట్టి ఒకరు చనిపోతే ఎందుకు పరామర్శించవు. బెట్టింగ్ ప్రాణానికి ఉన్న విలువ నీ వాహనం ఢీకొట్టి చనిపోయిన వారి ప్రాణానికి లేదా. నన్ను, వైజాగ్, తిరుపతిలో ఆపితే నేను దౌర్జన్యం చేశానా. 40 వేల మందిని పొదిలిలో ఎందుకు పోగేశావ్. నువ్వు పొగాకు వేలం కేంద్రానికి 40 వేల మందిని ఎలా తీసుకెళ్తావు. కుప్పంలో జరిగిన సంఘటనకు నేను సిగ్గు పడుతున్నాను. శాంతి భద్రతలు ప్రభుత్వానికి చాలా ముఖ్యం. చంపడం కూడా సినిమాల్లో చూపిస్తారు... వాటిని చూసి నేను బయట చంపుతానంటే ఎలా అని' సీఎం చంద్రబాబు ప్రశ్నించారు.

## అవును.. నిజమే..కాంగ్రెస్‌తో విభేదాలు

**తిరువనంతపురం-నవభూమి:** కాంగ్రెస్ ఎంపీ, కేరళ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి శశి థరూర్ ఎట్టకేలకు ఓపెన్ అయ్యారు. పార్టీతో తనకు కొన్ని అభిప్రాయ భేదాలు ఉన్నాయని అంగీకరించారు. అయితే, కాంగ్రెస్ పార్టీ నుండి ఎవరైనా తనను సంప్రదించినప్పుడు ఈ విభేదాలను ప్రైవేట్‌గా చర్చిస్తానని థరూర్ అన్నారు. 'నేను గత 16 సంవత్సరాలుగా కాంగ్రెస్‌లో పనిచేస్తున్నాను. పార్టీతో కొన్ని అభిప్రాయ భేదాలు ఉన్నాయి.. నేను వాటిని పార్టీ లోపల చర్చిస్తాను. ఈ రోజు దాని గురించి మాట్లాడాలనుకోవడం లేదు. నేను కలుసుకుని మాట్లాడాలి, సమయం రావాలి, అప్పుడు దాని గురించి చర్చిస్తాను.' అని ఎంపీ థరూర్ కేరళ తిరువనంతపురంలో మీడియాతో మాట్లాడుతూ అన్నారుఇలా ఉండగా, ఈ నెల ప్రారంభంలో భారత ప్రభుత్వం తలపెట్టిన ఆపరేషన్ సింధూర్ ఔట్ రీచ్ కార్యక్రమంలో శశిథరూర్ చురుగ్గా పాల్గొన్న సంగతి తెలిసిందే. అఖిలపక్ష ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తూ విదేశాలలో పహల్గాం దాడి, తర్వాత ఆపరేషన్ సిందూర్ తదితర పరిణామాల్ని.. ఉగ్రవాదంపై భారత స్టాండ్‌ను ప్రపంచానికి చాటి చెప్పారు

## ఆగని పోరు

**(1వపేజీ తరువాయి)**అర్థమవుతుందని అన్నారు. అంతేకాదు, యుద్ధంలో అమెరికా జోక్యం చేసుకుంటే కోలుకోలేని నష్టం తప్పదని, ఆ విషయం అమెరికన్లకు బాగా తెలుసని ఖమేనీ స్పష్టం చేశారు. మరోవైపు, ఇజ్రాయేల్ గూఢచారి సంస్థలకు వాట్సాప్ ద్వారా సమాచారం చేరుతుందనే అనుమానంతో వెంటనే యాప్‌ను డిలీట్ చేయాలని ఇరాన్ సూచించింది.

**ఇరాన్‌పై దాడి అంత ఈజీ కాదు**

ఇజ్రాయేల్‌తో కొనసాగుతున్న ఘర్షణలో అమెరికా జోక్యం చేసుకుంటే పశ్చిమాసియాలో విస్తృత యుద్ధానికి దారితీస్తుందని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి సైతం హెచ్చరించారు. 'అమెరికా తన స్థానంలోనే ఉండాలని, లేకుంటే భారీ విధ్వంసం తప్పదు' అని హెచ్చరించారు మరోవైపు, ఇరాన్‌ను ఎదుర్కోటానికి ఇజ్రాయేల్ అత్యంత జాగ్రత్తగా ఉంటుందని ఐడీఎఫ్ పేర్కొంది. ఇరాన్ ఆత్మరక్షణ హక్కును టర్కీ సమర్థించింది. యుద్ధం మరింత తీవ్రతరమయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఇరాన్, ఇజ్రాయేల్ యుద్ధంలో అమెరికా రంగప్రవేశం చేస్తూ అత్యంత ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది అని ఆందోళన వ్యక్తమవుతోంది. పోరాటం ప్రారంభమైందని ఖమేనీ ప్రకటిస్తూ.. యుద్ధానికి సిద్ధమవ్వాల్సిన పరిస్థితులున్నాయని సూచించారు. కాగా, ఒకప్పుడు అమెరికాను కాదని, ఇరాన్-ఇజ్రాయేల్‌లు చెట్టపట్టాలేసుకుని తిరగడం గమనార్హం.
ఇరాన్‌పై వందల కొద్దీ ఫైటర్ జెట్లతో ఇజ్రాయేల్ దాడి.. ఆర్మీ చీఫ్ సహా పలువురు హతం
ఇరాన్ పశ్చిమ ప్రాంతాల్లోని 40కంటే ఎక్కువ లక్ష్యాలపై భారీ ఎత్తున వైమానిక దాడులు జరిపినట్టు ఇజ్రాయేల్ రక్షణ దళాలు (%×ణఫీ%) బుధవారం అధికారికంగా ప్రకటించాయి. 'ఈ ఉదయం, ఇంటెలిజెన్స్ ఆదేశాల మేరకు, ఎయిర్ ఫోర్స్ ఫైటర్ జెట్లు పశ్చిమ ఇరాన్‌లోని సైనిక లక్ష్యాలపై దాడులు మొదలుపెట్టాయి' అని ఎక్స్ (ట్విట్టర్)లో తెలిపాయి. ఈ దాడుల్లో సుమారు 25 యుద్ధ విమానాలు పాల్గొన్నాయి. ఇజ్రాయేల్‌ను లక్ష్యంగా చేసుకున్న క్షిపణి వ్యవస్థలు, ఆయుధ నిల్వ కేంద్రాలు, ఇరాన్ ప్రభుత్వ అనుబంధ సిబ్బందిపై దాడులు చేశాయని సమాచారం.
ఇజ్రాయేల్ అధికారులు ఈ దాడులకు ముందు ఇరాన్ రెండు అణు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలపై దాడులు చేసినట్లు కూడా వెల్లడించారు. వీటిలో ఒకటి టెహ్రాన్‌లోని ప్రధాన అణు కేంద్రం కావడం గమనార్హం. ఇరాన్ ఈ దాడులపై అధికారికంగా స్పందించలేదు. కాగా, ఈ దాడులకు ముందు ఇరాన్ ఇటీవలి హైపర్‌సోనిక్ మిసైల్ దాడి కూడా ఇజ్రాయేల్‌పై జరిపింది.

## అణు యుద్ధాన్ని ఆపింది నేనే

**(1వపేజీ తరువాయి)**ఉగ్రవాదులను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నట్లు మోదీ వివరించారని మిస్రీ తెలిపారు."ఈ మొత్తం పరిణామక్రమంలో ఎక్కడా భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం, లేదా అమెరికా మధ్యవర్తిత్వం గురించి చర్చే జరగలేదని ప్రధాని మోదీ ట్రంప్‌నకు తేల్చిచెప్పారు.. కాల్పుల విరమణ నిర్ణయం పూర్తిగా భారత్, పాకిస్థాన్ మిలటరీ ఆపరేషన్ల డీజీలు నేరుగా చర్చల ద్వారా తీసుకున్నారు... అది కూడా పాకిస్థాన్ విజ్ఞప్తి చేయడంతోనే జరిగింది.. భారత్ ఎప్పటికీ మధ్యవర్తిత్వాన్ని అంగీకరించదు, అంగీకరించబోదని ప్రధానమంత్రి మోదీ స్పష్టంగా చెప్పారు... ఈ విషయంలో దేశం ఏకతాటిపై ఉంది" అని మిస్రీ తెలిపారు. మే 7న భారత్ సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టి. పాక్, పీఓకేలోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది. దీంతో సరిహద్దుల్లో భారత సైనిక స్థావరాలు, పౌర నివాసాలే లక్ష్యంగా పాకిస్థాన్ దాడులకు ప్రయత్నించింది. వీటిని సమర్ధవంతంగా అడ్డుకుని.. పాక్‌పై భారత్ ఎదురుదాడి చేసి.. దాని వైమానిక స్థావరాలు, రాడార్ కేంద్రాలను ధ్వంసం చేసింది.

## బనకచర్లపై తెలంగాణ సీరియస్

**(1వపేజీ తరువాయి)**యాజమాన్య బోర్డు, కేంద్ర జల సంఘం ఆపై జలశక్తి మంత్రి అధ్యక్షతన ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉండే అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి అనుమతి పొందాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బనకచర్ల విషయంలో ఏపీ ఈ నిబంధనలన్నింటినీ ఉల్లంఘిస్తోందని సీఎం ఆరోపించారు. వరద జలాల పేరుతో నిబంధనలు పాటించకుండా ప్రాజెక్టు చేపట్టడం అభ్యంతరకరమన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, జలశక్తి మంత్రిత్వ శాఖ తక్షణమే జోక్యం చేసుకొని బనకచర్ల ప్రాజెక్టును నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు.

**పోలవరం,ఇతర ప్రాజెక్టులపైనా చర్చ**

పోలవరం కింద పురుషోత్తపట్నం, వెంకటనగరం, పట్టిసీమ, చింతలపూడి ఎత్తిపోతల పథకాలను అనుమతులు లేకుండానే ఏపీ చేపట్టిందని సీఎం వివరించారు. పోలవరం డిజైన్లను -1980 నిబంధనలకు విరుద్ధంగా మార్చారని, పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా పనులు చేపడుతున్నారని ఆరోపించారు. తమ అభ్యంతరాలు ఉన్నా పనులు కొనసాగిస్తున్నారని సీఎం పేర్కొన్నారు. జాతీయ ప్రాజెక్టయిన పోలవరంలో నిబంధనల ఉల్లంఘన జరగకుండా కేంద్రం దృష్టి సారించాలని కోరారు.

**తెలంగాణకు 1500 టీఎంసీల అనుమతి ఇవ్వాలి:**

గోదావరి నదిలో 1000 టీఎంసీలు, కృష్ణా నదిలో 500 టీఎంసీలు కలిపి మొత్తం 1500 టీఎంసీల నీటి వినియోగానికి కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ నుండి నిరభ్యంతర పత్రం (%చీూజ%) జారీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. 1500 టీఎంసీల నీటితో కోటిన్నర ఎకరాలకు నీరు అందుతుందని, ఆ తర్వాత ఏపీ చేపట్టే ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను పరిశీలిస్తే తమకు అభ్యంతరం లేదన్నారు. తెలంగాణ ప్రాజెక్టులైన పాలమూరు-రంగారెడ్డి, సమ్మక్క-సారక్క, తుమ్మిడిహెట్టిలకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని సీఎం కోరారు. మూసీ పునరుజ్జీవనానికి కూడా నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం స్పందన అనుకూలంగా లేకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని సీఎం స్పష్టం చేశారు.

## కూటమి పనితీరు భేష్

**(1వపేజీ తరువాయి)**చెప్పారు. అమరావతిపై అభిప్రాయం అడిగితే దానిపైనే ఎక్కువగా ఫోకస్ పెడుతున్నారని 78 శాతం మంది, రాజధాని అభివృద్ధి చెందాలని మరో 22 శాతం మంది చెప్పారు.
రాష్ట్రంలో మంత్రుల పనితీరు అడిగితే ఆరుగురు మంత్రులు (చంద్రబాబు, పవన్, లోకేష్, నారాయణ, రామానాయుడు,పయ్యా వుల కేశవ్) పనితీరు బాగుందని, మరో 9 మంది మంత్రులు (కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, కందుల దుర్గేష్, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు, ఆనం రామనారాయణరెడ్డి) పనితీరు పర్వాలేదని చెప్పారు. ఇక 10 మంది మంత్రులు (కొల్లు రవీంద్ర, సత్యకుమార్, పార్ధసారథి, బాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవి, బీసీ జనార్ధన్ రెడ్డి, సవిత, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్) పనితీరు బాగోలేదని చెప్పారు.

## విమాన ప్రమాదంలో బ్లాక్ బాక్స్ ధ్వంసం

**(1వపేజీ తరువాయి)**ప్రాథమికంగా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో ర్యాన్ ఎయిర్ టర్బైన్-ర్యాట్ మోహరించి ఉన్నట్లు విమానం కూలకముందు రికార్డ్ అయిన దృశ్యాల్లో కనిపిస్తోంది. రెండు ఇంజిన్లు ఫెయిల్ అయినపుడు.. విమానంలో ఈ ర్యాట్‌ను ఓపెన్ చేస్తారని విమానయాన నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే విమాన ప్రమాదానికి గల సరైన కారణం కావాలంటే అందులోని బ్లాక్ బాక్స్‌లోని సమాచారం కీలకం కానుంది. ఇక కూలిన విమానంలోని బ్లాక్ బాక్స్‌ను ఇప్పటికే సంఘటనా స్థలంలోనే దర్యాప్తు అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అయితే ఇంతటి ఘోర విమాన ప్రమాదం దెబ్బకు అత్యంత కీలకమైన బ్లాక్ బాక్స్ దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. దీంతో అందులోని సమాచారాన్ని సేకరించేందుకు కష్టంగా మారినట్లు సమాచారం. అందుకే ఆ బ్లాక్ బాక్స్‌లోని డేటాను విశ్లేషించేందుకు దాన్ని విదేశాలకు పంపించేందుకు దర్యాప్తు అధికారులు సిద్ధమైనట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన సమాచారాన్ని అధికార వర్గాలు చెప్పారని పలు మీడియాల్లో వార్తలు వస్తున్నాయి. ప్రమాదం జరిగిన తర్వాత స్థానిక బీజే మెడికల్ కాలేజీ భవనంపై నుంచి అధికారులు ఈ బ్లాక్ బాక్స్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలోనే ఆ బ్లాక్ బాక్స్ నుంచి మరింత మెరుగైన సమాచారాన్ని రాబట్టేందుకు దాన్ని అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో ఉన్న జాతీయ రవాణా భద్రతా బోర్డుకు పంపే అవకాశాలు ఉన్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అమెరికాకు పంపే సమయంలో అవసరమైన అన్ని ప్రొటోకాల్స్‌ను పాటించడంతో పాటు.. బ్లాక్‌బాక్స్‌తో పాటు భారత్ అధికారుల బృందం కూడా దాని వెంటే వెళ్తుందని తెలిపాయి. అయితే ఈ బ్లాక్ బాక్స్‌ను అమెరికాకు పంపించడం గురించి.. కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ బ్లాక్ బాక్స్‌లోని సమాచారం తెలియాలంటే.. దాన్ని అమెరికాకు పంపించాల్సిందేనని అర్థం అవుతోంది. ఈనెల 12వ తేదీన అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయల్దేరిన విమానం.. ఎయిర్‌పోర్టు నుంచి టేకాఫ్ అయి గాల్లోకి ఎగిరిన వెంటనే బీజే మెడికల్ కాలేజీ హాస్టల్ భవనంపై కుప్పకూలడం పెను సంచలనంగా మారింది. ఈ ఘటనలో విమానంలోని 241 మంది ప్రయాణికులతో పాటు మొత్తంగా 270 మంది మృతి చెందారు. ఇందులో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే అసలు విమానం ఎందుకు వెంటనే కూలిపోయిందనే కచ్చితమైన సమచారాన్ని తెలుసుకునేందుకు బ్లాక్‌బాక్స్ కీలకం కానుంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్ శుక్రవారం 20 జూన్ 2025

## బెంగళూరు మెట్రోలో అమూల్ స్టాళ్లు



**బెంగళూరు-నవభూమి:**నమ్మ మెట్రో రైల్వే స్టేషన్‌లలో గుజరాత్‌కు చెందిన అమూల్ పాల ఉత్పత్తులు విక్రయించేందుకు అనుమతిలివ్వడంపై కన్నడిగులు మండి పడుతున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో అమూల్ విక్రయాలను ప్రోత్సహించేలా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రస్తావించడం తీవ్ర వివాదానికి దారి తీసింది. దీనిని కాంగ్రెస్ నేతలు ఎన్నికల్లో ప్రచారాస్త్రంగాను ఉపయోగించుకున్నారు. ప్రస్తుతం రెండు మెట్రో స్టేషన్‌లలో అమూల్ స్టాళ్లు తెరిచేందుకు అవకాశం ఇచ్చారు. ఇదే విషయమై డీసీఎం డీకే శివకుమార్(బుధవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ 10 మెట్రో స్టేషన్‌ల్లో పాల ఉత్పత్తులకు అనుమతులు ఇచ్చామని, 8 చోట్ల నందిని, 2 చోట్ల అమూల్ స్టాళ్లు ఏర్పాటవుతాయన్నారు. గ్లోబల్ టెండర్లలో వారికి అవకాశం దక్కిందన్నారు. స్టాళ్లు మూయించడం సరికాదన్నారు. గ్రేటర్ బెంగళూరు అథారిటీలో ఎన్ని పాలికెలు ఏర్పాటు చేయాలనేది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో చర్చించామని, ప్రతిపక్ష నాయకులతో చర్చించాక తుదినిర్ణయం తీసుకుంటామన్నారు. స్వచ్ఛబెంగళూరు కార్యక్రమానికి హెల్ప్‌లైన్ తెరుస్తామన్నారు.

## మేక్ ఇన్ ఇండియా- అమెరికాకు భయం!

'మోదీ నా మంచి మిత్రుడు"... "భారతీయులంటే నాకు అమితమైన గౌరవం"... "ఇండియా గొప్ప దేశం" అంటూ అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ తరచూ ప్రకటిస్తూ ఉంటారు. మిత్రత ఉవాచలు పలుకుతూ తమ దేశంలో భారతీయుల ఓట్లను, భావోద్వేగాలను ఆకర్షించే ప్రయత్నం చేస్తారు. కానీ ఈ మాటల వెనుక దాగి ఉన్న వాస్తవాలు పూర్తిగా భిన్నమైనవి. వాస్తవికంగా అమెరికా, భారత అభివృద్ధి పట్ల అసహనం చూపిస్తూ... నీటి అడుగున రాళ్లల్లా భారత్‌పై వ్యూహాత్మక దాడులు చేస్తూ వస్తున్నదన్న ఆరోపణలకు ఆధారాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి.

మైత్రీ మాటల వెనుక వ్యాపార స్వార్థం, రాజకీయ కుతంత్రం, భవిష్యత్ ప్రపంచ వ్యూహాల్లో తన ఆధిపత్యాన్ని నిలుపుకునే తపన... ఇవన్నీ అమెరికా ప్రవర్తనలో కనిపిస్తున్న లక్షణాలు. డొనాల్డ్ ట్రంప్ మాటల్లో భారత ప్రధాని మోదీ స్నేహితుడైనా, అదే ట్రంప్ ఇటీవల భారత్‌లో ఆపిల్ కంపెనీ పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించడం చర్చనీయాంశం అయింది.

మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి కార్యక్రమాలు దేశ ఆర్థిక స్థితిని బలపరుస్తుండటం... భారత్ 11వ స్థానం నుండి 4వ ఆర్థిక శక్తిగా ఎదగడం... ఇవన్నీ అమెరికా కంటిలో మంటలు రేపుతున్నాయి. భారత అభివృద్ధిని అడ్డుకోవాలన్న అమెరికా సంకల్పానికి ఉదాహరణగాటెక్ దిగ్గజాలను భారత్‌లో పెట్టుబడులు పెట్టకుండా చేసే ఒత్తిళ్లు, ఇన్వెస్ట్‌మెంట్ నష్టాలు కలిగించే వార్తలు, రిపోర్టుల పేరుతో షేర్ మార్కెట్‌ను కుదించే ప్రయత్నాలు మొదలైనవి పేర్కొనవచ్చు.

గతంలో జరిగిన పంజాబ్ రైతు ఉద్యమం, ఢిల్లీ షాహీన్ బాగ్ ఉద్యమాలుదేశంలోని కొన్ని ప్రాంతాల అశాంతికి కారణమైన మార్గాలు ఇవన్నీ విదేశీ నిధులతో, అంతర్జాతీయ జోక్యంతో జరిపిన కార్యకలాపాలేనా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. శ్రీలంక, బంగ్లాదేశ్‌లో ప్రభుత్వం కూల్చిన విధానాలతో పోలికలు ఇవి కలిగిస్తున్నాయి.

బైడెన్ ప్రభుత్వం ప్రయత్నాలు %-% ట్రంప్ నోరుమీసే నిజం డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన సంచలన వ్యాఖ్యల్లో బైడెన్ హయాంలో భారత ఎన్నికల వ్యవస్థలో జోక్యం చేసేందుకు నిధులు కేటాయించిందన్న ఆరోపణలు తీవ్ర ప్రభావం చూపించాయి. ఇవి సన్నివేశాలుగా మాత్రమే కాక, వ్యూహాలుగా కూడా అర్థమవుతున్నాయి.

భారత రాష్ట్రాలు విదేశీ పెట్టుబడుల కోసం చొరవ చూపుతూ ఉన్నాయన్నది తెలియడంతో... అమెరికా కూడా చైనాను అణగదొక్కిన తీరులో భారత్‌ను చూస్తూ ఉండదనే భయం పాలకుల్లో ఉన్నట్లు కనిపిస్తోంది. ట్రంప్ మాటల్లో"ఆపిల్ ఇండియాలో పెట్టుకుంటే అధిక సుంకాలు విధిస్తాం" అన్న హెచ్చరిక... అమెరికా కంపెనీలపై ఒత్తిడి వేసే కుట్రలను బహిరంగం చేసింది.

చైనా తరహా పొరపాటు మళ్లీ జరగనివ్వొద్దన్న అమెరికా ధోరణి ఒకప్పుడు చైనాపై ఆధారపడిన అమెరికా... ఇప్పుడు అదే దారి భారత్‌లో పునరావృతం కాకూడదన్న ఉద్దేశంతో ప్రవర్తిస్తున్నది. అమెరికా పారిశ్రామికవేత్తలు చైనాను వదిలి భారత్‌కు వస్తుండడమే ఇందుకు ప్రథమ సూచిక.

విదేశీ దౌత్యంలో 'ఇండైరెక్ట్ స్ట్రాటజీ' ఓ ముఖ్యమైన ఆయుధం. అమెరికా ఇటీవలి కాలంలో భారత ప్రతిపక్షాల చేతుల్లో 'సాఫ్ట్ పవర్' ప్రయోగాల్ని చేస్తున్నారు అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల్లో భయాన్ని కలిగించేలా నిర్దిష్ట చర్చలు, టీవీ చానళ్ల ప్రచారాలు, అంతర్జాతీయ సంస్థల రేటింగ్?

హిండెన్‌బర్గ్ నివేదిక ద్వారా అదానీ గ్రూప్‌పై తీవ్ర ఆరోపణలు లేవనెత్తడంతో భారత స్టాక్ మార్కెట్ భారీ నష్టాన్ని చవిచూసింది. ఇదే సమయంలో అమెరికాకు చెందిన కొన్ని కంపెనీలు వ్యాపారంగా లాభపడటమూ గమనార్హం.అదానీ గ్రూప్‌కు సంబంధించి కెన్యాలో రద్దైన ఒప్పందం వెనుక కూడా అమెరికా ఒత్తిడే ఉందని విశ్లేషకుల అభిప్రాయం. ఇది భారత్‌కు ఆఫ్రికా మార్కెట్లలోకి ప్రవేశం అడ్డుకోవడమేనా?అగ్రరాజ్య హోదాను నిలబెట్టుకోవాలంటే ఎదుగుతున్న దేశాలను అణచివేయాల్సిందే అనే ధోరణి అమెరికా పాలకుల దృక్పథం. భారత్‌లో స్థిరమైన ప్రభుత్వం, పారిశ్రామిక వృద్ధి, ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్న డిజిటల్ మిషన్లుఇవన్నీ అమెరికాకు తలపోట్లే.'రిపోర్టులు', 'జర్నలిస్టిక్ లీకులు', 'అన్‌వెరిఫైడ్ డేటా' అనే పేర్లతో భారత్‌కు వ్యతిరేకంగా గిరగిరలాడే ప్రచారాన్ని అమెరికా ఆధారిత సంస్థలు నడిపిస్తున్నాయన్నది వాస్తవమే. ఇవి అంతర్జాతీయ నష్టాలను కలిగించేందుకు ఉపయోగపడుతున్నాయి.

కేంద్రం మేక్ ఇన్ ఇండియా, స్టార్ట్ అప్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలపై మరింత దృష్టి పెడుతున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మేళనాల్లో పాల్గొంటూ పెట్టుబడుల్ని ఆకర్షిస్తున్నాయి.

అమెరికా చేస్తున్న కుట్రలు ఎన్ని దారుణమైనవైనా, ప్రజా విశ్వాసం, పారిశ్రామిక చైతన్యం, యువతలో నూతన ఆత్మవిశ్వాసం భారత అభివృద్ధిని ఆపలేవు. భయపడాల్సింది అమెరికా. ఎందుకంటే చైనాను తక్కువ అంచనా వేసి చేసిన పొరపాటు, ఇప్పుడు భారత్ విషయంలో పునరావృతం కావడం ఖాయం.

'స్నేహం మాటున కుట్రలు" అనిపించే ఈ సంఘటనలు ఆలోచనాత్మకంగా మారుతున్నాయి. అమెరికా మాటలు కాదు, చర్యలు చూడాలి. స్నేహ హస్తంతో పలకరిస్తూనే వెనుక జేబులో కత్తి దాచే వాడి సైకం మనం గుర్తించాలి. దేశాభివృద్ధిలో ప్రతి పౌరుడూ భాగస్వామిగా ఉండాల్సిన తరుణమిది.

అమెరికా దౌత్యకళ ఆధునిక ప్రపంచ రాజకీయాల్లో ఒక పాఠశాల. ఇది రెండు ముఖాలతో ముందుకు సాగుతుంది:

భారత్ విషయంలో ఇదే జరుగుతోంది. నడుమ 'క్వాడ్' వంటి మైత్రి కూటముల్లో భాగస్వామ్యమవుతూనే అంతర్గతంగా వ్యాపార వ్యవస్థపై ఆధిపత్యాన్ని కల్పించుకునే కుట్రలు నడుస్తున్నాయి.

వ్యూహాత్మక ఆర్థిక యుద్ధం: అణు బాంబుల కంటే ప్రమాదకరం పరంపరలుగా జరిగే ఒక 'సైలెంట్ వార్' మనమరచిపోవద్దు ు అది ఆర్థిక యుద్ధం. దీని లక్షణాలు:సూక్ష్మంగా పెట్టుబడిదారులపై ప్రభావం చూపే అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీలునివేదికల పేరిట ప్రచారం ద్వారా దేశీయ కంపెనీలను బలహీనపరచడం అధికారికంగా సుంకాలు, నియంత్రణలు విధించడం, తద్వారా పారిశ్రామిక వృద్ధిని అడ్డుకోవడంఅదానీ వ్యవహారం, కెన్యాలో ఒప్పంద రద్దు ు ఇవన్నీ దీన్నే నిరూపిస్తున్నాయి.

ఇప్పుడు ప్రపంచం బహుళపక్ష వ్యవస్థ వైపు సాగుతోంది. బ్రిక్స్, షాంఘై సంస్థ, గ్లోబల్ సౌత్ ఉద్యమాల ద్వారా అమెరికా ఏకాధిపత్యం తగ్గిపోతోంది. దీనిపై అమెరికా అపోహలో ఉంది:చైనాను మించిన అభివృద్ధి శక్తిగా భారత్ ఎదగకూడదుఅంతర్జాతీయ వేదికలపై భారత్ ప్రాముఖ్యత పెరగకూడదుభారత్‌కు స్వయం సమర్థత కలగకూడదుఅందుకే, భయంతోనే అమెరికా కుట్రలతో రగులుతోంది.

# భారతదేశం - ఒక విశ్వగురు పాత్ర

## అంతర్జాతీయ యోగా దినోత్సవం




**యోగాతో ఆరోగ్యం, శాంతికి భారత్ బహుమతి:**

ప్రతి సంవత్సరం జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకోవడం, భారతదేశానికి నిజంగా గర్వకారణం. వేద కాలం నాటి నుండి భారతీయ సంస్కృతిలో అంతర్భాగమైన యోగా, నేడు ప్రపంచ ఆరోగ్య, ఆధ్యాత్మిక రంగంలో ఒక విప్లవాన్ని సృష్టిస్తోంది. ఐక్యరాజ్యసమితి 2014లో యోగా దినోత్సవాన్ని ప్రకటించినప్పటి నుండి, భారతదేశం ఈ పురాతన శాస్త్రాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో, దాని ప్రాముఖ్యతను నొక్కి చెప్పడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ దినోత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాదు, ఆధునిక ప్రపంచంలో యోగా యొక్క ఔచిత్యాన్ని, భారతదేశం ప్రపంచ గురువుగా ఎలా నిలబడిందో పునరుద్ఘాటించే ఒక గొప్ప అవకాశం.

**ఆధునిక జీవనశైలికి సంపూర్ణ పరిష్కారం:**

ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి, ఆందోళనలు, శారీరక నిష్క్రియాత్మకత పెరిగిపోతున్న ఈ తరుణంలో, యోగా ఒక సంపూర్ణ పరిష్కారంగా ఉద్భవించింది. శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక ఉన్నతి – ఈ మూడింటినీ ఒకేసారి అందించే

అద్భుతమైన మార్గం యోగా. ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం వంటి వివిధ ప్రక్రియల ద్వారా యోగా మన శరీరాన్ని బలోపేతం చేయడమే కాకుండా, మనస్సును శాంతపరచి, ఏకాగ్రతను పెంచుతుంది. భారతదేశంలో, యోగా కేవలం వ్యాయామం కాదు, అది ఒక జీవన విధానం. వేల సంవత్సరాల నుండి తరం వెనుక తరం దీనిని అభ్యసిస్తూ, దాని ప్రయోజనాలను అనుభవిస్తూ వస్తున్నారు. ఋషులు, మునులు తమ అంతర్గత శక్తులను మేల్కొల్పడానికి, ప్రకృతితో అనుసంధానం కావడానికి యోగాను ఒక సాధనంగా ఉపయోగించారు. నేడు, అదే యోగా పద్ధతులను



ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజలు ఆచరిస్తున్నారు, ఆరోగ్యంగా, సంతోషంగా జీవించడానికి ఇది ఒక మార్గంగా మారింది.

**భారతదేశం– ప్రపంచానికి యోగా వారధి:**

అంతర్జాతీయ యోగా దినోత్సవం భారతదేశానికి ఒక ప్రత్యేకమైన వేదికను అందించింది. ఈ దినోత్సవం ద్వారా, భారతదేశం తన సాంస్కృతిక వారసత్వాన్ని, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రపంచంతో పంచుకోవడానికి అవకాశం లభించింది. ప్రభుత్వం, వివిధ యోగా సంస్థలు ఈ దినోత్సవాన్ని విజయవంతం చేయడానికి అద్భుతమైన కృషి చేస్తున్నాయి. పెద్ద ఎత్తున బహిరంగ యోగా శిబిరాలు, సదస్సులు, చర్చా గోష్టులు నిర్వహించడం ద్వారా ప్రజలకు యోగాపై అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో యోగాను ఒక పాఠ్యాంశంగా చేర్చడం ద్వారా యువ తరానికి దాని ప్రాముఖ్యతను తెలియజేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు కూడా యోగాను విస్తరింపజేయడం ద్వారా, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించే లక్ష్యాన్ని భారతదేశం కొనసాగిస్తోంది. ఈ ప్రయత్నాలు కేవలం ఒక రోజు కార్యక్రమానికే పరిమితం కాకుండా, ఏడాది పొడవునా యోగా సాధనను ప్రోత్సహించడానికి దోహదపడుతున్నాయి.

**విశ్వగురువుగా భారత్ ప్రస్థానం:**

అంతర్జాతీయ యోగా దినోత్సవం, భారతదేశాన్ని "విశ్వగురు"గా మరోసారి నిరూపించింది. ప్రపంచం శాంతి, సామరస్యం కోసం వెతుకుతున్న ఈ సమయంలో, భారతదేశం యోగా ద్వారా మానసిక ప్రశాంతత, శారీరక ఆరోగ్యాన్ని అందిస్తోంది. కోవిడ్-19 మహమ్మారి సమయంలో, యోగా యొక్క ప్రాముఖ్యత మరింతగా స్పష్టమైంది. శ్వాస వ్యాయామాలు, ధ్యానం రోగనిరోధక శక్తిని పెంచడంలో, మానసిక ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు తమ ఇళ్లలోనే యోగాను అభ్యసిస్తూ, ఆరోగ్యాన్ని కాపాడుకున్నారు. ఇది యోగా యొక్క సార్వత్రికతకు, దాని అనుకూలతకు నిదర్శనం. ఆధునిక వైద్యశాస్త్రం కూడా యోగా యొక్క ప్రయోజనాలను గుర్తిస్తోంది. అనేక ఆసుపత్రులు, క్లినిక్‌లు చికిత్సా పద్ధతులతో పాటు యోగాను సిఫార్సు చేస్తున్నాయి. దీర్ఘకాలిక వ్యాధుల నివారణలో, ఒత్తిడి సంబంధిత సమస్యల ఉపశమనంలో యోగా అద్భుతమైన ఫలితాలను ఇస్తోంది.

**సవాళ్లు, భవిష్యత్ కార్యాచరణ:**

అయితే, ఈ విజయం కేవలం ఆరంభం మాత్రమే. భారతదేశం యోగాను మరింత విస్తృతం చేయడానికి అనేక సవాళ్లను అధిగమించాలి. యోగా అసలైన సారూప్యాన్ని నిలుపుకుంటూ, దానిని వాణిజ్యీకరణకు గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. యోగాను కేవలం ఒక వ్యాయామంగా కాకుండా, అది ఒక ఆధ్యాత్మిక సాధనగా, సంపూర్ణ జీవన విధానంగా గుర్తించాలి. ప్రభుత్వం, యోగా నిపుణులు, సాధారణ ప్రజలు కలిసికట్టుగా కృషి చేస్తేనే ఇది సాధ్యమవుతుంది. గ్రామీణ ప్రాంతాలకు యోగా బోధకులను పంపడం, తక్కువ ఖర్చుతో యోగా శిక్షణను అందించడం, యోగాను మరింత అందుబాటులోకి తీసుకురావడం వంటి చర్యలు అవసరం. అంతేకాకుండా, యోగా శాస్త్రీయ పునాదులపై మరింత పరిశోధన జరపడం ద్వారా దాని ప్రయోజనాలను మరింత స్పష్టంగా నిరూపించవచ్చు.

**యోగా: జీవన విధానం, ప్రపంచ శాంతికి మార్గం:**

చివరగా, అంతర్జాతీయ యోగా దినోత్సవం భారతదేశానికి కేవలం ఒక వేడుక కాదు, ఇది ఒక బాధ్యత. యోగా ద్వారా ప్రపంచ శాంతికి, ఆరోగ్యానికి దోహదపడే ఒక గొప్ప అవకాశం. ఈ రోజున మనం యోగా యొక్క నిజమైన స్ఫూర్తిని స్మరించుకుంటూ, దానిని మన దైనందిన జీవితంలో భాగం చేసుకుందాం. కేవలం ఒక రోజు పాటించే ఆచారంగా కాకుండా, యోగాను ఒక జీవన విధానంగా స్వీకరించి, ఆరోగ్యకరమైన, సంతోషకరమైన, శాంతియుత ప్రపంచ నిర్మాణంలో మన వంతు పాత్రను పోషిద్దాం. భారతదేశం అందించిన ఈ అద్భుతమైన బహుమతిని ప్రపంచం ఆచరిస్తున్న తీరు, మన సంస్కృతి యొక్క గొప్పదనానికి, దూరదృష్టికి నిదర్శనం. యోగా దినోత్సవం ప్రతి ఒక్కరి జీవితంలో శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సును తీసుకురావాలని ఆశిద్దాం.

జనక మోహన రావు దుంగ
8247045230

# వికసిత భారత్ లక్ష్యంలో బొగ్గు పాత్ర



భారత విద్యుత్ వినియోగంలో అసమతులత

ప్రపంచవ్యాప్తంగా తలసరి విద్యుత్ వినియోగం భారతదేశం కంటే చాలా ఎక్కువ. మన దేశంలో ఇది సుమారు 1,395 యూనిట్లు మాత్రమే కాగా, యుఎస్‌ఏలో ఇది 12,497 యూనిట్లు, చైనాలో 6,150 యూనిట్లు. ఖతార్, కువైట్, సౌదీ అరేబియా వంటి దేశాలకంటే కూడా మన వినియోగం తక్కువగా ఉంది. ఇది దేశ అభివృద్ధిలో విస్తృత గ్యాప్‌ను చూపుతుంది. పునరుత్పాదక ఇంధనంలో పురోగతి

2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్ పునరుత్పాదక ఇంధన రంగంలో 29.52 గిగావాట్ల సామర్థ్యాన్ని పెంచుకొని, మొత్తం 220.10 గిగావాట్లకు చేరుకుంది. 2030 నాటికి 500 గిగావాట్ల లక్ష్యం భారత ఆచరణలో పెట్టుకుంది. ఇది ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలకు పాత్రమైంది.

**బొగ్గు వినియోగంలో ఆధారపడటం**

కానీ ఈ పురోగతికి వ్యతిరేకంగా, భారత్ ఇంకా బొగ్గుపై అధికంగా ఆధారపడుతున్నది. 2024%-%25 నాటికి 483.26 గిగావాట్ల విద్యుత్ సామర్థ్యం లో 210 గిగావాట్లు బొగ్గుపైనే ఆధారపడినవి. అంటే దాదాపు 55 శాతం విద్యుత్ ఉత్పత్తి బొగ్గు ఆధారితమే.

**ఇంధన భద్రతకు బొగ్గు అవసరం**

2024-25లో భారత్ ఒక బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి చారిత్రక ఘట్టాన్ని నమోదు చేసింది. ఇంధన భద్రత, ఆర్థిక వృద్ధికి బొగ్గు కీలకంగా మారింది. కేంద్రం తీసుకువచ్చిన సంస్కరణలు, ప్రైవేట్ సంస్థలకు గనుల నిర్వహణ అవకాశాలు, సింగిల్ విండో విధానం ఈ పురోగతికి దోహదం చేశాయి.

**దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం**

దేశీయ బొగ్గు ఉత్పత్తి పెరగడంతో దిగుమతులు 8.4 శాతం తగ్గి, దాదాపు 5.43 బిలియన్ల విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయగలిగింది. ఇండోనేసియా, ఆస్ట్రేలియా వంటి దేశాల నుంచి దిగుమతుల అవసరం తగ్గుతోంది.

**బొగ్గు ఆధారిత ప్రాజెక్టులకు కేంద్ర ప్రోత్సాహం**

బొగ్గు/లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల కోసం రూ.8,500 కోట్లతో పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నైట్రేట్ ప్రాజెక్టులకు ఈక్విటీ పెట్టుబడులు కూడా మంజూరు అయ్యాయి.

పునరుత్పాదక విద్యుత్‌లో సవాళ్లు

సౌర, పవన విద్యుత్ వాతావరణ ఆధారితమైనవి కావడంతో స్థిర విద్యుత్ ఉత్పత్తికి అనువుగా ఉండవు. గ్రిడ్ నిర్వహణలో ఇది ఓ ప్రధాన సమస్యగా మారింది. దీంతో నిత్యం నమ్మకమైన విద్యుత్ కోసం బొగ్గు ఆధారిత ఉత్పత్తి అవసరమవుతోంది.

**వికసిత భారత్ లక్ష్యంలో బొగ్గు పాత్ర**

భారత ప్రభుత్వం 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్న 'వికసిత్ భారత్ ఏ 2047' లక్ష్యాన్ని ప్రకటించింది. ఈ దిశగా బొగ్గు రంగం కీలక భాగస్వామిగా కొనసాగుతోంది.

**క్లైమేట్ మార్పు లక్ష్యాలు**


సమావేశంలో భారత్ 2070 నాటికి నెట్-జీరో కార్బన్ ఉద్గార లక్ష్యాన్ని ప్రకటించింది. ఇది బొగ్గు వినియోగం పూర్తిగా మానేయడం కాదు. సాంకేతిక మార్గాల్లో ఉద్గారాలపై నియంత్రణ, అడవుల విస్తరణతో సమతుల్యత సాధించడం.

దేశ అభివృద్ధికి విద్యుత్ కీలకం. విద్యుత్‌కు బొగ్గు ఇప్పటికీ ప్రధాన ఆధారం. పునరుత్పాదక శక్తిలో పురోగతి ఉన్నప్పటికీ, స్థిర విద్యుత్‌కు థర్మల్ విద్యుత్ అవసరం మరువలేనిది. బొగ్గు రంగాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ దేశ భద్రత, ఆర్థికాభివృద్ధి లక్ష్యాలను సాధించడం భారత్ ముందు ఉన్న ప్రధాన కర్తవ్యంగా నిలిచింది.ప్రస్తుతం మన దేశ తలసరి విద్యుత్ వినియోగం సుమారు 1,395 యూనిట్లు మాత్రమే. ఇది ప్రపంచ సగటు విద్యుత్ వినియోగం కంటే చాలా తక్కువ. యూఎస్‌ఏ తలసరి విద్యుత్ వినియోగం సుమారు 12,497 యూనిట్లు. చైనా సగటు తలసరి విద్యుత్ వినియోగం 6,150 యూనిట్లు. మన దేశ తలసరి విద్యుత్ వినియోగం కంటే ఖతార్, కువైట్, సౌదీ అరేబియా దేశాల తలసరి విద్యుత్ వినియోగం చాలా ఎక్కువ. దేశ ఆర్థికాభివృది ్ధతో పాటు ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం తలసరి విద్యుత్ వినియోగాన్ని భారీగా పెంచాల్సిన అవసరం ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో పునరుత్పాదక ఇంధన రంగంలో భారతదేశం విశేష పురోగతి సాధించింది. గత ఏడాది దేశం 29.52 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకుంది. దీంతో మొత్తం సామర్థ్యం 220.10 గిగావాట్లకు పెరిగింది. ప్రధాని మోదీ నాయకత్వంలో 2030 నాటికి మన దేశం శిలాజేతర ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని 500 గిగావాట్లకు పెంచుకోవాలనే లక్ష్యంతో ముందుకుపోతోంది. అంతర్జాతీయంగా ఈ ప్రయత్నాలు ఎన్నో ప్రశంసలు పొందుతున్నప్పటికీ భారతదేశ ఇంధన రంగంలో బొగ్గు రంగం పాత్ర మరువలేనిది. ఈ ఏడాది మార్చి 31 నాటికి భారతదేశ మొత్తం స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 483.26 గిగావాట్లు. ఇందులో బొగ్గు ఆధారిత విద్యుత్ స్థాపిత సామర్థ్యం 210 గిగావాట్లు. భారతదేశం తన ఇంధన మిశ్రమం లో దాదాపు 55 శాతం బొగ్గుపై ఆధారపడి ఉంది. దేశంలోని విద్యుత్తులో దాదాపు 74 శాతం బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అవుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం రికార్డు స్థాయిలో ఒక బిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసి ఓ కీలక మైలురాయిని అధిగమించింది.మోదీ క్రియాశీల నాయకత్వంలో బొగ్గు రంగంలో స్వావలంబన వైపు కదులుతూ ఇంధన భద్రత, ఆర్థికవృద్ధి సాధించేలా భారతదేశం అడుగులు వేస్తోంది. కేంద్రం తెచ్చిన సంస్కరణలు, విధానాల ఫలితంగా రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి జరిగింది. వీటిలో గనులు, ఖనిజాలు (అభివృద్ధి, నియంత్రణ) చట్టానికి సవరణలు, బొగ్గు గనుల చట్టం, చట్టం-% 2015 ద్వారా బొగ్గు బ్లాకుల వాణిజ్య వేలాన్ని, బొగ్గు రంగాన్ని ప్రైవేట్ సంస్థలకు తెరవడం, సింగిల్ విండో వ్యవస్థ, స్థిరమైన, బాధ్యతాయుతమైన మైనింగ్‌తో కూడిన అత్యాధునిక సాంకేతికతలు, సమర్థవంతమైన పద్ధతులు బొగ్గు ఉత్పత్తిని గణనీయంగా పెంచాయి. ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలో భారతదేశం క్రిటికల్ మినరల్స్ రంగంలో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, కీలకమైన ఖనిజాల రంగంలో ముఖ్య పాత్ర పోషించడానికి సాహసోపేతమైన చర్యలు తీసుకుంటోంది. చైనా తర్వాత రెండో అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారు భారత్. ఇండోనేసియా, ఆస్ట్రేలియా వంటి దేశాల నుంచి హై గ్రేడ్ బొగ్గును కూడా దిగుమతి చేసుకుంటోంది. దేశీయ ఉత్పత్తి పెరగడం వల్ల 2024 ఏప్రిల్, డిసెంబర్ మధ్య భారతదేశ బొగ్గు దిగుమతులు 8.4 శాతం తగ్గాయి. ఫలితంగా గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే దాదాపు 5.43 బిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్యాన్ని దేశం ఆదా చేసింది. ఉద్గారాలను తగ్గించడం, వాతావరణ మార్పులను తగ్గించడం కోసం బొగ్గు/లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను ప్రోత్సహించడానికి రూ.8,500 కోట్ల వ్యయంతో సమగ్ర పథకానికి ఇటీవల కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంతో మార్గం సుగమమైంది. 'బొగ్గు నుంచి %బాచీ+%, నైట్రేట్' ప్రాజెక్ట్‌లను స్థాపించడానికి ఈక్విటీ పెట్టుబడుల ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించింది. భారతదేశం పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని, ముఖ్యంగా సౌర, పవన విద్యుదుత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరిగినప్పటికీ, వాటి ఉత్పత్తి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఒడిదొడుకులకు గురవుతూ ఉంటుంది.ఎల్లవేళలా స్థిరమైన ఉత్పాదకతను సౌర, పవన విద్యుత్ ప్లాంట్లు కలిగి ఉండకపోవడంతో గ్రిడ్ నిర్వహణలో సవాళ్లు తప్పవు. ఈ నేపథ్యంలో ఎల్లవేళలా నాణ్యమైన థర్మల్ విద్యుదుత్పత్తి కోసం బొగ్గు ఎంతో కీలకంగా మారింది. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే 'వికసిత్ భారత్ ఏ 2047' లక్ష్యంతో భారత ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

2021 నవంబర్‌లో ఐరాస 'ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమేట్ చేంజ్' 26)లో భారతదేశం 2070 నాటికి కర్బన ఉద్గారాలను నికరంగా సున్నా (నెట్ జీరో) స్థాయికి తగ్గించాలని లక్ష్యంగా ప్రకటించింది.



## కృష్ణుడు గీతోపదేశం అర్జునుడు మాత్రమే కాదు మరికొందరు విన్నారని తెలుసా..



సనాతన ధర్మంలో అష్టాదశ పురాణాలు మాత్రమే కాదు.. లెక్కలేనన్ని పౌరాణిక గ్రంథాలు ఉన్నాయి. అవి సమస్త మానవాళికి జ్ఞాన భాండాగారాలు. వీటిలో ఒకటి భగవద్గీత. ఇది చాలా పవిత్ర గ్రంథంగా పరిగణించబడు తుంది. ఇది మాత్రమే కాదు శ్రీమద్భగవద్గీత ప్రపంచంలో అత్యధికంగా చదివే మత గ్రంథాలలో ఒకటి. మహాభారత కథ ప్రకారం శ్రీకృష్ణుడు యుద్ధభూమిలో అర్జునుడికి గీతను ఉపదేశిస్తున్నప్పుడు, అర్జునుడితో పాటు.. మరో ముగ్గురు కూడా విన్నారని మీకు తెలుసా.. ఆ వ్యక్తులు ఎవరో ఈ రోజు తెలుసుకుందాం

**హనుమంతుడు..**కురుక్షేత్రంలో కృష్ణుడు.. అర్జునుడికి గీతను ఉపదేశిస్తున్నప్పుడు అర్జునుడితో పాటు.. అక్కడే రథంపై ఉన్న జెండాలో ఉన్న హనుమంతుడు కూడా గీతా ఉపన్యాసం విన్నాడు. మహాభారత కథ ప్రకారం భీముడికి హనుమంతుడు ఇచ్చిన వాగ్దానం ప్రకారం.. మహాభారత యుద్ధం సమయంలో పవనపుత్ర హనుమంతుడు అర్జునుడి రథం జెండాలో ఉండి రథాన్ని రక్షించాడు. కనుక గీతోపదేశం జరుగుతున్నప్పుడు హనుమంతుడు కూడా శ్రీమద్ భగవద్గీతను విన్నాడు.

**సంజయుడు..**ధృతరాష్ట్రుని ఆస్థానంలో సలహాదారు.. ఆయనకు రథసారథి అయిన సంజయుడు కూడా గీతా బోధనను విన్నాడు. సంజయుడు మహర్షి వేద వ్యాసుడి నుంచి దివ్య దృష్టిని వరంగా పొందాడు. ఫలితంగా.. అతను కురుక్షేత్రంలో జరిగిన యుద్ధానికి ప్రత్యక్ష సాక్షి. అక్కడ జరిగే వృత్తాంతాన్ని ధృతరాష్ట్రుడికి వివరించిన సంజయుడుకి కూడా శ్రీకృష్ణుడు.. అర్జునుడికి గీతను ఉపదేశిస్తున్నప్పుడు దానిని వినే భాగ్యం పొందాడు. దీనితో పాటు సంజయుడు కృష్ణుడి విశ్వరూపాన్ని కూడా దర్శించుకున్నాడు. శ్రీకృష్ణుడు అర్జునుడికి చెప్పిన విధంగానే ఆయన ఈ ఉపదేశాన్ని ధృతరాష్ట్రుడికి చెప్పాడుఘటోత్కచుడు, అహిలావతిల కుమారుడు బార్బరిక్ కూడా ఈ గీతోపదేశాన్ని విన్నాడు. అతను భీముడి మనవడు. మహాభారత యుద్ధం జరుగుతున్నప్పుడు.. బార్బరిక్ కూడా యుద్ధంలో పాల్గొనడానికి బయలుదేరాడు. శ్రీ కృష్ణుడికి ఈ విషయం తెలిసినప్పుడు.. బార్బరిక్ యుద్ధంలో చేరితే.. ఈ యుద్ధానికి ముగింపు ఉండదని కృష్ణుడు అర్థం చేసుకున్నాడు.ఎందుకంటే బార్బరిక్ ఎప్పుడూ ఓడిపోయే వ్యక్తి లేదా పక్షం వైపు నిలబడతాడు. కనుక బార్బరిక్ ఎవరు బలహీనంగా ఉంటే వారి వైపు పోరాడతాడు. అటువంటి పరిస్థితిలో పాండవులు బ ల హీ ా న ం గా మారినప్పుడు, బార్బరిక్ వారి పక్షాన పోరాడేవాడు. కౌరవులు బలహీనంగా మారినప్పుడు బార్బరిక్ వారి పక్షానికి వెళ్ళేవాడు.ఈ విషయం శ్రీ కృష్ణుడికి తెలుసు కనుక శ్రీకృష్ణుడు బ్రాహ్మణ రూపాన్ని ధరించి లీల చేసి బార్బరిక్ తలని ఇవ్వమని దానంగా అడిగాడు. నవ్వుతూ.. బార్బరిక్ తన తలని దానంగా కృష్ణుడికి ఇచ్చేశాడు. అయితే నువ్వు సామాన్య బ్రాహ్మణుడికి చెప్పాడు. దయచేసి నీ నిజ రూపాన్ని నాకు చూపించమని కృష్ణుడిని బార్బరిక్ అడిగాడు. అప్పుడు శ్రీ కృష్ణుడు సంతోషించి తన అసలు రూపంలో కనిపించడమే కాదు అదృశ్య రూపంలో ఈ యుద్ధం చూసే వరం కూడా ఇచ్చాడు. అందువల్ల శ్రీకృష్ణుడు అర్జునుడికి గీతను ఉపదేశిస్తున్నప్పుడు బార్బరిక్ కూడా దానిని విన్నాడు. తరువాత బార్బరిక్.. ఖతు శ్యామ్ అనే పేరుతో పూజించబడుతున్నాడు.





## హత్యకు గురైన మాజీ మంత్రి నివాసాల్లో ఐటీ సోదాలు.. 20 చోట్ల తనిఖీలు

**భువనేశ్వర్-నవభూమి:** 2023లో హత్యకు గురైన ఒడిశా మాజీ మంత్రి , సీనియర్ బీజేపీ నేత నబా కిశోర్ దాస్‌కు సంబంధించిన అక్రమార్జన కేసులో ఇవాళ ఆదాయం పన్ను శాఖ అధికారులు తనిఖీలునిర్వహిస్తున్నారు. సుమారు 20 ప్రదేశాల్లో ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారు. ఇవాళ ఉదయం 5 గంటలకు ఐటీ సెర్చ్ ఆపరేషన్ మొదలైంది. జార్సుగూడ, సంబల్‌పూర్, న్యూఢిల్లీల్లో ఉన్న దివంగత మాజీ మంత్రి నివాసాలతో పాటు బంధువులు, అనుబంధ వ్యాపారవేత్తల ఇండ్లల్లోనూ ఐటీ శాఖ తనిఖీలు నిర్వహిస్తున్నది. భువనేశ్వర్‌లో ఉన్న మాజీ మంత్రి ఇళ్లు మాత్రం ప్రస్తుతం మూసివేశారు. నబా కిశోర్ దాస్‌తో లింకున్న హెటల్ నికీ, ఇతర ప్రాపర్టీలపై కూడా ఐటీ సెర్చ్ జరుగుతోంది.పన్ను ఎగవేతతో పాటు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ప్రస్తుతం తనిఖీలు జరుగుతున్నాయి. మాజీ మంత్రి బొగ్గు, యాష్ ట్రాన్స్‌పోర్టేషన్ బిజినెస్‌లో ఉండేవారు. సుమారు 180 మంది ఐటీ ఆఫీసర్లు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. సుమారు 40 మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది, 60 వాహనాలు, సైంటిఫిక్ అనాలిస్ బృందం కూడా వారితో ఉన్నాయి. మాజీ మంత్రి కిశోర్ దాస్ కుమార్తె, జార్సుగూడ మాజీ ఎమ్మెల్యే దీపాలీ దాస్ ప్రస్తుతం ఆచూకీ లేరు. ఆమె ఆఫీసు మూసి ఉందారు. గతంలో దాస్ కుటుంబానికి ఐటీ నోటీసులు ఇచ్చినా..వాళ్లు సరైన రిప్లై ఇవ్వలేదు. దీంతో ఈసారి ఐటీశాఖ భారీ స్థాయిలో రెయిడ్స్ మొదలుపెట్టింది.

## శుభాన్షు రోదసి యాత్ర.. కీలక అప్‌డేట్ ఇచ్చిన నాసా



**న్యూఢిల్లీ-నవభూమి:** భారతీయులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న శుభాన్షు శుక్లా రోదసి యాత్రకు సంబంధించి నాసా మరో కీలక అప్‌డేట్ ఇచ్చింది. ఈ నెల 22న ప్రయోగం చేపట్టనున్నట్టు ఇస్రో నిన్న ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ప్రయోగానికి సంబంధించిన టైమ్‌ను నాసా తాజాగా ప్రకటించింది. జూన్ 22న మధ్యాహ్నం 1:12 గంటలకు ఫ్లోరిడాలోని నాసాకు చెందిన కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి ఈ ప్రయోగం జరగనుందని తెలిపింది. ఈ ప్రయోగం ద్వారా భారత్, పోలండ్, హంగేరీకి చెందిన నలుగురు వ్యోమగాములను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపుతున్నారు. ఈ మిషన్‌కు భారత వ్యోమగామి శుభాన్షు శుక్లాపైలట్‌గా వ్యవహరించబోతున్నారు.

అమెరికా ప్రైవేట్ స్పేస్ సంస్థ 'యాక్సియమ్' చేపడుతున్న మానవ సహిత అంతరిక్ష ప్రయోగం 'ఏఎక్స్-4' మిషన్ (%ూఇ 4 ఎఅం-ంఱశీఅ%)లో భాగంగా స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా వీరు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లనున్నారు. దీంతో ప్రైవేట్ రోదసి యాత్ర ద్వారా ఐఎస్ఎస్‌కు వెళ్లిన తొలి భారత వ్యోమగామిగా శుభాన్షు చరిత్రకెక్కనున్నారు. ఇప్పటికే భారత్‌కు చెందిన ప్రముఖ వ్యోమగామి రాకేశ్ శర్మ రోదసి యాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. రష్యా సహకారంతో అంతరిక్షయానం చేశారు. రాకేశ్ శర్మ రోదసి యాత్ర చేసిన నాలుగు దశాబ్దాల (1984) తర్వాత శుభాన్షు ఈ గౌరవాన్ని దక్కించుకోనున్నారు. నాసా సహకారంతో శుక్లా ఐఎస్ఎస్‌లో వివిధ శాస్త్రీయ పరిశోధనలు చేయనున్నారు. పైలట్‌గా ఈ యాత్రలో పాల్గొనేందుకు ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నానని శుక్లా ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

సాంకేతిక కారణాలతో యాక్సియం-4 ప్రయోగం ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన విషయం తెలిసిందే. నిజానికి మే 29నే ఈ ప్రయోగం జరగాల్సి ఉండగా వాయిదా పడింది. తొలుత ఈ ప్రయోగాన్ని జూన్ 8వ తేదీకి వాయిదా వేశారు. ఆ తర్వాత జూన్ 10, జూన్ 11కు వాయిదా పడింది. యాక్సియం-4 మిషన్‌కు సంబంధించిన ఫాల్కన్-9 రాకెట్ తనిఖీల్లో ద్రవరూప ఆక్సిజన్ లీకేజ్ కారణంగా జూన్ 11న జరగాల్సిన ఈ ప్రయోగం మళ్లీ వాయిదా వేశారు. లీకేజ్‌కు సంబంధించిన మరమ్మత్తులు పూర్తిచేసేందుకు మరింత సమయం పడుతుందని, రాకెట్ లాంచింగ్‌ను వాయిదా వేస్తున్నట్టు స్పేస్‌ఎక్స్ తెలిపింది.ఆ తర్వాత ప్రయోగాన్ని జూన్ 19 చేపట్టున్నట్లు ఇస్రో ప్రకటించినప్పటికీ అది ఇప్పుడు మళ్లీ వాయిదా పడింది. ఈ నెల 22న ప్రయోగం చేపట్టనున్నట్టు ఇస్రో 'ఎక్స్'వేదికగా బుధవారం వెల్లడించింది. ఈ మిషన్‌ను విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు ప్రైవేట్ సంస్థ యాక్సియం స్పేస్ వెల్లడించింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో లీకేజ్‌ల కారణంగా ఇటీవల కొన్ని మరమ్మత్తులు చేపట్టాల్సి వచ్చింది. దీనిపై వివిధ అంశాల్ని ఇస్రో మరోమారు మూల్యాంకనం చేసుకునే విధంగా యాక్సియం-4 మిషన్ ప్రయోగ తేదీని మార్చినట్టు తెలుస్తున్నది.

## విమాన ప్రమాదంలో దెబ్బతిన్న బ్లాక్‌బాక్స్.. విశ్లేషణ కోసం విదేశాలకు



**న్యూఢిల్లీ-నవభూమి:** గతవారం అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో దాదాపు 270 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన యావత్తు దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేస్తోంది. ఇక ఈ ఘటనపై అధికారులు విస్తృతంగా దర్యాప్తు చేస్తున్నారు. అయితే, దర్యాప్తులో కీలకమైన బ్లాక్‌బాక్స్ ప్రమాదంలో దెబ్బతిన్నట్లు తెలిసింది. దీంతో అందులోని డేటాను విశ్లేషించేందుకు బ్లాక్‌బాక్స్‌ను విదేశాలకు పంపనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిర్ ఇండియా బోయింగ్ ఏ-171 విమానం గత గురువారం కూలిపోయిన విషయం తెలిసిందే. టేకాఫ్ అయిన నిమిషాల్లోనే రెసిడెంట్ డాక్టర్స్ హాస్టల్ భవనంపై కూలిపోయింది. ఇక ఈ ప్రమాదం జరిగిన దాదాపు 27 గంటల తర్వాత ఈ బ్లాక్‌బాక్సును విమానం కూలిన బిల్డింగ్‌పై గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు తెలుసుకునేందుకు ఈ బ్లాక్ బాక్స్ చాలా కీలకం. అయితే, ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో బ్లాక్‌బాక్స్ దెబ్బతిన్నట్లు తెలిసింది. దీంతో అందులోని డేటాను విశ్లేషించేందుకు దెబ్బతిన్న బ్లాక్‌బాక్స్‌ను విదేశాలకు పంపనున్నట్లు సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. వాషింగ్టన్ డీసీలోని జాతీయ రవాణా భద్రతా బోర్డుకు పంపే అవకాశం ఉందని సదరు కథనాలు వెల్లడించాయి.సాధారణంగా విమానం తోక భాగంలో బ్లాక్‌బాక్స్‌ను అమర్చుతారు. ప్రమాదాల్లో పేలుడు ద్వారా ఉత్పన్నమయ్యే మంటల తట్టుకునేలా, 1100 డిగ్రీ సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత వద్ద గంటపాటు ఉన్నా ధ్వంసం కాకుండా వీటిని రూపొందిస్తారు. ప్రమాదానికి గల కారణం, ప్రమాదానికి ముందు ఏం జరిగింది.. తదితర సమాచారం అంతా ఈ బ్లాక్ బాక్సులో నిక్షిప్తమై ఉంటుంది. ఈ సమాచారం ద్వారా ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తారు. భవిష్యత్తు ప్రమాదాలను నిరోధించడానికి కూడా ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే, ఎయిర్ ఇండియా విమానం కూలని అనంతరం 1000 డిగ్రీల ఉష్ణోగ్రతతో మంటలు చెలరేగిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదం ధాటికి బ్లాక్‌బాక్స్ దెబ్బతిన్నట్లు తెలుస్తోంది.

ఎయిర్ ఇండియా కీలక ప్రకటన.. అంతర్జాతీయ విమాన సర్వీసుల్లో

## ఎయిర్ ఇండియా కీలక ప్రకటన.. అంతర్జాతీయ విమాన సర్వీసుల్లో కోత

**న్యూఢిల్లీ-నవభూమి:**దేశీయ దిగ్గజ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా కీలక ప్రకటన చేసింది. తన అంతర్జాతీయ విమాన సేవలను తాత్కాలికంగా తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. వైడ్‌బాడీ విమాన కార్యకలాపాలను జులై మధ్య వరకూ తగ్గించనున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. సుమారు 15 శాతం మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించింది.వైడ్‌బాడీ బోయింగ్ 777 విమానాల్లో మరింతగా రక్షణ తనిఖీలు చేపట్టనున్నట్లు వెల్లడించింది. అనేక సంక్లిష్ట సవాళ్ల మధ్య మెరుగైన సామర్థ్యం, ప్రయాణికుల అసౌకర్యాన్ని తగ్గించడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు టాటా గ్రూప్ ఆధ్వర్యంలోని ఎయిర్ ఇండియా తన ప్రకటనలో స్పష్టం చేసింది. బోయింగ్ 777 విమానాల్లో చేపట్టే ఈ ప్రత్యేక తనిఖీల ద్వారా ప్రయాణ భద్రతను మరింత పటిష్టం చేయడమే తమ లక్ష్యమని ఎయిర్ ఇండియా అధికారులు తెలిపారు.

# మహిళతో మంత్రి సన్నిహిత ఫొటోలు లీక్



**పంజాబ్-నవభూమి:**పంజాబ్ రాజకీయాల్లో మంత్రి ఫొటోల వివాదం తీవ్ర చర్చకు కారణం అయింది. ముఖ్యంగా ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన మంత్రి డా. రవ్‌జోత్ సింగ్.. ఓ మహిళతో సన్నిహితంగా ఉన్న ఫొటోలను ప్రతిపక్ష పార్టీ శిరోమణి అకాలీదళ్ నాయకుడు బిక్రమ్ సింగ్ మజీథియా సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. ఆప్ సర్కారుపై కూడా పెద్ద ఎత్తున ఆరోపణలు చేస్తూ.. మంత్రి రవ్‌జోత్ సింగ్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దీనిపై తాజాగా మంత్రి రవ్‌జోత్ సింగ్ స్పందించారు. కావాలనే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ.. మార్ఫింగ్ ఫొటోలు పెడుతున్నారని చెప్పారు. దీనిపై చర్యలు తీసుకుంటానని అంటూనే.. నేరుగా వెళ్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.శిరోమణి అకాలీదళ్ నేత బిక్రమ్ సింగ్ మజీథియా ఎక్స్ వేదికగా.. మంత్రి రవ్‌జోత్ సింగ్‌కు సంబంధించిన ఫొటోలను షేర్ చేశారు. అందులో ఆయన ఓ మహిళతో సన్నిహితంగా ఉండగా.. వాటిని బహిరంగంగానే విడుదల చేశారు. అలాగే మంత్రి సహా ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు అందరిపై తీవ్ర ఆరోపణలు చేశారు. అలాగే ఈ పోస్టును ఆప్ అధినేత అర్వింద్ కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆమ్ ఆద్మీ పార్టీ అధికారిక పేజీలకు ట్యాగ్ చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు నెట్టింట తెగ వైరల్ అవుతుండగా.. అంతా షాక్ అవుతున్నారు. ఓ మంత్రికి సంబంధించిన ఫొటోలు వెలుగులోకి రాగా.. ముక్కున వేలేసుకుంటున్నారు.అయితే బిక్రమ్ సింగ్ మజీథియా చేసిన ఈ పోస్టు, ప్రైవేటు ఫొటోల లీకేజీపై మంత్రి రవ్‌జోత్ సింగ్ స్పందించారు. పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఆపై మీడియాతో మాట్లాడుతూ.. తన పరువుకు భంగం కలిగించే ఉద్దేశంతోనే కొందరు వ్యక్తులు తన వ్యక్తిగత ఫొటోలను మార్ఫింగ్ చేసి, వాటిని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కుట్ర వెనుక బిక్రమ్ సింగ్ మజీథియా హస్తం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా ఈ ఫొటోలు సోషల్ మీడియాలో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయని, దీని వల్ల తన ప్రతిష్టకు తీవ్ర భంగం వాటిల్లిందని రవ్‌జోత్ సింగ్ పేర్కొన్నారు. ఈ చర్య తనను మానసికంగా వేధింపులకు గురిచేసిందని వెల్లడించారు. ఏది ఏమైనా నిందితులకు శిక్ష పడే వరకు తాను ఊరోకునని అన్నారు.మరోవైపు ఈ వివాదంపై స్పందించిన అధికార పార్టీ.. ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో మండిపడింది. రాజకీయ లబ్ధి కోసం దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించింది. అయితే బిక్రమ్ సింగ్ మజీథియా ఈ ఆరోపణలను ఖండించారు. తనపై వస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని, తనకు ఈ వ్యవహారంతో ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. రాజకీయంగా తనను అణగదొక్కడానికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఎదురుదాడికి దిగారు.ప్రస్తుతం మంత్రి చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలను ఎవరు మార్ఫింగ్ చేశారు, వాటిని ఎవరు ప్రచారం చేస్తున్నారు అనే కోణంలో విచారణ సాగిస్తున్నారు. సైబర్ క్రైమ్ నిపుణుల సహాయంతో ఫొటోల ప్రామాణికతను నిర్ధారించే పనిలో పడ్డారు. ఈ కేసు పంజాబ్ రాజకీయాల్లో మరింత వేడిని రాజేసింది. రాబోయే రోజుల్లో ఈ వివాదం ఎలాంటి మలుపులు తిరుగుతుందో చూడాలి.

# టికెట్ క్యాన్సిల్ చేస్తే డబ్బులు వెనక్కి వస్తాయా?




**న్యూఢిల్లీ-నవభూమి:**సాధారణంగా చాలా మంది నిత్యం రైళ్లలో ప్రయాణిస్తూ ఉంటారు. దూర ప్రయాణాలకు రైల్వేలు చాలా సౌకర్యవంతంగా ఉంటాయి. అయితే రిజర్వేషన్ చేయించుకోవాలంటే వెళ్లే రూట్‌ను బట్టి నెల, 2 నెలల ముందే టికెట్లు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. రైల్వే రిజర్వేషన్ కౌంటర్లతోపాటు అధికారిక వెబ్‌సైట్‌లోనూ మనం టికెట్లు బుక్ చేసుకోవచ్చు. కానీ కొన్ని సార్లు ప్రయాణం రద్దయితే.. బుక్ చేసుకున్న టికెట్ క్యాన్సిల్ చేసుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. అంతేకాకుండా వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న టికెట్లు కూడా చివరి నిమిషంలో క్యాన్సిల్ అవుతూ ఉంటాయి. అయితే ఇలాంటి సందర్భాల్లో డబ్బులు ఎన్ని కట్ అవుతాయి అనే సందేహాలు చాలా మంది ప్రయాణికుల్లో ఉంటాయి. ఈ నేపథ్యంలోనే ఆన్‌లైన్ రైలు టికెట్ బుకింగ్, రద్దులకు సంబంధించి ప్రయాణికుల్లో నెలకొన్న అపోహలు, గందరగోళంపై ఐఆర్‌సీటీసీ ఒక క్లారిటీ ఇచ్చింది.టికెట్ రద్దు చేసినప్పుడు లేదా వెయిట్‌లిస్ట్ టికెట్లు ఆటోమేటిక్‌గా రద్దయిన సందర్భాల్లో తమ ప్లాట్‌ఫారమ్ ద్వారా ఎలాంటి అదనపు ఛార్జీలు వసూలు చేయబడవని ఐఆర్‌సీటీసీ స్పష్టం చేసింది. ఈ మేరకు ఓ నెటిజన్ చేసిన ట్వీట్‌కు స్పందిస్తూ.. క్లారిటీగా వివరాలు వెల్లడించింది. ట్రైన్ టికెట్ బుక్ చేసే సమయంలో ఆన్‌లైన్ సేవల కోసం ఐఆర్‌సీటీసీ వసూలు చేసే నామమాత్రపు కన్వీనియన్స్ ఫీజును.. టికెట్ రద్దు అయితే తిరిగి చెల్లించడం జరగదని తెలిపింది. ఎందుకంటే ఐఆర్‌సీటీసీ ద్వారా ఆన్‌లైన్ బుకింగ్ సేవలు ఇప్పటికే అందించబడినందున వాటిని తిరిగి ఇవ్వలేమని వెల్లడించింది.ఒకవేళ కన్ఫర్మ్ అయిన టికెట్‌ను రద్దు చేసినప్పుడు.. రైల్వే రిఫండ్ రూల్స్ పాలసీ ప్రకారం పీఆర్ఎస్ (ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్) ద్వారా రూ. 60 క్లర్కేజ్ ఛార్జీని మినహాయించి మిగిలిన డబ్బును చెల్లిస్తామని ఐఆర్‌సీటీసీ పేర్కొంది. ఈ క్లర్కేజ్ ఛార్జీ ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసిన టికెట్లకు.. రైల్వే కౌంటర్ల వద్ద బుక్ చేసిన టికెట్లకు ఒకే విధంగా ఉంటుందని స్పష్టం చేసింది. అంటే ఈ క్లర్కేజ్ ఛార్జీని ఐఆర్‌సీటీసీ నేరుగా తీసివేయదని.. ఇది రైల్వే శాఖ సాధారణ రిఫండ్ నిబంధనల్లో భాగమని తేల్చి చెప్పింది.

రైలు టికెట్ల రద్దు, వెయిట్‌లిస్ట్ టికెట్లు ఆటోమేటిక్‌గా రద్దు అయినపుడు ప్రయాణికుల నుంచి వస్తున్న ఫిర్యాదులు.. వాటి కారణంగా సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు సమాచారం నేపథ్యంలో దీనిపై ఒక క్లారిటీ ఇచ్చేందుకు ఐఆర్‌సీటీసీ ఈ ట్వీట్ చేసింది. రైల్వే ప్రయాణికులు ఛార్జీల పట్ల గందరగోళానికి గురవడం లేదా ఐఆర్‌సీటీసీ అదనంగా, అసంబద్ధమైన ఛార్జీలను వసూలు చేస్తుందని తప్పుగా భావించడం వంటివి జరుగుతున్నాయనే వాదనలు వెల్లువెత్తుతున్న వేళ క్లారిటీ ఇచ్చింది. ఇలా వివరణ ఇవ్వడం ద్వారా.. ఐఆర్‌సీటీసీ తమ కార్యకలాపాల్లో పారదర్శకతను పెంచాలని.. ప్రయాణికుల నమ్మకాన్ని పొందాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## ఇండిగో విమానంలో సాంకేతిక సమస్య.. ఢిల్లీలో అత్యవసర ల్యాండింగ్




**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగోకు చెందిన విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. ఇండిగోకు చెందిన 6%జు% 2006 విమానం గురువారం ఉదయం ఢిల్లీ నుంచి లెహ్‌కు బయల్దేరింది. అయితే, మధ్యలో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. వెంటనే అప్రమత్తమైన పైలట్ విమానాన్ని వెనక్కి మళ్లించారు. ఢిల్లీలో అత్యవసరంగాసేఫ్ ల్యాండ్ చేశారు. ఆ సమయంలో విమానంలో ప్రయాణికులు, క్రూ సిబ్బంది మొత్తం 180 మంది ఉన్నారు. ఈ విషయాన్ని ఇండిగో సంస్థ కూడా ధ్రువీకరించింది. ప్రయాణికుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది.కాగా, నిన్న ఢిల్లీ నుంచి రాయ్‌పూర్ వెళ్లిన ఇండిగో విమానంలో కూడా సాంకేతిక సమస్య తలెత్తిన విషయం తెలిసిందే. విమానం రాయ్‌పూర్ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అవ్వగా.. విమానం డోర్లు తెరుచుకోలేదు. దీంతో దాదాపు 40 నిమిషాల పాటూ ప్రయాణికులు అందులోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఆ సమయంలో విమానంలో ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ భగేల్, ఛత్తీస్‌గఢ్ ఎమ్మెల్యే, మేయర్ కూడా ఉన్నారు. ఇలా వరుస ఘటనలతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

### ఆస్పత్రి నుంచి నేరుగా సోదరుడి అంత్యక్రియలకు

# మృత్యుంజయుడి ఎమోషనల్ వీడియో



**పంజాబ్-నవభూమి:**గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జూన్ 12వ తేదీన జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం గురించి అందరికీ తెలిసిందే. ఈ దుర్ఘటలోనే మొత్తంగా 274 మంది మృతి చెందగా.. విమానంలో ఉన్న ఒకే ఒక్క వ్యక్తి ప్రాణాలతో బయట పడ్డాడు. అతడే విశ్వాస్ కుమార్. స్వల్ప గాయాలతో మృత్యుంజయుడిగా తిరిగొచ్చిన ఈయన తాజాగా కోలుకున్నారు. అయితే ఆస్పత్రి నుంచి నేరుగా ఇంటికి వెళ్లకుండా.. తన సోదరుడు అజయ్ అంత్యక్రియలకు వెళ్లారు. అక్కడే అతడి పాడెమోస్తూ కన్నీరు పెట్టారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్తున్న ఎయిరిండియా విమానం ఏప్రిల్ 12వ తేదీన ప్రమాదానికి గురైన విషయం అందరికీ తెలిసిందే. ముఖ్యంగా 242 మందితో వెళ్తున్న ఈ విమానం టేకాఫ్ అయిన కొద్ది సేపటికే కుప్ప కూలిపోయింది. బీజే మెడికల్ కాలేజీ హాస్టల్ భవనం సహా జనావాసాలపై విమానం పడగా.. విమానంలో ఉన్న 241 మంది ప్రాణాలు కోల్పోయారు. కానీ ఒకే ఒక్క వ్యక్తి ఎవరూ ఊహించని విధంగా ప్రాణాలతో బయట పడ్డాడు. మృత్యుంజయుడిగా నిలిచి ప్రపంచానికి షాక్ ఇచ్చాడు. అతడే విశ్వాస్ కుమార్. ఆ తర్వాత ఈయనకు సంబంధించిన ఎన్నెన్నో వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.ఆయన వయస్సు 70 ఏళ్లు.. ముగ్గురు మహిళలతో అలా.. చివరకు ఇలా.. అయితే తాజాగా ఈయనకు సంబంధించిన మరో వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ముఖ్యంగా ఆయన మంగళ వారం రోజు రాత్రి ఆస్పత్రి నుంచి డిశ్చార్జీ కాగా.. బుధవారం సోదరుడి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఇదే విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన అతడి సోదరుడు అజయ్ కుమార్‌కు.. బుధవారం రోజు ఉదయమే డీఎన్ఏ పరీక్షలు పూర్తి అయ్యాయి. దీంతో అజయ్ మృతదేహాన్ని గుర్తించిన వైద్యులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో ఈరోజు దయ్యూలోని తన స్వగృహానికి తీసుకెళ్లి మరీ అతడికి అంత్యక్రియలు నిర్వహించారు.ముందు రోజు రాత్రే ఆస్పత్రి నుంచి వచ్చి విశ్వాస్ కుమార్.. సోదరుడి పార్థివ దేహాన్ని చూసి గుండెలవిసేలా రోదించారు. ప్రమాదానికి ముందు వరకు తనతోనే ఉన్న సోదరుడు ఇప్పుడు నిర్జీవంగా పడి ఉండడం చూసి జీర్ణించుకోలేకపోయారు. స్వల్ప గాయాలు, చిన్న చిన్న కట్లతోనే ఉన్న ఆయన సోదరుడి పాడెను మోస్తూ.. గుండెలవిసేలా రోదించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలే నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఇవి చూసిన ప్రతీ ఒక్కరు కంటతడి పెడుతున్నారు. మీ సోదరుడు ఆత్మకు శాంతి చేకూరాలని కామెంట్లు చేస్తున్నారు.

## హెూటళ్లో ప్రియుడితో ఎంజాయ్ చేస్తుండగా భర్త సడెన్ ఎంట్రీ..



**న్యూఢిల్లీ-నవభూమి:**ఆమెకు ఇప్పటికే పెళ్లైంది. ఓ బాబు కూడా పుట్టాడు. కానీ ఇరువురి మధ్య మనస్పర్థలు రావడంతో.. ప్రస్తుతం వీరు కౌన్సిలింగ్ తీసుకుంటున్నారు. ఇలాంటి సమయంలో పిల్లాడి కోసం, తమ భవిష్యత్తు కోసం భర్తతో కలిసేందుకు ప్రయత్నించాల్సిన ఈమె మాత్రం మరో వ్యక్తితో ప్రేమలో పడింది. ఎవరికీ తెలియకుండా వ్యవహారం కూడా సాగిస్తోంది. అయితే తాజాగా ఆమె ప్రియుడితో కలిసి హెూటల్‌కు వెళ్లి ఎంజాయ్ చేస్తుండగా.. భర్త, అత్తమామలు సడెన్ ఎంట్రీ ఇచ్చారు. దీంతో వారు చూస్తే పరువు పోతుందని భావించిన ఆమె ఒక్క ఉదుటున లేచి బయటకు వచ్చింది. వెంటనే హెూటల్ పైకప్పు ఎక్కేసి.. వారికి కనిపించకుండా పారిపోవాలని పైనుంచి దూసేకింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతోంది. సోమవారం ఉత్తర ప్రదేశ్ బరౌత్‌లోని చప్రౌలి రోడ్డులో ఉన్న ఒక హెూటల్‌లో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సదరు మహిళ తన ప్రియుడు శోభిత్‌తో కలిసి హెూటల్‌కు వచ్చింది. కొంత సమయం తరువాత ఆమె భర్త, అత్త మామలు ఆమెను అనుసరిస్తూ.. హెూటల్‌కు చేరుకున్నారు. అయితే ఈ విషయం గుర్తించిన మహిళ.. ప్రియుడితో తనను చూస్తే తన పరువు పోతుందని భావించింది. వారు తిట్టి, కొడతారని భయపడింది. అందుకే వెంటనే అక్కడి నుంచి తప్పించుకోవాలనుకుంది. వెనకాల నుంచి ఏదైనా దారి ఉందేమోనని చూసింది. కానీ ఏదీ కనిపించక పోవడంతో.. హెూటల్ పైకప్పు ఎక్కి.. వెనకాల నుంచి దూకి పారిపోవాలని నిర్ణయించుకుంది.ఇక వెంటనే దాదాపు 12 అడుగుల ఎత్తున ఉన్న హెూటల్ పైకప్పు ఎక్కింది. వెనక్కి వెళ్లి కిందకు దూకేసింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఇది చూసిన ప్రతీ ఒక్కరూ.. వామ్మో.. అమ్మాయిలు ఇలా తయారవుతున్నారేంట్రా సామీ అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఈ ఘటనపై బరౌత్ కొత్వాలి మనోజ్ కుమార్ చహల్ మాట్లాడుతూ.. "ఆమె ప్రియుడు శోభిత్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాం. టుగానా గ్రామానికి చెందిన ఒక యువకుడు అద్దెకు హెూటల్ నడుపుతున్నాడు. అతన్ని కూడా ప్రశ్నిస్తున్నాం. భర్త ఫిర్యాదు ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నాం. తగిన చర్యలు తీసుకుంటాం." అని అన్నారు.ఫిర్యాదు ప్రకారం.. ఆ మహిళకు 2019లో కకోర్ గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. వారికి ఒక కుమారుడు కూడా ఉన్నాడు. పెళ్లికి ముందు కూడా తన భార్యకు చాలా మందితో సంబంధాలు ఉండేవని, పెళ్లి తర్వాత కూడా అవి కొనసాగాయని భర్త ఆరోపించాడు. ఆమె తనను తప్పుడు కేసుల్లో ఇరికిస్తానని బెదిరించేద ని.. అభ్యంతరం చెబితే చంపేస్తానని కూడా చాలా సార్లు హెచ్చరించిందని భర్త ఫిర్యాదులో పేర్కొన్నాడు. అలాగే తమిద్దరి మధ్య మనస్పర్థ లు ఉండగా.. విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకున్నట్లు కూడా చెప్పాడు. ప్రస్తుతం ఎస్పీ కార్యాలయం లోని మహిళా విభాగంలో కౌన్సిలింగ్ కూడా పొందుతున్నట్లు వెల్లడించారు.

## ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై క్షమాపణలు చెప్పిన టాటా గ్రూప్ చైర్మన్ చంద్రశేఖరన్



**న్యూఢిల్లీ-నవభూమి:**టాటా సంస్థకు చెందిన దేశీయ దిగ్గజ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా విమానం గత గురువారం అహ్మదాబాద్‌లో కుప్పకూలిన విషయం తెలిసిందే. లండన్ బయల్దేరి డ్రీమ్‌లైనర్ రకానికి చెందిన ఏఐ171 విమానం టేకాఫ్ అయిన నిమిషాల్లోనే ఓ బిల్డింగ్‌పై కూలిపోయింది. విమానం కూలిన వెంటనే 1000 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటనలో దాదాపు 270 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఇక ఈ ఘటనపై టాటా గ్రూప్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ తాజాగా స్పందించారు. ఈ మేరకు విచారం వ్యక్తం చేస్తూ.. క్షమాపణలు చెప్పారు.'ఇది చాలా క్లిష్టమైన పరిస్థితి. మరణించిన వారి కుటుంబాలను ఓదార్చేందుకు మాటలు రావట్లేదు. టాటా సంస్థ నడిపే విమానయాన సంస్థలో ఈ ప్రమాదం జరిగినందుకు తీవ్రంగా చింతిస్తున్నాను. ఈ సమయంలో బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం. వారికి అవసరమైన సాయాన్ని అందించేందుకు కంపెనీ కట్టుబడి ఉంది. ఈ ఘటనకు గానూ బాధిత కుటుంబాలకు హృదయపూర్వకంగా క్షమాపణలు చెబుతున్నాను' అని అన్నారు. మరోవైపు ప్రమాద ఘటనపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. ప్రాథమిక స్థాయి ఫలితాలు రావడానికి ఒక నెల సమయం పడుతుందన్నారు. విమానం అత్యంత భద్రతా ప్రమాణాలతో పనిచేస్తుందని.. ఇటీవలే జరిగిన తనఖిల్లో ఎలాంటి సాంకేతికలోపాలు గుర్తించలేదని ఆయన వివరించారు. పైలట్లు సైతం అనుభవజ్ఞులైనవారేనని స్పష్టం చేశారు.'మానవ తప్పిదాలు, ఎయిర్‌లైన్స్, ఇంజిన్లు, నిర్వహణ గురించి అనేక రకాల ఊహాగానాలు ఉన్నాయి. అయితే, ఈ ఏఐ171 విమానానికి క్లీన్ హిస్టరీ ఉంది. విమానం కుడివైపున ఉన్న ఇంజిన్‌ను మూడు నెలల క్రితమే (2025 మార్చి) ఓవర్ హాలింగ్ సమయంలో అమర్చాం. ఎడమవైపు ఇంజిన్‌కు చివరిసారిగా జూన్ 2023లో నిర్వహణ పనులు చేపట్టారు. తదుపరి షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 2025లో నిర్వహించాల్సి ఉంది. ఇక ప్రమాదానికి గురైన విమానాన్ని నడిపిన పైలట్లు సైతం అనుభవజులైన వారే. కెప్టెన్ సభర్వాల్‌కు 11,500 గంటలకుపైగా విమానయాన అనుభవం ఉంది. కుందర్‌కు 3,400 గంటలకుపైగా విమానం నడిపిన అనుభవం ఉంది. ప్రస్తుతానికి ఈ ఘటనపై ఎలాంటి నిర్ధారణకూ రాలేము. బ్లాక్ బాక్స్, రికార్డర్ల ద్వారా ఘటనకు గల కారణాలు తెలుస్తాయి. అప్పటి వరకూ వేచి ఉండాలి' అని చంద్రశేఖరన్ వివరించారు. ప్రమాదానికి గల కారణాలు గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోందని, కూడా ఒక కమిటీని నియమించిందని చెప్పారు.



# మురుగన్ మహానాడు జరిపినా బీజేపీ బలం పెరిగే అవకాశం లేదు..



చెన్నై- నవభూమి: మదురైలో మురుగన్ మహానాడు నిర్వహించడం వల్ల రాష్ట్రంలో బీజేపీ పరపతి పెరిగే అవకాశమే లేదని డీఎంకే ఎంపీ కనిమొళి(%ఙవీఖ ఫీ ఖుఅఅఎశీఓప్త్రఅ%) ఎద్దేవా చేశారు. కన్నియాకుమారిలో బుధవారం ఉదయం ఆమె మీడియాతో మాట్లాడుతూ డీఎంకే కూటమి మరింత పటిష్టంగానే ఉందని మిత్రపక్షాల్లో కొన్ని పార్టీలు కూటమి నుండి వైదొలగుతాయని బీజేపీ, అన్నాడీఎంకే నేతలు చేస్తున్న ప్రకటనలు అవాస్తవాలన్నారు. డీపీఐ నేత తిరుమావళవన్ డీఎంకే నేత, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారని, కూటమిలో కీలకపాత్ర పోషిస్తున్నారని, వాస్తవాలిలా ఉండగా డీపీఐ కూటమికి గండి కొట్టడం ఖాయమని ప్రతిపక్షాలు పనిగట్టుకుని దుష్ప్రచారం చేయడం తగదన్నారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ తామిప్పుడు మురుగన్‌ను చేతులకెత్తుకున్నామని, త్వరలో రాష్ట్రంలో అధికారాన్ని కూడా హస్తగతం చేసుకుంటామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. మురుగన్ మహానాడు నిర్వహించడం వల్ల రాష్ట్రంలో బీజేపీ(%దీఙ్రూ%) బలం ఏ మాత్రం పెరిగే అవకాశమే లేదని కనిమొళి చెప్పారు. బుధవారం ఉదయం కన్నియాకుమారికి వెళ్ళిన కనిమొళికి మంత్రి మనో తంగరాజ్, మాజీ మంత్రి సురేశరాజన్, డీఎంకే స్థానిక శాఖ నాయకులు బాబు, తామరై భారతి, మాజీ ఎంపీ హెలెన్ డేవిడ్‌సన్, కన్నియాకుమారి పురపాలక సంఘం అధ్యక్షులు కుమరి స్టీఫన్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.

## 4 రాష్ట్రాల్లో ఉపఎన్నికలు.. కొనసాగుతున్న పోలింగ్



హైదరాబాద్ - నవభూమి:నాలుగు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న ఐదు అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికలు ప్రారంభమయ్యాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగియనుంది. లూథియానా (పంజాబ్), కాళీగంజ్ (పశ్చిమబెంగాల్), కాడి, విసవదర్ (గుజరాత్), నీలంబూర్ (కేరళ) స్థానాల్లో ఉపఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఐదుచోట్లా అధికార పార్టీలకు చెందిన స్థానాలు మూడు ఉండగా, ఒక చోట విపక్ష ఆప్, మరోచోట స్వతంత్ర అభ్యర్థి ఉన్నారు.పంజాబ్‌లోని లూథియానాలో ఆప్ ఎమ్మెల్యే గురుప్రీత్ సింగ్ గోగి మరణించారు. దీంతో ఉపఎన్నిక బరిలో రాజ్యసభ ఎంపీ సంజీవ్ అరోరాను ఆప్ తన అభ్యర్థిగా నిలిపింది. ఇక కాంగ్రెస్ నుంచి భరత్ భూషన్ అషు, బీజేపీ నుంచి జైవాన్ గుప్తా పోటీచేస్తున్నారు. పశ్చిమబెంగాల్‌లోని కాళీగంజ్ టీఎంసీ ఎమ్మెల్యే నసీరుద్దీన్ అహ్మద్ మరణించారు. దీంతో ఆయన కుమార్తెను అధికార పార్టీ బరిలో నిలిపింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఈ స్థానాన్ని దక్కించుకుని తన బలాన్ని చాటుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తున్నది.ఇక గుజరాత్‌లో కాడి బీజేపీ ఎమ్మెల్యే కర్సాన్‌భాయ్ సోలంకీ మరణంతో ఉపఎన్నిక అనివార్యమైంది. అదేవిధంగా విసవదర్ ఆప్ ఎమ్మెల్యే భయానీ భూపేంద్రభాయ్ తన పదవికి, పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఈ రెండు చోట్ల త్రిముఖపోటీ నెలకొన్నది. రెండు స్థానాలను నిలుపుకోవాలని బీజేపీ, ఆప్ భావిస్తుండగా, ఇరు పార్టీలను ఖంగు తినిపించాలని కాంగ్రెస్ చూస్తున్నది.వచ్చే ఏడాది అసెబ్లీ ఎన్నికలు జరుగునున్న కేరళలో . నీలాంబర్ స్థానానికి ప్రస్తుతం బైపోల్ జరుగుతున్నది. గత ఎలక్షన్లలో ఈ సీటు నుంచి కాంగ్రెస్ మద్దతుతో గెలుపొందిన పీవీ అన్వర్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో జరుగుతున్న ఉపఎన్నికలో ఆయన ఇండిపెండెంట్‌గా మరోసారి పోటీచేస్తుండగా, కాంగ్రెస్, వామపక్ష కూటమి తమ అభ్యర్థులను పోటీకి దింపాయి. ఈ ఉపఎన్నికల ఫలితాలు జూన్ 23న వెలువడనున్నాయి. ఒక్క రాత్రికి రూ.2,400 కోట్లు!.. ఇరాన్ క్షిపణులను అడ్డుకునేందుకు వెచ్చిస్తున్న ఇజ్రాయెల్ ! ఇరాన్ సైనిక మౌలిక సదుపాయాలను విజయవంతంగా ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ చెప్పుకుంటున్నప్పటికీ సుదూర లక్ష్యాలను ఛేదించే క్షిపణులను అడ్డుకునే వ్యవస్థ క్రమంగా బలహీనపడుతున్నది.

## ఒక్క రాత్రికి రూ.2,400 కోట్లు!.. ఇరాన్ క్షిపణులను అడ్డుకునేందుకు వెచ్చిస్తున్న ఇజ్రాయెల్ !



న్యూఢిల్లీ-నవభూమి: ఇరాన్ సైనిక మౌలిక సదుపాయాలను విజయవంతంగా ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ చెప్పుకుంటున్నప్పటికీ సుదూర లక్ష్యాలను ఛేదించే క్షిపణులను అడ్డుకునే వ్యవస్థ క్రమంగా బలహీనపడుతున్నది. దీంతో ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారినట్లు అమెరికా అధికారి ఒకరిని ఉటంకిస్తూ వాల్ స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య నిర్విరామంగా క్షిపణుల దాడి కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వార్తకు ప్రాధాన్యం ఏర్పడింది. గత శుక్రవారం ఇజ్రాయెల్ ఇరాన్‌పై రైజింగ్ లయన్ ఆపరేషన్‌ని మొదలుపెట్టిన నాటి నుంచి ఇజ్రాయెల్ భూభాగంలోకి చొచ్చుకుపోయే సామర్థ్యం ఉన్న దాదాపు 400 బాలిస్టిక్ క్షిపణులను ఇరాన్ ప్రయోగించింది. ఇలాంటి క్షిపణులు ఇరాన్ వద్ద 2,000 వకు ఉన్నట్లు అంచనా. కాగా, భూమి నుంచి చాలా ఎత్తులో వెళ్లే ఈ క్షిపణులను అడ్డుకోవడం కోసమే డిజైన్ చేసిన యారో వ్యవస్థ ఇరాన్ పేల్చిన క్షిపణులలో చాలా వాటిని అడ్డుకోగలిగినప్పటికీ చాలా శ్రమపడాల్సి వచ్చింది.ఇరాన్ పేల్చిన క్షిపణులలో మూడింట ఒక వంతు క్షిపణులను మాత్రమే ఇజ్రాయెల్ ధ్వంసం చేసిందని, అయితే ఇరాన్ గగనతలంపై ఆధిపత్యాన్ని ఇజ్రాయెల్ సంపాదించుకోగలిగిందని టెల్ అవీవ్‌లోని అధికారులు వాల్ స్ట్రీట్ జర్నల్‌కి తెలిపారు. అయితే ఇరాన్ అమ్ముల పొదిలో సగానికి పైగా క్షిపణులు ఇంకా ఉన్నాయని, వాటిని భూగర్భ స్థావరాలలో దాచి ఉండవచ్చని ఇజ్రాయెల్ నిఘా వర్గాలు తెలిపాయి. ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థ ఎంత పటిష్టమైనదైనప్పటికీ దాని నిర్వహణ తలకు మించిన భారంగా మారింది. ఐరన్ డోమ్, డేవిడ్స్ స్లింగ్, యారో సిస్టమ్, అమెరికా సరఫరా చేసే ప్యాట్రియట్స్, థాడ్ బ్యాటరీలతో కూడిన ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థ వ్యయం ఆ దేశాన్ని కలవరపెడుతున్నది. రక్షణ కార్యకలాపాల కోసం ఒక్క రోజు రాత్రికి అయ్యే ఖర్చు 28.5 కోట్ల డాలర్లు (రూ.2,400 కోట్లు)గా ఇజ్రాయెల్ నుంచి వెలువడే ఫైనాన్షియల్ డైలీ ది మార్కర్ అంచనా వేసింది. క్షిపణులను అడ్డుకునే యారో సిస్టమ్ ఒక్కోటి 30 లక్షల డాలర్లని (రూ. 25.94 కోట్లు) పత్రిక తెలిపింది.

**10-12 రోజులకు సరిపడానే**

ఇరాన్ క్షిపణుల ప్రవాహం ప్రతిరోజూ కొనసాగుతుండడంతో ఇజ్రాయెల్ వద్ద గగనతల రక్షణ వ్యవస్థకు సంబంధించిన నిల్వలు నానాటికీ తగ్గిపోతున్నాయి. అమెరికా నుంచి వెంటనే సరఫరా జరగని పక్షంలో ఇజ్రాయెల్ వద్ద క్షిపణి విధ్వంసక వ్యవస్థ మరో 10 నుంచి 12 రోజులకు మించి ఉండదు. ఇప్పటికే ఇజ్రాయెల్ వద్ద నిల్వలు తరిగిపోతున్నాయని, ఏ క్షిపణిని అడ్డుకోవాలో అన్న విషయాన్ని ఎంపిక చేసుకోవలసిన పరిస్థితి త్వరలోనే రావచ్చని ఇజ్రాయెలీ నిఘా వర్గాలు వాల్ స్ట్రీట్ జర్నల్‌కి తెలిపాయి.

## మరోసారి పేలిన స్పేస్‌ఎక్స్ స్టార్‌షిప్..



న్యూఢిల్లీ-నవభూమి: ప్రపంచ కుబేరుడు, టెస్లా బాస్ ఎలాన్ మస్క్ కు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అంతరిక్ష రంగంలో క్రమంగా పురోగతి సాధిస్తున్న ఆయనకు చెందిన స్పేస్‌ఎక్స్ ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రయోగాలు వరుసగా విఫలమవుతున్నాయి. తాజాగా స్పేస్‌ఎక్స్ స్టార్‌షిప్ మరోసారి పేలింది.టెక్సాస్‌లోని ఎలాన్ మస్క్‌కు చెందిన పరీక్ష కేంద్రం వద్ద బుధవారం రొటీన్ స్టాటిక్ ఫైర్ టెస్ట్ నిర్వహించారు. ఈ క్రమంలో అది ఉన్నట్టుండి పేలిపోయింది. ఈ విషయాన్ని స్పేస్‌ఎక్స్ ఎక్స్ వేదికగా ధ్రువీకరించింది. బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఇది జరిగిందని పేర్కొంది. స్టార్‌షిప్ 10వ విమాన పరీక్షకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ ప్రమాదం జరిగిందని వెల్లడించింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదని, అధికారులు, సిబ్బంది సురక్షితంగా ఉన్నట్లు తెలిపింది. ప్రమాదానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

# సోనమ్‌తో 119 ఫోన్ కాల్స్.. అసలెవరీ సంజయ్ వర్మ?



మేఘాలయ-నవభూమి: మేఘాలయకు హనీమూన్ కోసం వెళ్లి హత్యకు గురైన రాజా రఘువంశీ కేసు గురించి అందరికీ తెలిసింది. ఈ కేసులో భార్య సోనమే.. ప్రియుడు రాజ్ కుశ్వాహా కోసం సుపారీ ఇచ్చి మరీ హత్య చేయించినట్లు ఇప్పటికే తెలిపోయింది. అయితే తాజాగా ఈ కేసులో మరో వ్యక్తి పేరు వినిపిస్తోంది. ముఖ్యంగా సోనమ్ రఘువంశీ కాల్ డేటా ఆధారంగా పోలీసులకు విస్తుపోయే విషయాలు తెలిశాయి. అందులోనూ సంజయ్ వర్మ అనే కొత్త వ్యక్తి పేరు తెరపైకి వచ్చింది. వివాహానికి ముందు, తర్వాత సోనమ్, సంజయ్‌లు 119 సార్లు ఫోన్ మాట్లాడుకున్నట్లుగా పోలీసులు గుర్తించారు. కేవలం 25 రోజుల్లోనే వీరు ఇంతగా మాట్లాడుకున్నట్లు తేలగా.. అతడికి కూడా ఈ కేసుతో ఏదైనా సంబంధం ఉందేమోనని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.మే 23వ తేదీన రాజా రఘువంశీ మేఘాలయలోని ఈస్ట్ ఖాసీ హిల్స్ జిల్లాలో హత్యకు గురయ్యారు. అతని మృతదేహం పది రోజుల తర్వాత వెయ్ సావ్‌డాంగ్ జలపాతం సమీపంలో లభ్యం కావడంతో ఈ కేసు వెలుగులోకి వచ్చింది. ప్రాథమికంగా సోనమ్ రఘువంశీయే తన భర్త హత్యకు ప్రియుడు రాజ్ కుశ్వాహాతో కలిసి పథకం రచించిందని తెలిసింది. అంతేకాకుండా రాజ్ కుశ్వాహా స్నేహితులకు సుపారీ ఇవ్వగా.. మేఘాలయకు చేరుకున్న నిందితులు సోనమ్ కళ్లెదుటే రాజా రఘువంశిని చంపేశారు. ఆపై అతడి మృతదేహాన్ని లోయలో పడేశారు. ఇందుకు సోనమ్ కూడా సాయం చేసింది. ఇదంతా ఇప్పటికే పోలీసుల దర్యాప్తులో తేలిపోయింది.అయితే ఈ దారుణం మొత్తం వెయ్ సావ్‌డాంగ్ జలపాతం సమీపంలోని ఒక ఏకాంత ప్రదేశంలో జరిగినట్లు దర్యాప్తులో వెల్లడి కాగా.. పోలీసులు సంఘటనా స్థలంలో సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. సోనమ్, రాజ్ కుశ్వాహ సహా మరో ముగ్గురు నిందితులను కూడా అక్కడకు తీసుకెళ్లారు. ఇందులో నిందితులు తాము చేసిన చర్యలన్నింటినీ కళ్లకు కట్టినట్లు చూపించారు. దీని తర్వాత రాజా రఘువంశీ కుటుంబ సభ్యులు.. సోనమ్ కుటుంబ సభ్యులు కూడా ఆమెకు సాయం చేశారని ఆరోపించారు. సోనమ్ తల్లిదండ్రులు సహా ఆమె సోదరులకు నార్కో టెస్టులు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు పోలీసులు సోనమ్ వద్ద నాలుగు ఫోన్లు ఉన్నట్లు గుర్తించారు. అందులో ఒకటి ఇప్పటికే పోలీసుల వద్ద ఉండగా.. మిగతావి మాత్రం దొరకలేదు. సోనమ్ కూడా వాటి గురించి చెప్పలేదు. కానీ దొరికిన ఒక్క ఫోన్‌నే పూర్తిగా పరిశీలించగా.. అందులో సంజయ్ వర్మ పేరు కనిపించింది. ముఖ్యంగా అతడితో సోనమ్ తరచుగా ఫోన్‌లో మాట్లాడినట్లు గుర్తించారు. ముఖ్యంగా 25 రోజుల్లోనే 119 సార్లు ఫోన్ కాల్స్ చేసుకున్నట్లు తెలుసుకుని షాక్ అయ్యారు. అసలు ఇతను ఎవరు, సోనమ్ ఎందుకు అతడితో అంతగా మాట్లాడిందని తెలుసుకునే పనిలో పడ్డారు. అసలు ఈ హత్యలో అతని ప్రమేయం ఏ మేరకు ఉంది, సోనమ్‌తో అతని సంబంధం ఎలాంటిది, హంతకులను నియమించడంలో అతని పాత్ర ఏంటి వంటి వివరాలను సేకరిస్తున్నారు. హనీమూన్‌కు వెళ్లిన భర్తను భార్యే హత్య చేయించడం, ఆపై ఒక కొత్త వ్యక్తి పేరు తెరపైకి రావడంతో ఈ కేసు దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. న్యాయం వెలుగులోకి వచ్చే వరకు ఈ కేసులోని మిగతా రహస్యాలు బయటపడాల్సి ఉంది.

## భార్యపై 93 ఏళ్ల వృద్ధుడి ప్రేమ.. ముగ్ధుడైన గోల్డ్ షాప్ ఓనర్



న్యూఢిల్లీ-నవభూమి:
ప్రస్తుత కాలంలో పెళ్లైన వారం, పది రోజులకే భార్యాభర్తలు విడిపోవడం.. ఒకరినొకరు చంపుకోవడం.. భర్తను విడిచి భార్య వెళ్లిపోవడం.. భార్యను విడిచి భర్త వెళ్లిపోతున్న సంఘటనలు చూస్తూనే ఉన్నాం. కానీ స్వచ్ఛమైన ప్రేమ ఉంటే.. ఎన్ని ఏళ్లైనా, ఎన్ని దశాబ్దాలైనా కలిసి ఉండవచ్చని ఈ జంట నిరూపిస్తోంది. ఓ 93 ఏళ్ల వృద్ధుడు తన భార్యపై చూపించిన అమితమైన ప్రేమకు ఏకంగా బంగారం దుకాణం యజమాని మంత్రముగ్ధుడైపోయాడు. నిజమైన ప్రేమ డబ్బును, పేదరికాన్ని దాటి ఉంటుందని ఈ జంట నిరూపించింది. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కావడంతో ఆ వృద్ధ జంటను చూసి.. సోషల్ మీడియా దాసోహం అంటోంది. భార్యా భర్తల మధ్య అర్థం చేసుకునేంత ప్రేమ ఉంటే.. కలకాలం ప్రశాంతంగా, సంతోషంగా గడపవచ్చని ఈ జంట.. ప్రస్తుత సమాజానికి ఒక సందేశం ఇస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో.. సోషల్ మీడియాలో 2 కోట్లకు పైగా వ్యూస్‌తో తెగ వైరల్ అవుతోంది. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో ఒక 93 ఏళ్ల వృద్ధుడు.. తన భార్య కోసం మంగళసూత్రం కొనేందుకు జ్యువెలరీ షాప్‌కు వెళ్లాడు. అయితే వారిద్దరినీ చూసిన సిబ్బంది మొదట వారు ఏదైనా సహాయం కోసం వచ్చారని భావించారు. అయితే జల్నా జిల్లాలోని అంభోరా జాహిర్ గ్రామానికి చెందిన నివృత్తి షిండే, ఆయన భార్య శాంతాబాయి ఆషాఢ ఏకాదశి కోసం పండర్‌పూర్‌కు పాదయాత్ర చేస్తున్నారు. సాంప్రదాయ తెల్లని ధోతి-కుర్తా వేసుకుని.. టోపీ పెట్టుకుని చాలా నిరాడంబరంగా కనిపించిన ఆ వృద్ధుడు.. తన భార్య కోసం మంగళసూత్రం కొనాలని అందులోకి వెళ్లాడు.అయితే వారికి కొన్ని మంగళసూత్రాలు చూపించగా.. అందులో ఒకటి సెలెక్ట్ చేసుకున్నారు. దానికి తమ వద్ద ఉన్న రూ.1120ని తీసి ఆ షాప్ యజమానికి ఆ వృద్ధుడు ఇచ్చాడు. వారిద్దరి ప్రేమ, తన భార్యకు ఏదైనా కొనివ్వాలని వృద్ధుడి తపన చూసిన ఆ జ్యువెలరీ షాప్ ఓనర్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యాడు. వారు సెలెక్ట్ చేసుకున్న మంగళసూత్రం, కమ్మలు ఇచ్చేసి.. ఆ డబ్బులు కూడా వారికి ఇచ్చేశాడు. వారు డబ్బులు తీసుకోవాలని సూచించగా.. అందులో నుంచి కేవలం రూ.20 మాత్రమే తీసుకుని వారికి ఆ మంగళసూత్రాన్ని బహుమతిగా ఇచ్చాడు.ఇక ఈ సంఘటనకు సంబంధించిన వీడియోను.. ఆ జ్యువెలరీ షాప్ సిబ్బంది వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా.. నెటిజన్ల నుంచి భారీగా స్పందన లభిస్తోంది. ఆ వీడియో వైరల్‌గా మారడంతో ఇప్పటికే 2 కోట్లకు పైగా వ్యూస్ సాధించింది. ఆ వృద్ధ దంపతుల ప్రేమను చూసి నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

## భారత్-పాక్ యుద్ధాన్ని ఆపినందుకు ట్రంప్‌కు నోబెల్ బహుమతి

### ట్రంప్-మునీర్ భేటీకి కారణమిదే!



అమెరికా-నవభూమి: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ సయ్యద్ అసిమ్ మునీర్‌తో వైట్‌హౌస్‌లో లంచ్ సమావేశం నిర్వహించడం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఒకవైపు తనకు భారత్ మిత్రదేశమని.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంచి ఫ్రెండ్ అని చెప్పే ట్రంప్.. గత కొంతకాలంగా పాకిస్తాన్‌కు మద్దతుగా మాట్లాడుతున్నారు. అదే సమయంలో ఐ లవ్ పాకిస్తాన్ అంటూ ప్రశంసలు గుప్పించడం తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ క్రమంలోనే డొనాల్డ్ ట్రంప్ , అసిమ్ మునీర్ భేటీకి సంబంధించి తాజాగా మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఇటీవల భారత్, పాకిస్తాన్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతలు అణు యుద్ధంగా మారకుండా తానే అడ్డుకున్నానని ట్రంప్ పదే పదే గొప్పలు చెప్పుకుంటుండగా.. ఈ యుద్ధం ఆపినందుకు డొనాల్డ్ ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని అసిమ్ మునీర్ పేర్కొనడం గమనార్హం. వైట్‌హౌస్‌లో గంటకుపైగా జరిగిన ఈ భేటీ సందర్భంగా పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌ను ట్రంప్ ప్రశంసలతో ముంచెత్తారు. భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధం ఉద్రిక్తతలను నివారించడంలో అసిమ్ మునీర్ కీలక పాత్ర పోషించారంటూ ట్రంప్ కితాబిచ్చారు. ఆ యుద్ధం కొనసాగకుండా అడ్డుకున్నందుకు కృతజ్ఞతలు అని తెలిపారు. పాక్ ఆర్మీ చీఫ్‌తో అమెరికా అధ్యక్షుడు ఒంటరిగా వైట్‌హౌస్‌లో భేటీ కావడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. గత నెలలో భారత్-పాకిస్తాన్ మధ్య అణు యుద్ధాన్ని నివారించినందుకు ట్రంప్‌కు నోబెల్ బహుమతి ఇవ్వాలని అసిమ్ మునీర్ పిలుపునిచ్చినందున పాకిస్తాన్ ఆర్మీ చీఫ్‌ను ట్రంప్ కలుస్తున్నారని వైట్‌హౌస్ డిప్యూటీ ప్రెస్ సెక్రటరీ అన్నా కెల్లీ ఒక ప్రకటనలో తెలిపారు.గత నెలలో భారత్ పాక్ ఉద్రిక్తతలను ముగించినందుకు అసిమ్ మునీర్‌కు తాను కృతజ్ఞతలు తెలిపినట్లు డొనాల్డ్ ట్రంప్ విలేకరులకు చెప్పారు. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీని కూడా ట్రంప్ ప్రశంసించారు. ఇద్దరు చాలా తెలివైన వ్యక్తులు ఆ యుద్ధాన్ని కొనసాగించకూడదని నిర్ణయించుకున్నారని.. అది అణు యుద్ధంగా మారే అవకాశం ఉందని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్‌తో పాకిస్తాన్‌కు సన్నిహిత సంబంధాలు ఉండగా.. ప్రస్తుతం ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ సమావేశం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా అసిమ్ మునీర్‌ను కలవడం గౌరవంగా ఉందని పేర్కొన్న ట్రంప్.. ఇరాన్ గురించి చర్చించినట్లు చెప్పారు. ఇజ్రాయెల్, ఇరాన్ గురించి పాకిస్తాన్ నాయకత్వానికి తెలుసని.. అయితే చాలా మందికి ఇరాన్ గురించి తెలిసిన దానికంటే పాకిస్తాన్‌కు మరింత ఎక్కువగా తెలుసని ట్రంప్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌తో పాకిస్తాన్‌కు సంబంధాలు బాగానే ఉన్నాయని.. ప్రస్తుతం అక్కడ ఏం జరుగుతుందో కూడా వారికి తెలుసని.. అయితే పాకిస్తాన్ నాతో ఏకీభవించిందని ట్రంప్ వెల్లడించారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులను పాకిస్తాన్ తీవ్రంగా ఖండించిన విషయం తెలిసిందే. ఇజ్రాయెల్ దాడులు అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తున్నాయని, ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు కలిగిస్తున్నాయని పేర్కొంది.

# ప్లాన్ ఏ విఫలమైతే ప్లాన్ బీ సిద్ధం..

## బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌కు బెదిరింపులు



న్యూఢిల్లీ-నవభూమి:దేశంలో వరుస బాంబు బెదిరింపులు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి మరోసారి ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. ఆగంతకులు విమానాశ్రయ భద్రతా దళానికి బెదిరింపు మెయిల్ పంపారు. టాయిలెట్ పైప్‌లైన్‌లో బాంబు ఉంచినట్లు అందులో పేర్కొన్నారు. ఒకవేళ ప్లాన్ ఏ విఫలమైతే, తమ వద్ద ప్లాన్ బీ ఉందని హెచ్చరించారు. అంతేకాదు 'ఉగ్రవాది అజ్మల్ కసబ్ ను ఉరితీయడం తప్పు' అంటూ అందులో ప్రస్తావించారు. బెదిరింపు మెయిల్‌తో అప్రమత్తమైన అధికారులు విమానాశ్రయంలో తనిఖీలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. దీంతో అది నకిలీ బెదిరింపులుగా నిర్ధరించారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఐడీ ఆధారంగా ఆగంతకులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.కాగా, బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపులు రావడం ఈ నెలలో ఇది మూడోసారి కావడం గమనార్హం. జూన్ 13, జూన్ 16 తేదీల్లో కూడా ఇలాంటి బెదిరింపు మెయిల్సే వచ్చాయి. ఇక ఈనెల 6వ తేదీన బెంగళూరులోని కోరమంగళలో గల ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం, సీఎం నివాసానికి ఇదే విధమైన బాంబు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. ఐఈడీలతో ఆత్మాహుతి బాంబర్లు దాడి చేస్తారని హెచ్చరించారు. ఆయా ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తమిళిసై జోస్యం.. ఎయిమ్స్ ప్రారంభం నాటికి డీఎంకే అధికారంలో ఉండదు



చెన్నై-నవభూమి:మదురై ఎయిమ్స్ ఆస్పత్రి ప్రారంభోత్సవ సమయానికి డీఎంకే అధికారంలో ఉండదని బీజేపీ నేత తమిళిసై సౌందర్‌రాజన్ జోస్యం చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేసేలా షోలింగనల్లూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో తమిళిసై మాట్లాడుతూ... ప్రపంచంలోనే శక్తివంతమైన ఆర్థికవ్యవస్థ గా భారత్‌ను రూపొందించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కృషిచేస్తున్నారని అన్నారు. ఎయిమ్స్ ఆసుపత్రి నిర్ణీత సమయంలోనే ప్రారంభించేలా పనులు వేగవంతం చేశారని, ఎన్డీఏ పాలనతో ఎయిమ్స్ ప్రారంభిస్తామని తమిళిసై సౌందర్‌రాజన్ తెలిపారు.

## అన్ని నోట్ల కట్టలు బయటపడ్డా జస్టిస్ వర్మ ఫిర్యాదు చేయలేదు: సుప్రీం కోర్టు ప్యానెల్



న్యూఢిల్లీ-నవభూమి: జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారంపై సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన ప్యానెల్ ఆయన వాదనలను తిరస్కరించినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో జస్టిస్ వర్మ తీరు అనుమానాస్పదంగా ఉందని అభిప్రాయపడినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో జస్టిస్ వర్మ నివాసంలోని స్టోర్ రూమ్‌లో భారీగా కాలిన కరెన్సీ నోట్లు బయటపడ్డాయి. అగ్ని ప్రమాదం జరగడంతో నోట్ల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ విషయంలో సుప్రీం కోర్టు ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది.భారీ స్థాయిలో కరెన్సీ నోట్ల కట్టలు ప్రత్యక్ష సాక్షుల కంటపడినా కూడా జస్టిస్ వర్మ పోలీసులకు ఫిర్యాదు చేసే ప్రయత్నం చేయలేదని కమిటీ తేల్చింది. కనీసం జ్యుడీషియల్ అధికారులకు కూడా సమాచారం ఇవ్వలేదని తెలిపింది. ఈ వ్యవహారంలో వర్మ ప్రవర్తన అసహజంగా ఉందని, ఆయనను తొలగించేందుకు కావాల్సిన ఆధారాలు ఉన్నాయని సిఫారసు చేసినట్టు తెలుస్తోంది.జస్టిస్ వర్మ కుమార్తె సహా 55 మంది సాక్షులను సుప్రీం కోర్టు కమిటీ తన విచారణలో భాగంగా ప్రశ్నించింది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వాంగ్మూలాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంది. గదిలో కాలిన నోట్ల కట్టల తాలూకు వీడియోలు, ఫొటోలను కూడా పరిశీలించింది. 'అంత భారీ స్థాయిలో నోట్ల కట్టలను చూసి షాకయ్యా. ఇలాంటిది నా జన్మలో ఎప్పుడూ చూడలేదు' అని ఓ సాక్షి సుప్రీం కోర్టు ప్యానల్‌కు తెలిపినట్టు సమాచారం. ఈ విషయంపై తమకు ఎలాంటి అవగాహన లేదని జస్టిస్ వర్మ చెప్పడం నమ్మశక్యంగా లేదని కమిటీ అభిప్రాయపడింది.తన ప్రతిష్ఠను దిగజార్చే కుట్ర జరిగిందన్న జస్టిస్ వర్మ వాదనను కూడా కమిటీ తిరస్కరించింది. 'కుట్ర కోణం ఉన్నట్టైతే ఆయన ఫిర్యాదు ఎందుకు చేయలేదు. కనీసం హైకోర్టు చీఫ్ జస్టిస్‌కో లేదా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికో ఎందుకు సమాచారం ఇవ్వలేదు' అని ప్రశ్నించినట్టు తెలిసింది. నగదు లభించిన స్టోర్ రూమ్‌లోకి ఎవరు వెళ్లాలనేది పూర్తిగా జస్టిస్ వర్మ, ఆయన కుటుంబసభ్యులే నిర్ణయించే వారని కూడా పేర్కొంది. ఘటనకు సంబంధించి ఆధారాల ధ్వంసంలో జస్టిస్ వర్మ కుమార్తె, ప్రైవేటు సెక్రెటరీల పాత్ర ఉండే అవకాశం కూడా ఉందని అభిప్రాయపడింది.ఢిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్న సమయంలో జస్టిస్ వర్మ అధికారిక నివాసంలో మార్చి 14న అగ్నిప్రమాదం జరిగింది. ఈ క్రమంలో అక్కడి స్టోర్ రూమ్‌లో భారీగా కాలిన కరెన్సీ నోట్లు బయటపడటం సంచలనం కలిగించింది. జస్టిస్ వర్మపై ఆరోపణలు వెల్లువెత్తడంతో సుప్రీం కోర్టు స్వయంగా రంగంలోకి దిగింది. మార్చి 28న సుప్రీం కోర్టు కొలీజియం ఆయనను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసింది. ఆయనకు ఎలాంటి న్యాయపరమైన బాధ్యతలు అప్పగించొద్దని కూడా సిఫారసు చేసింది. ఘటనపై విచారణ కోసం ముగ్గురు సుప్రీం న్యాయమూర్తులతో ఓ కమిటీని ఏర్పాటు చేసింది.

## కోతగిరిలో నల్ల చిరుత సంచారం..



చెన్నై-నవభూమి:నీలగిరి( జిల్లా కోతగిరి సమీపంలో నల్ల చిరుత సంచారం సీసీ ఫుటేజీలో నమోదైంది. పెరియార్ నగర్ గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతంలో తరచూ ఎలుగుబంట్లు, అడవి దున్నలు, చిరుత తదితరాలు సంచరిస్తుంటాయి. ఈ క్రమంలో, సోమవారం ఈ గ్రామానికి వెళ్లే రోడ్డుపై నల్ల చిరుత సంచరించింది. రోడ్డుపై కొద్ది దూరం వెళ్లిన చిరుత, అనంతరం సమీపంలోని తేయాకు తోటల్లోకి వెళ్లింది. నల్ల చిరుత సంచరించే దృశ్యాలు ఆ ప్రాంతంలో ఏర్పాటుచేసి సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. గ్రామంలోకి జంతువులు ప్రవేశించకుండా తగిన చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు అటవీ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



## మెడపై గీతలు వస్తున్నాయా

ప్రతిరోజూ కనీసం అయిదు గ్లాసుల నీళ్లు తాగాలి. నీరు అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు తీసుకోవాలి. అప్పుడే చర్మానికి తేమ అందడంతోపాటు చర్మం మృదువుగా మెరుస్తుంది. సాగే గుణం పెరుగుతుంది. దీనివల్ల చర్మం మీద గీతలు ఏర్పడకుండా ఉంటాయి.బయటికి వెళ్లడానికి అరగంట ముందు మెడకు సన్‌స్క్రీన్ లోషన్ రాసుకోవాలి. దీనివల్ల సూర్యకిరణాల నుంచి రక్షణ ఏర్పడి మెడ మీద గీతలు రావు.మొబైల్, ల్యాప్‌టాప్ వినియోగించేటప్పుడు మెడను ముందుకు చాచడం వల్ల కూడా గీతలు ఏర్పడుతూ ఉంటాయి. కాబట్టి సరైన భంగిమలో కూర్చోవాలి. తరచూ భుజాలను, మెడను అటూ ఇటూ తిప్పడం వల్ల అక్కడి కండరాలు బలోపేతమవుతాయి. రక్తప్రసరణ సజావుగా జరిగి గీతలు, ముడతలు మాయమవుతాయి.ఆకు కూరలు, గింజలు, చేపలను తరచూ తింటూ ఉండాలి. విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉన్న ఆహారపదార్థాలు తీసుకోవాలి. వీటివల్ల చర్మానికి పోషణ లభిస్తుంది.మెడమీద మురికి చేరకుండా చూసుకోవాలి. వారానికి ఒకసారి సున్నిపిండితో రుద్ది శుభ్రం చేసుకోవాలి. తరచూ మాయిశ్చరైజర్ రాసుకుంటూ ఉండాలి. విటమిన్-ఇ ఆయిల్ రాసుకున్నా ప్రయోజనం ఉంటుంది.నిద్ర సరిపోకపోతే చర్మం మీద ముడతలు, గీతలు ఏర్పడతాయి. అందుకే ప్రతిరోజూ కనీసం ఎనిమిది గంటలు ప్రశాంతంగా నిద్రపోవాలి.



## ప్రసవానికి ఆసుపత్రికి వెళ్లేటప్పుడు- తల్లులు గుర్తుంచుకోవాల్సిందివీ..



సాధారణంగా తొమ్మిది నెలలు నిండిన తరవాత ప్రసవం కోసం గర్భిణులు ఆసుపత్రిలో చేరుతూ ఉంటారు. ప్రసవం తరవాత కనీసం మూడు నుంచి అయిదు రోజులు అక్కడే...

**ప్రసవం కోసం ఆసుపత్రికి వెళ్లేటప్పుడు**

సాధారణంగా తొమ్మిది నెలలు నిండిన తరవాత ప్రసవం కోసం గర్భిణులు ఆసుపత్రిలో చేరుతూ ఉంటారు. ప్రసవం తరవాత కనీసం మూడు నుంచి అయిదు రోజులు అక్కడే ఉండాల్సి వస్తుంది. ఇలా ఆసుపత్రికి వెళ్లే ముందు కాబోయే తల్లులు తమ వెంట ఏమేం తీసుకువెళ్లాలో తెలుసుకుందాం...

వైద్యులు సూచించిన ప్రకారం ప్రసవ తేదీ సమీపిస్తుందనగానే ఒక బ్యాగ్‌ను సిద్ధం చేసుకోవాలి. ఆ బ్యాగ్ పెద్దదిగా, తేలికగా పట్టుకోవడానికి వీలుగా ఉండాలి. తల్లీ బిడ్డలకు అవసరమయ్యే వస్తువులు, దుస్తులు తదితరాలను పొందికగా సర్దడానికి అనువుగా ఉండాలి.

వైద్యుల సూచనలతో ఇప్పటి వరకు వాడిన మందుల చీటీలు, ఇతరత్రా చేయించుకున్న వైద్య పరీక్షల రిపోర్టులు, ఎక్స్‌రేలు, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యానికి సంబంధించి కీలక సమాచారాన్ని తెలిపే పత్రాలను ఒక ఫైల్‌లో ఉంచాలి.

దీనితోపాటు ఆధార్ కార్డ్, ఇన్సూరెన్స్ కార్డులను అడిగిన వెంటనే తీసి చూపించేందుకు వీలుగా బ్యాగ్‌లో పెట్టాలి.

ప్రసవం అయిన తరవాత ధరించేందుకు వదులుగా ఉండే నూలు దుస్తులు, పొడవాటి చున్నీలు, బాలింతల కోసం ప్రత్యేకించిన బట్టలు, తువాళ్లు, లోదుస్తులు, మెటర్నిటీ ప్యాడ్స్ సర్దుకోవాలి.

బిడ్డకు పాలిచ్చేటప్పుడు ఒడిలో పెట్టుకోవడానికి మెత్తటి దిండును తీసుకెళ్లాలి.

రోజువారీగా అవసరమయ్యే టూత్‌బ్రష్, పేస్ట్, సబ్బులు, షాంపూలు, దువ్వెన, లిప్ బామ్, మసాజ్ ఆయిల్ తదితరాలను ఒక బాక్స్‌లో పెట్టుకోవాలి.

ప్రసవం తరవాత నడవమని వైద్యులు చెబుతుంటారు. మెత్తగా సౌకర్యవంతంగా ఉండే చెప్పుల జతను తీసుకెళ్లాలి. పాదాలను వెచ్చగా ఉంచే సాక్స్ కూడా పెట్టుకోవాలి.పుట్టిన బిడ్డకు డైపర్లు అవసరమవుతాయి.

వీటితోపాటు పిల్లలకు మాత్రమే ప్రత్యేకించిన ర్యాష్ క్రీమ్‌ను కూడా బ్యాగ్‌లో పెట్టుకోవాలి.

## ఊహలకు అందని రూపాలు

టీ కప్పులు, మగ్‌లను అందమైన కళారూపాలుగా మార్చుతూ, ఫంక్షనల్ ఆర్టిస్ట్‌గా రాణిస్తూ, మార్కెటింగ్ చేస్తూ, ఆర్ట్‌ప్రెన్యూర్‌గా మారింది శ్రీనియా చౌదరి. ఈ కళారూపం అంతగా సక్సెస్ కాదన్న వారి నోళ్లను మూయిస్తూ, ఛాలెంజ్‌గా తీసుకొని మరీ ఈ కళలో రాణిస్తోంది. ఢిల్లీలో సొంతంగా స్టూడియో ఏర్పాటు చేసుకోవడంతో పాటు తన కళారూపాలను వివిధ దేశాలకు ఎక్స్‌పోర్ట్ చేస్తోంది. ఎవరి ఊహకూ అందని కళారూపాలు శ్రీనియా చేతుల్లో రూపుదిద్దుకుంటాయి. పదేళ్లుగా సిరామిక్ మెటీరియల్‌తో మగ్‌లను తయారుచేస్తూ, వాటినే అందమైన కళాఖండాలుగా తీర్చిదిద్దుతోంది. యూరప్‌లోని లాట్వియాలో సిరామిక్స్ బియన్నాలే, మార్క్ రోత్కో మ్యూజియంలలోనూ తన కళారూపాలు స్థానాన్ని పొందాయంటే శ్రీనియా కృషి, పట్టుదల ఎంత బలమైనవో ఇట్టే తెలిసిపోతాయి.



**సాధనమున సమకూరిన కళ**

స్వతహాగా చిత్రకారిణి అయిన శ్రీనియా ఈ కళలో రాణించడానికి మట్టిపైనే చిత్రాలు వేసేది. ఆ తర్వాత మట్టితో కళారూపాలు తయారుచేసి వాటిపైనే చిత్రీకరించేది. తన ప్రతి చిత్రంలోనూ సమాజం గురించిన ఆలోచనలు ప్రతిబింబిస్తాయి. 'సెరామిక్స్‌తో రకరకాల కళాత్మక రూపాలను తయారుచేయడం అనేది శతాబ్దాలుగా ఉంది. కానీ, నేను ప్రత్యేకంగా ఎంచుకున్న మగ్గులతో డిజైన్లు, మగ్గులపై పెయింటింగ్.. ప్రజల్లో మంచి డిమాండ్ ఉంది. దీనిని అనుసరించే నేను నా దైన సృజనను జోడించాను. అభ్యాసనకు మట్టితోనే కళారూపాలను తీర్చడంలో కొన్నాళ్లు నిమగ్నమయ్యాను. ఎంతోమందిని అవి ఆకట్టుకున్నాయి. వీటికున్న డిమాండ్‌ను బట్టి ఆర్ట్‌ప్రెన్యూర్‌గా మారాలనుకున్నాను.

**నెలల సమయం..** కోవిడ్ టైమ్‌లోనూ నా ఆలోచనా విధానాన్ని నలుగురితో పంచుకోవడానికి, శిక్షణ ఇవ్వడానికి వెబ్‌షాప్‌ను ప్రారంభించాను. కొన్ని వారాల పాటు వెబ్‌షాప్‌ను నిర్వహించాను. వ్యూవర్స్‌లో మంచి ఆసక్తి కనపడింది. కానీ, నిత్యసాధనతోనే ఈ కళలో రాణించగలరు. ఏ కాలమైనా సరే యంత్రంతో తయారుచేసిన వస్తువుకన్నా, పూర్తిగా చేతితో తయారుచేసిన వస్తువు ఖరీదు ఎక్కువ. అందుకే, సిరామిక్‌తో మగ్ తయారీ నుంచి వాటి రూపాల్లో మార్పులతో పాటు.. ఒక కళాఖండంగా తయారుచేయడానికి చాలా సమయం పడుతుంది. ముందుగా నేను అనుకున్న కళారూపం స్కెచ్ వేసుకుంటాను. అది సంతృప్తిగా అనిపించాక దానిని వాస్తవ రూపానికి తీసుకు రావడానికి నెలల సమయం పడుతుంది. ఒక్కో సమయంలో అయితే ఒక చిన్న పీస్‌ను మాత్రమే తయారు చేస్తుంటాను. ఒకదానితో మరోటి అస్సలు పోలికే ఉండదు. దేనికది ప్రత్యేకం. కానీ, అన్ని కళారూపాలకు మంచి డిమాండ్ ఉంది. ఆన్‌లైన్ వేదిక ద్వారా నా కళారూపాలను నేనే మార్కెటింగ్ చేస్తుంటాను. విదేశీయులు కూడా ఈ ఫంక్షనల్ ఆర్ట్‌ను బాగా ఇష్టపడుతున్నారు. వ్యాపారిగా మారినప్పటికీ ప్రతీ కళారూపాన్ని నేనే స్వయంగా సృష్టిస్తాను. ఎవరి సాయమూ తీసుకోను. అచ్చులు పోయడం అనేది నా ఆలోచనకు పూర్తి విరుద్ధం. అందుకే ప్రతీ కళాఖండం విభిన్నంగా ఉంటుంది' అని వివరిస్తారు శ్రీనియా.



## ఈ భంగిమతో గాఢ నిద్ర

ఈ భంగిమతో గాఢ నిద్ర కొంత మంది ఒక కాలిని లేదా రెండు కాళ్లను దుప్పటి బయట పెట్టి నిద్రపోతుంటారు. ఇలా చేయడం వలన ఏం జరుగుతుందో తెలుసుకుందాం..

ఈ భంగిమతో గాఢ నిద్ర కొంత మంది ఒక కాలిని లేదా రెండు కాళ్లను దుప్పటి బయట పెట్టి నిద్రపోతుంటారు. ఇలా చేయడం వలన ఏం జరుగుతుందో తెలుసుకుందాం..

నిద్రించే సమయంలో మనకు తెలియకుండానే, ఒక కాలిని దుప్పట్లో నుంచి బయట పెట్టి పడుకుంటూ ఉంటాం. అయితే ఇలా ఒక కాలును దుప్పటి బయట పెట్టి నిద్రపోయే అలవాటు వెనక ఒక ఆరోగ్యకరమైన కారణం ఉందని జోర్నల్ ఆఫ్ ఫిజియలాజికల్ యాంత్రొపాలజీలో ప్రచురించిన 2023 నాటి అధ్యయనంలో పేర్కొన్నారు. ఇంతకూ ఇలాంటి అలవాటు వల్ల మన శరీరంలో ఏం జరుగుతుంది? శరీర వేడిని వేగంగా వదిలించుకోడానికి వీలుగా మన అరికాళ్లలో ప్రత్యేకమైన రక్తనాళాలుంటాయి. కాబట్టి రాత్రి వేళ కాళ్లను దుప్పటి వెలుపల ఉంచడం వల్ల, పాదాలకు చల్లటి గాలి సోకి, శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది.. దాంతో గాఢనిద్రకు అవసరమయ్యే మెలటోనిన్ హార్మోన్ స్రావం పెరుగుతుంది. ఇలా శరీరం చల్లబడే ప్రభావం, నిద్రలోకి జారుకునే సమయాన్ని వేగవంతం చేస్తుందనీ, గాఢనిద్రలోకి జారుకునేలా చేసి, నిద్ర నాణ్యతను పెంచుతుందనీ పరిశోధకులు అంటున్నారు.





## ఒక ఆశయంతో కూడిన ప్రయాణం

వైకల్యం ఆమెను కుంగనివ్వలేదు.ప్రపంచాన్ని మార్చాలనే ఆశయాన్ని మాత్రం మరవలేదు. మూడేళ్ళకే పోలియో బారిన పడి జీవితమంతా కాళ్లకు కట్టేసినా... ఐశ్వర్యారావు లక్ష్యాన్ని పట్టు విడవలేదు. వైద్యురాలిగా మారి, ఇప్పుడు మరో వందలమంది వికలాంగ మహిళలకూ ఆశ్రయం కల్పిస్తున్న ఆమె "బెటర్ వరల్డ్ షెల్టర్" ద్వారా మెరుగైన సమాజ నిర్మాణానికి కొత్త మార్గాన్ని చూపిస్తున్నారు.ఈ వైకల్యం ఉందని కుంగిపోలేదు. సవాళ్ళు ఎదురైనా భయపడలేదు. నిర్దేశించుకున్న గమ్యాన్ని చేరుకోవడానికి ఎంతటి శ్రమనైనా లెక్క చేయలేదు. మూడేళ్ళకే పోలియో బారిన పడిన డాక్టర్ ఐశ్వర్యారావు విధిని ఎదిరించి...

ఈ ఆశ్రయం మెరుగైన ప్రపంచం కోసం

వైకల్యం ఉందని కుంగిపోలేదు. సవాళ్ళు ఎదురైనా భయపడలేదు. నిర్దేశించుకున్న గమ్యాన్ని చేరుకోవడానికి ఎంతటి శ్రమనైనా లెక్క చేయలేదు. మూడేళ్ళకే పోలియో బారిన పడిన డాక్టర్ ఐశ్వర్యారావు విధిని ఎదిరించి గెలిచారు. వైద్యురాలిగా సేవలందిస్తూనే... నిలువనీడలేని వికలాంగ మహిళలకు ఆశ్రయం కల్పిస్తున్నారు. ఈ మధ్యే వారి కోసం ప్రత్యేకంగా ఒక జిమ్ కూడా ఏర్పాటు చేసి, పారా క్రీడలను ప్రోత్సహిస్తున్నారు. చెన్నైకి చెందిన 52 ఏళ్ళ ఐశ్వర్య స్ఫూర్తిమంతమైన ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే...

"మాది విద్యావంతుల కుటుంబం. మా నాన్న ఐఎఎస్ అధికారి. నన్ను బాగా చదివించాలనేది ఆయన కోరిక. కానీ తొమ్మిదేళ్ళు వచ్చేదాకా నేను బడికే వెళ్ళలేదు. కారణం... నాకు మూడేళ్ళ వయసులో పోలియో సోకింది. నా కండరాలన్నీ బలహీనమైపోయాయి. కాళ్ళను స్వతంత్రంగా కదపలేకపోయేదాన్ని. నా తల్లిదండ్రులు ఎన్నో ఆసుపత్రులకు తిరిగారు, ఎందరో వైద్యులను కలిశారు. కానీ పెద్దగా ప్రయోజనం కలగలేదు. అలా ఆరేళ్ళపాటు ఇంటికే పరిమితమైపోయాను. ఇంట్లోనే అమ్మ దగ్గర రాయడం, చదవడం నేర్చుకున్నాను. నన్ను బడికి పంపడానికి మొదట్లో సంకోచించినా... నా ఉత్సాహం చూసి నాన్న ఒప్పుకున్నారు. అదృష్టవశాత్తూ ఒక స్కూల్‌లో నన్ను చేర్చుకోవడానికి



ప్రిన్సిపాల్ అంగీకరించారు. కొన్ని పరీక్షలు పెట్టి... మూడో తరగతిలో అడ్మిషన్ ఇచ్చారు. అప్పుడు నాకు తొమ్మిదేళ్ళు.

కొత్త ప్రపంచంలో...స్కూల్ అనేది అప్పటికి నాకు పూర్తిగా కొత్త ప్రపంచం. 'అక్కడ ఎలా నెగ్గుకొస్తానా?' అనే అనుమానాలతోనే తరగతి గదిలోకి అడుగుపెట్టాను. అయితే తోటి విద్యార్థులు స్నేహపూర్వకంగా ఆహ్వానించారు. దాంతో నాకున్న సంకోచాలన్నీ మాయమయ్యాయి. అందరిలాగే నేను కూడా ఏదైనా సాధించగలననే ఆత్మవిశ్వాసం కలిగింది. చదువులో ఒక్కొక్క మెట్టూ ఎక్కాను. ఇంటర్ తరువాత... నాకు ఆరు ఇంజనీరింగ్ కళాశాలల్లో, ఒక మెడికల్ వైద్య విశ్వవిద్యాలయంలో సీట్లు వచ్చాయి. తీవ్రంగా ఆలోచించిన తరువాత... వైద్య విద్యవైపే మొగ్గు చూపాను. 1996లో ఎంబీబీఎస్ పూర్తయ్యాక, శిశు వైద్యంలో డిప్లమా చేశాను. పేదలకు, వైకల్యాలు ఉన్నవారికి ఏదైనా చేయాలని అప్పుడే నిర్ణయించుకున్నాను. అందుకే విద్య, ఆరోగ్య సంరక్షణ, అత్యవసర సేవలు తదితర అంశాల్లో ఆ సంస్థ సేవలు అందించే 'వరల్డ్ విజన్ అనే స్వచ్ఛంద సంస్థలో చేరాను. కొన్నేళ్ళ తరువాత... హెచ్ఐవి చికిత్సలోనూ నైపుణ్యం సంపాదించాను.

## ఊబకాయం చికిత్సతో క్యాన్సర్లు దూరం



ఊబకాయం చికిత్సతో పలు రకాల క్యాన్సర్ల ప్రమాదం దాదాపు సగం తగ్గుతుందని ఓ అధ్యయనంలో తేలింది. ఆ వివరాలు...

ఊబకాయం చికిత్సతో ఊబకాయ సంబంధిత క్యాన్సర్ల ప్రమాదం దాదాపు 50 శాతం తగ్గుతుందని ఇజ్రాయెల్ పరిశోధకులు కనుగొన్నారు. ఈ పరిశోధనలో భాగంగా సుమారు 6 వేల మందిని పరిశీలించారు. ఊబకాయం చిక్సితకు వాడే ఇంజక్షన్లు, బేరియాట్రిక్ శస్త్రచికిత్స వలన, 13 రకాల ఊబకాయ సంబంధిత క్యాన్సర్ల ప్రమాదం తగ్గుతుందని కనుగొన్నారు.

ది లాన్సెట్ క్లినికల్ మెడిసిన్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం వివరాలను స్పెయిన్‌లో జరిగిన యూరోపిన్ కాంగ్రెస్ ఆన్ ఒబిసిటీ సమావేశంలో పరిశోధకులు వెల్లడించారు. సాధారణంగా బరువు తగ్గడం వలన ఆ క్యాన్సర్ల ప్రమాదం కొంతమేర తగ్గుతుంది. అయితే చికిత్సకు వాడే ఇంజెక్షన్ల వలన ఆ ప్రమాదం మరింత తగ్గుతుందని పరిశోధకులు తాజా అధ్యయనంలో గుర్తించారు. ఊబకాయానికి మందులు, ఇంజెక్షన్‌లు వాడే వారికంటే బేరియాట్రిక్ సర్జరీ చేయించుకునే వారు రెండింతల బరువు తగ్గుతారు. బేరియాట్రిక్ సర్జరీ వలన 30 నుంచి 42 శాతం వరకు ఈ క్యాన్సర్ల ప్రమాదం తగ్గుతుందని పరిశోధకులు గుర్తించారు.

అలాగే బరువును తగ్గించే మందులు, ఇంజక్షన్లు ఈ క్యాన్సర్ల ప్రమాదాన్ని దాదాపు 50 శాతం తగ్గించగలవని కనుగొన్నారు. అయితే ఈ మందులు ఊబకాయం సంబంధం లేని క్యాన్సర్ల ప్రమాదాన్ని పెంచబోవని నిర్ధారించుకోవడం కోసం మరిన్ని పరిశోధనలు అవసరమని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు.

## హస్తకళాభరణం!

బంగారపు హంగులు లేవు. వెండికే సొంతమైన ధగధగల్లేవు. ముత్యాల మెరుపుల్లేవు. రత్నాల రాచ మర్యాదలూ లేవు. అయితేనేం, ఆ నగల వగలు చూడాల్సిందే. ధర తక్కువ. వైవిధ్యం ఎక్కువ. కళాత్మకతా అధికమే. ఏ చీర కట్టుకుంటే ఆ వన్నె హారం ధరించవచ్చు. అదే రంగు ఇయర్ రింగ్స్ సింగారించుకోవచ్చు. అంతేనా, ఎకోఫ్రెండ్లీ కూడా.



బంకమన్ను, గుడ్డ పేలికలు, పూసలు, దారాలు, సహజమైన రంగులు.. ఇవే ముడి సరుకు. హ్యాండ్ మేడ్ హారాలే కాదు.. జుంకాలు, ముక్కుపుడకలు, గాజులు కూడా లభిస్తాయి.



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
11 | హైదరాబాద్ శుక్రవారం 20 । జూన్ । 2025

# ఒడిదుడుకుల్లో దేశీయ సూచీలు.. టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే..



**ముంబై-నవభూమి:** అంతర్జాతీయంగా అనిశ్చితి వాతావరణం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యాధాతథంగా కొనసాగించడంతో మార్కెట్లు ఊగిసలాట ధోరణిని కనబరుస్తున్నాయి. మెటల్, ఆటో, పవర్ సెక్టార్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. దీంతో మార్కెట్ నష్టాలతో రోజును ప్రారంభించింది. అయితే ప్రస్తుతం ఆరంభ నష్టాల నుంచి సూచీలు గట్టెక్కాయి. భౌగోళిక కారణాలతో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తుండడంతో సూచీలు లాభనష్టాలతో దోబూచులాడుతున్నాయి. ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప లాభాల్లో కొనసాగుతున్నాయి.బుధవారం ముగింపు (81, 444)తో పోల్చుకుంటే గురువారం ఉదయం ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత వెంటనే నష్టాల్లోకి కూరుకుపోయింది. ఒక దశలో 200 పాయింట్లకు పైగా కోల్పోయి 81, 191 వద్ద కనిష్టాన్ని తాకింది. అయితే ప్రస్తుతం మళ్లీ లాభాల్లోకి వచ్చింది. ప్రస్తుతం ఉదయం 10 గంటల సమయంలో సెన్సెక్స్ 29 పాయింట్ల లాభంతో 81, 474 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 8 పాయింట్ల లాభంతో 24, 820 వద్ద కొనసాగుతోంది.సెన్సెక్స్‌లో ఇండస్ ఇండ్ బ్యాంక్, అవెన్యూ సూపర్‌మార్కెట్, ఆర్బీఎల్ బ్యాంక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, సీసీఎల్ ప్రోడక్ట్స్ ఇండియా షేర్లు లాభాల్లో ఉన్నాయి. హిందుస్థాన్ జింక్, మ్యాక్స్ హెల్త్‌కేర్, ఎస్బీఐ కార్డు, బ్లూ స్టార్ షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 322 పాయింట్ల నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 29 పాయింట్ల నష్టంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 86.54గా ఉంది.

## స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు.. బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:** భౌగోళికంగా ఉద్రిక్త పరిస్థితుల కారణంగా బంగారం ధరలు ఆల్‌టైమ్ గరిష్టానికి చేరువలో ట్రేడ్ అవుతున్నాయి. నిన్నటితో పోల్చుకుంటే ఈ రోజు బంగారం ధరల్లో స్వల్ప పెరుగుదల నమోదైంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (జూన్ 19న) ఉదయం 6.00 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 1, 00, 920కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 92, 500కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే బంగారం ధర ఈ రోజు దాదాపు రూ.600 పెరిగిందిఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 01, 070కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 92, 660కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 00, 920కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 92, 500కి చేరింది. వెండి ధరలు కేజీకి రూ100 మేర పెరిగాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్)

హైదరాబాద్‌లో రూ. 1, 00, 920, రూ. 92, 500
విజయవాడలో రూ. 1, 00, 920, రూ. 92, 500
ఢిల్లీలో రూ. 1, 01, 070, రూ. 92, 660
ముంబైలో రూ. 1, 00, 920, రూ. 92, 500
వడోదరలో రూ. 1, 00, 970, రూ. 92, 560
కోల్‌కతాలో రూ. 1, 00, 920, రూ. 92, 500
చెన్నైలో రూ. 1, 00, 920, రూ. 92, 500
బెంగళూరులో రూ. 1, 00, 920, రూ. 92, 500
కేరళలో రూ. 1, 00, 920, రూ. 92, 500
పుణెలో రూ. 1, 00, 920, రూ. 92, 500

ప్రధాన నగరాల్లో వెండి ధరలు (కేజీకి)

హైదరాబాద్‌లో రూ. 1, 21, 100
విజయవాడలో రూ. 1, 21, 100
ఢిల్లీలో రూ. 1, 11, 100
చెన్నైలో రూ. 1, 21, 100
కోల్‌కతాలో రూ. 1, 21, 100
కేరళలో రూ. 1, 21, 100
ముంబైలో 1, 11, 100
బెంగళూరులో రూ.1, 11, 100
వడోదరలో రూ. 1, 11, 100
అహ్మదాబాద్‌లో రూ. 1, 11, 100


## విప్రో ఇన్‌ఫ్రా ఇంజనీరింగ్‌కు ఫ్రెంచ్ కంపెనీలో మెజారిటీ వాటా



**న్యూఢిల్లీ-నవభూమి:** ఫ్రాన్స్‌కు చెందిన విమానాల విడిభాగాల తయారీదారు లౌక్ గ్రూప్‌లో మెజారిటీ వాటా కొనుగోలు చేస్తున్నట్లు ఇంజనీరింగ్ అండ్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ విప్రో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్ (డబ్ల్యూఐఎన్) బుధవారం తెలిపింది. ప్రస్తుతం ప్యారిసలో జరుగుతున్న ఎయిర్‌షోలో ఇరువర్గాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. అయి తే, ఎంత వాటా, ఎంతకు కొనుగోలు చేస్తున్న వివరాలను మాత్రం డబ్ల్యూఐఎన్ వెల్లడించలేదు. మరికొద్ది నెలల్లో ఈ కొనుగోలు ఒప్పందం పూర్తి కావచ్చని అంచనా. ఈ డీల్ పూర్తయ్యాక కంపెనీ పేరును విప్రో లౌక్‌గా మార్చనున్నారు. 50 ఏళ్ల నాటి కుటుంబ యాజమాన్య సంస్థ అయిన లౌక్ గ్రూప్.. పలు అంతర్జాతీయ ఏరోస్పేస్ కంపెనీలకు విమానాల విడిభాగాలను సరఫరా చేస్తోంది.

హైదరాబాద్‌కు చెందిన రఘు వంశీ ఏరోస్పేస్ గ్రూప్ ప్రస్తుతం పారిసలో జరుగుతున్న 55వ అంతర్జాతీయ ఎయిర్ షోలో తన ఆధునిక ఢిఫెన్స్ అండ్ ప్రొపల్షన్ టెక్నాలజీలను ప్రదర్శించింది. దేశీయంగా తయారు చేసిన మైక్రో టర్బోజెట్ ఇంజన్ల నుంచి హై పెర్‌ఫార్మెన్స్ కామికేజ్ డ్రోన్లను ప్రదర్శనలో ఉంచినట్లు కంపెనీ తెలిపింది.

## మేక్‌మై ట్రిప్‌లో తగ్గనున్న చైనా వాటా




**న్యూఢిల్లీ-నవభూమి:** చైనా కంపెనీల ఈక్విటీలో వాటా కుదించుకుంటున్న భారత కంపెనీ ల జాబితాలో ట్రావెల్ బుకింగ్ కంపెనీ మేక్‌మై ట్రిప్ కంపెనీ చేరింది. ఈ కంపెనీ ఈక్విటీలో ప్రస్తుతం చైనా కంపెనీ ట్రిప్.కామ్‌కు 45.34 శాతం వాటా ఉంది. ఈ వాటాను 19.99 శాతానికి కుదించేందుకు మేక్‌మై ట్రిప్ సిద్ధమైంది. ఇందుకోసం చైనా కంపెనీకి ఉన్న వాటా నుంచి 25.35 శాతం వాటాను కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. షేర్లుగా మార్చుకోదగిన రుణ పత్రాలు, షేర్ల విక్రయం ద్వారా ఇందుకు అవసరమైన 250 కోట్ల డాలర్లు (సుమారు రూ.21,617 కోట్లు) సమీకరించాలని కంపెనీ నిర్ణయించింది.

# విడిగా విక్రయించే టీలో కల్తీ సూచికలు



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మందికి రోజువారీ జీవితంలో ముఖ్యమైన పానీయంగా టీ నిలువడం మాత్రమే కాదు , ప్రతి రోజా దాని ప్రాముఖ్యత పెరుగుతుంది. ఇటీవలి సంవత్సరాలలో ప్రపంచ వ్యాప్తంగా టీ ఉత్పత్తి 5.8 మిలియన్ టన్నులను అధిగమించడంతో, టీ పరిశ్రమ వేగంగా విస్తరించింది. భారతదేశంలో, ఎక్కువ మంది ఇష్టపడే ఒక ప్రియమైన పానీయంగా టీ మిగిలిపోయింది, ఇక్కడ వినియోగం క్రమంగా పెరుగుతోంది. 2022 సంవత్సరంలోనే, భారతదేశం దాదాపు 1.2 బిలియన్ కిలోగ్రాముల టీని వినియోగించింది, ఇది దాని సాంస్కృతిక సామాజిక ప్రాముఖ్యతకు నిదర్శనం. అయినప్పటికీ, టీకి పెరుగుతున్న డిమాండ్ తో టీ లో కల్తీ పెరుగుదలకు కూడా దారితీసింది, టీ తయారీలో ఇక్కడ ఖర్చులను తగ్గించుకోవడానికి లాభాలను పెంచుకోవడానికి వినియోగించ కూడని పదార్థాలను టీలో కలుపుతున్నారు. ఈ కథనంలో విడిగా విక్రయించే టీ లో కల్తీ యొక్క సూచికలను అన్వేషిస్తుంది వినియోగదారులకు అటువంటి ఉత్పత్తులను గుర్తించడానికి నివారించడానికి ఆచరణాత్మక పద్ధతులను అందిస్తుంది. ఆర్థిక ప్రపంచీకరణ పురోగమిస్తున్న కొద్దీ, టీ భద్రత ఆందోళనకర అంశంగా పరిణమిస్తుంది, ప్రత్యేకించి బ్రాండెడ్ రకాలు కంటే విడిగా విక్రయించే టీలో కల్తీ చాలా సర్వ సాధారణంగా మారింది. స్వచ్ఛమైన, కల్తీ లేని టీని నిర్ధారించడం అనేది వినియోగదారుల హక్కు. రిటైలర్లు వినియోగదారుల మధ్య నమ్మకాన్ని పెంపొందించడం ఇప్పుడు చాలా అవసరం.

**టీ కల్తీని అర్థం చేసుకోవడం**

ఆకృతిని ఆకర్షణీయంగా మార్చటం, బరువును పెంచడానికి లేదా రుచిని మార్చడానికి టీ ఆకులలో నాసిరకం పదార్థాలను కలపడం ద్వారా టీ కల్తీ జరుగుతుంది. ఈ కలుషితాలు హానిచేయని ఫిల్లర్‌ల నుండి ప్రమాదకరమైన రసాయనాల వరకు ఉంటాయి, చౌకైన ఉత్పత్తులనే అధికంగా వీటిలో వినియోగించటం జరుగుతుంది. ఈ అభ్యాసం తరచుగా సరఫరాదారులు నాణ్యతపై రాజీ పడేలా చేస్తుంది. కల్తీ టీని తీసుకోవడం వల్ల తేలికపాటి జీర్ణ సమస్యల నుండి తీవ్రమైన దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యల వరకు ప్రమాదాలు ఎదురవుతాయి.

విడిగా విక్రయించే టీలో సాధారణ కల్తీలను అర్థం చేసుకోవటం...

**1. అసహజ కలరింగ్ ఏజెంట్లు:** టీ ఆకులను తాజాగా మరింత ఆకర్షణీయంగా కనిపించేలా చేయడానికి, కొంతమంది సరఫరాదారులు సింథటిక్ రంగులను ఉపయోగిస్తారు, ఇవి తరచుగా విషపూరితమైనవి మాత్రమే కాదు కాలక్రమేణా ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి.

**2.వాడిన టీ ఆకులు:** వాడిన టీ ఆకులను తాజా వాటితో కలపడం ఒక సాధారణ పద్ధతి. ఈ మళ్లీ ఎండబెట్టిన ఆకులు పరిమాణాన్ని పెంచుతాయి కానీ టీ నాణ్యత , రుచిని గణనీయంగా తగ్గిస్తాయి.

**3.హానికరమైన రసాయనాలు:** కొంతమంది టీ ఉత్పత్తిదారులు టీ రూపాన్ని మెరుగుపరచడానికి లెడ్ క్రోమేట్ లేదా కాపర్ సాల్ట్స్ వంటి రసాయనాలను జోడిస్తారు. ఈ పదార్థాలు అత్యంత ప్రమాదకరమైనవి విషప్రయోగ పరాభవాలతో సహా తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారి తీయవచ్చు.

**4.పూరక పదార్థాలు:** తక్కువ-నాణ్యత గల టీ తరచుగా కొమ్మలు, ఇసుక లేదా స్టార్చ్ వంటి పూరక పదార్థాలను కలిగి ఉంటుంది. ఇవి బరువును పెంచడానికి జోడించబడతాయి, అయితే టీ మొత్తం నాణ్యత రుచిని తగ్గిస్తాయి.

విడిగా విక్రయించే టీ లో కల్తీని గుర్తించడం

కల్తీని గుర్తించడం సవాలుతో కూడిన అంశమే అయినప్పటికీ, వినియోగదారులు స్వచ్ఛమైన, అధిక-నాణ్యత గల టీని కొనుగోలు చేస్తున్నారని నిర్ధారించుకోవడానికి అనేక సూచికలు సహాయపడతాయి:

**1.రంగును పరీక్షించండి :** కల్తీ లేని టీ ఆకులు సహజమైన, మట్టి రంగును కలిగి ఉండాలి. ఆకులు చాలా ప్రకాశవంతంగా లేదా అసహజంగా ఆకుపచ్చగా కనిపిస్తే, అది నకిలీ రంగును సూచిస్తుంది. కాచినప్పుడు, టీ ఎటువంటి మలినాలు లేకుండా స్పష్టమైన, ప్రకాశవంతమైన పానీయంను ఉత్పత్తి చేయాలి.

**2.ఇతర పదార్థాల కోసం చూడండి :** టీ ఆకులు కొమ్మలు, రాళ్ళు లేదా ఇతర కలుషితాలు వంటి అదనపు పదార్థాల నుండి విముక్తి పొందాలి.

**3.ఆకృతిని పరిశీలించండి:** ప్రామాణికమైన టీ ఆకులు స్థిరమైన ఆకృతిని పరిమాణాన్ని కలిగి ఉంటాయి. మీరు అధికంగా ధూళి, విరిగిన ఆకులు లేదా అసమాన టెక్చర్స్ ను గమనించినట్లయితే, టీ ఫిల్లర్‌లతో కల్తీ కావచ్చు. నాణ్యమైన వదులుగా ఉండే టీ కొద్దిగా ముతకగా దృఢంగా వుంటుంది , పొడిగా లేదా అతిగా మెత్తగా ఉండకూడదు.

**4. నీటి పరీక్షను నిర్వహించండి:** ఒక గ్లాసు చల్లటి నీటిలో కొద్ది మొత్తంలో టీ ఉంచండి. నీరు తక్షణమే రంగు మారినట్లయితే, టీలో సింథటిక్ రంగులు ఉండవచ్చు.

**5.రుచి వాసన:** మీ ఇంద్రియాలను విశ్వసించండి. అధిక-నాణ్యత కలిగిన టీ ఒక ప్రత్యేకమైన, తాజా వాసన సమతుల్య రుచి ప్రొఫైల్‌ను కలిగి ఉంటుంది. ఒకవేళ టీ అసాధారణమైన రీతిలో చేదుగా ఉంటే, వాసన లేకుంటే లేదా అసహజమైన రుచిని కలిగి ఉంటే, అది కల్తీ కావచ్చు. ఒక మంచి టీ గంభీరమైన, పూర్తి ఆహ్లాదకరమైన రుచిని కలిగి ఉంటుంది, అది నోటికి ఆహ్లాదకరంగా ఉంటుంది.

**6. తాజాదనాన్ని తనిఖీ చేయండి:** కల్తీ లేని టీ ఆకులు వాటి రకానికి తగినట్లుగా ప్రత్యేకమైన సహజమైన, సుగంధ పరిమళాన్ని వెదజల్లాలి. నిల్వ లేదా మురికి వాసన పేలవమైన నాణ్యత లేదా సరికాని నిల్వను సూచిస్తుంది.

**7. మలినాల కోసం పరీక్షించండి:** బ్రూవింగ్ తర్వాత, మిగిలి ఉన్న అవశేషాలను పరిశీలించండి. టీ ఆకులు రంగు అవశేషాలను వదిలివేస్తే లేదా నీరు మబ్బుగా కనిపించినట్లయితే, ఇది హానికరమైన రసాయనాలు లేదా రంగుల ఉనికిని సూచిస్తుంది.

వృత్తిపరంగా శిక్షణ పొందిన టీ టెస్టర్లు టీలో ఉన్న అస్థిర కర్బన సమ్మేళనాలను విశ్లేషించడం ద్వారా టీలో కల్తీ జరిగిందో లేదో కనుగొనగలుగుతారు. ఈ సమ్మేళనాలు తరచుగా గ్యాస్ క్రోమాటోగ్రఫీ-ఓల్ఫాక్టోమెట్రీ (కాంగ్ ఎట్ ఆల్ , 2019), గ్యాస్ క్రోమాటోగ్రఫీ-మాస్ స్పెక్ట్రోమెట్రీ (టోర్రెస్, అల్మిరాల్, 2022) గ్యాస్ క్రోమాటోగ్రఫీ-అయాన్ మొబిలిటీ స్పెక్ట్రోమెట్రీ (లియు ఎట్ ఆల్ ., 2021) ద్వారా కనుగొంటారు. ఈ పరిశోధన వైద్య రంగం నుండి ప్రేరణ పొందింది, ఇక్కడ వ్యాధి నిర్ధారణ ఆరోగ్య పర్యవేక్షణలో ఉపయోగించే బయోమార్కర్ల కోసం ఉచ్ఛ్వాస గాలి విశ్లేషించబడుతుంది.

చివరగా ... రుచి, రంగు లేదా టీ రుచిని మెరుగుపరచడానికి ఏవైనా కల్తీలను జోడించడాన్ని టీ బోర్డ్ గట్టిగా వ్యతిరేకిస్తుంది, మానవ ఆరోగ్యంపై ఈ పదార్థాల ప్రభావాన్ని అంచనా వేయడానికి మరింతగా అధ్యయనాలు చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతుంది. నాణ్యత భద్రతను నిర్వహించడానికి టీ స్వచ్ఛతను నిర్ధారించడం చాలా ముఖ్యం. దృశ్య తనిఖీ, వాసన, రుచి పరీక్షలు ద్రావణీయత తనిఖీలను చేయటం ద్వారా గుర్తింపు పొందిన మూలాల నుండి కొనుగోలు చేయడం ద్వారా, వినియోగదారులు సురక్షితమైన రుచిగల టీ పానీయాలను ఆస్వాదించవచ్చు.

# వెండి సరికొత్త రికార్డు




**న్యూఢిల్లీ-నవభూమి:** వెండి సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయికి ఎగబాకింది. హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి రేటు బుధవారం రూ.1,000 పెరిగి రూ.1.21 లక్షలకు చేరిం ది. వెండి ధర పెరగడం వరుసగా ఇది మూడో రోజు. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో (ఎంసీఎక్స్) కూడా వెండి ఫ్యూచ ర్స్ కాంట్రాక్టు ధరలు ఆల్‌టైం రికార్డు స్థాయిని తాకాయి. జూలై గడువు కాంట్రాక్టు ధర రూ.1,09,748కి, సెప్టెంబరు గడు వు కాంట్రాక్టు రేటు రూ.1.11 లక్షలకు ఎగబాకింది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో ఇన్వెస్టర్లు అనిశ్చితుల్లో భద్రమైన పెట్టుబడి సాధనంగా పేరున్న విలువైన లోహాలపైకి దృష్టి మళ్లించారు. అయితే, బంగారం ధరలు ఇప్పటికే రికార్డు స్థాయిల్లో కొనసాగుతుండటంతో వెండిలో పెట్టుబడులకు ఇన్వెస్టర్లు ఎక్కువగా మొగ్గుచూపుతున్నట్లు విశ్లేషకులు తెలిపారు. అలాగే, పారిశ్రామిక అవసరాలకు తగినంత స్థాయిలో సరఫరా లేకపోవడం కూడా వెండి ధర లు ఎగబాకడానికి మరో కారణం. దాంతో అంతర్జాతీయ విపణిలో ఔన్స్ (31.10 గ్రాములు) వెండి రేటు ఒక దశలో 37.23 డాలర్లకు చేరింది. 2012 ఫిబ్రవరి తర్వాత వెండికిదే గరిష్ఠ స్థాయి. దశాబ్దానికి పైగా కాలంలో ఔన్స్ సిల్వర్ 37 డాలర్లు దాటడం ఇదే మొదటిసారి.

2025 జనవరి 1న హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి ధర రూ.98,000గా ఉంది. అంటే, ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రేటు రూ.23,000 పెరిగింది. మున్ముందు మరింత ఎగబాకే అవకాశం ఉందని బులియన్ విశ్లేషకులు భావిస్తున్నారు. అంతర్జాతీయ విపణిలో ఔన్స్ వెండి 36.89 డాలర్ల వద్ద కీలక నిరోధ స్థాయిని అధిగమించడమే ఇందుకు కార ణం. తదుపరి దశలో 40 డాలర్ల దిశగా పరుగు తీయవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే, 38.34 డాలర్ల స్థాయిలో గట్టి నిరోధం ఎదురుకావచ్చని వారు భావిస్తున్నారు.

**రూ.లక్షపైన బంగారం**

మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర 10 గ్రాములకు రూ.540 పెరుగుదలతో రూ.1,00,910కి చేరింది. 22 క్యారెట్ల లోహం రేటు రూ.500 పెరుగుదలతో రూ.92,500కు ఎగబాకింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ఒకదశలో 3,400 డాలర్ల ఎగువన ట్రేడైంది.

**భవిష్యత్‌లో రూ.2 లక్షలు?**

వెండి ధరలు భవిష్యత్‌లో రెట్టింపు కానున్నాయని, ఔన్స్ సిల్వర్ 70 డాలర్లకు చేరుకోవచ్చని రిచ్ డాడ్.. పూర్ డాడ్ పుస్తక రచయిత, ప్రముఖ ఇన్వెస్టర్ రాబర్ట్ కియోసాకీ అంచనా వేశారు.

అంతర్జాతీయంగా రాజకీయ భౌగోళిక అనిశ్చితులు పెరుగుతుండటంతోపాటు ఎలక్ట్రానిక్స్ రంగం శరవేగ వృద్ధి నేపథ్యంలో ఇండస్ట్రీ అవసరాలకు తగినంత వెండి సరఫరా జరగకపోవడం ఇందుకు కారణమన్నారు. రాబర్ట్ అంచనాలు నిజమైతే, దేశీయ మార్కెట్లో కిలో వెండి రూ.2 లక్షలు దాటుతుంది.

## ఎయిర్ ఇండియా కీలక ప్రకటన.. అంతర్జాతీయ విమాన సర్వీసుల్లో కోత



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ దిగ్గజ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా కీలక ప్రకటన చేసింది. తన అంతర్జాతీయ విమాన సేవలను తాత్కాలికంగా తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. వైడ్‌బాడీ విమాన కార్యకలాపాలను జులై మధ్య వరకూ తగ్గించనున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. సుమారు 15 శాతం మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించింది.వైడ్‌బాడీ బోయింగ్ 777 విమానాల్లో మరింతగా రక్షణ తనిఖీలు చేపట్టనున్నట్లు వెల్లడించింది. అనేక సంక్లిష్ట సవాళ్ల మధ్య మెరుగైన సామర్థ్యం, ప్రయాణికుల అసౌకర్యాన్ని తగ్గించడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు టాటా గ్రూప్ ఆధ్వర్యంలోని ఎయిర్ ఇండియా తన ప్రకటనలో స్పష్టం చేసింది. బోయింగ్ 777 విమానాల్లో చేపట్టే ఈ ప్రత్యేక తనిఖీల ద్వారా ప్రయాణ భద్రతను మరింత పటిష్టం చేయడమే తమ లక్ష్యమని ఎయిర్ ఇండియా అధికారులు తెలిపారు.టాటా గ్రూప్ ఆధ్వర్యంలోని ఎయిర్ ఇండియా ) సమస్యల వలయంలో చిక్కుకొన్నది. మొన్న జరిగిన విమాన ప్రమాదం ఘటన మరవకముందే ఈ సంస్థకు చెందిన పలు విమానాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటం చర్చనీయాంశంగా మారింది. దీంతో సంస్థ ఎయిర్ ఇండియా విమానాల్లో రక్షణ తనిఖీలు చేపడుతోంది. ఈ క్రమంలో నిర్వహణపరమైన ఇబ్బందులతో గడిచిన ఆరు రోజుల్లో సంస్థకు చెందిన దాదాపు 83 అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దయినట్లు సమాచారం.

## మైక్రోసాఫ్ట్‌లో మరో రౌండ్ లేఆఫ్స్.. వేలాది మందిపై ప్రభావం..!

**న్యూఢిల్లీ-నవభూమి:** ఆర్థిక అస్థిరత, పెరుగుతున్న కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం వల్ల టెక్ ఇండస్ట్రీలో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ లాంటి దిగ్గజ కంపెనీలు వందల మంది ఉద్యోగులను ఇంటికి పంపాయి. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు 130 కంపెనీలు కలిసి 61 వేల మంది ఉద్యోగులను తొలగించాయి.ఇక ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఇప్పటికే వేలాది మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. తాజాగా మరో రౌండ్ లేఆఫ్స్‌కు సిద్ధమైనట్లు తెలుస్తోంది. 2025 ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో మైక్రోసాఫ్ట్ మరోసారి ఉద్యోగుల కోతకు సిద్ధమైనట్లు బ్లూమ్‌బర్గ్ నివేదించింది. కంపెనీ పునర్నిర్మాణంలో భాగంగా వేలాది మందిపై వేటు వేయనున్నట్లు తెలిపింది. తాజా రౌండ్ సేల్స్ విభాగంలో ఉండనున్నట్లు సంస్థ అధికారులను ఊటంకిస్తూ బ్లూమ్‌బర్గ్ వెల్లడించింది. అయితే, ఈ లేఆఫ్స్‌పై మైక్రోసాఫ్ట్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు.కాగా, మైక్రోసాఫ్ట్ ఈ ఏడాది మే నెల మధ్యలో వేలాది మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. తమ సిబ్బందిలో మూడు శాతం మందికి లేఆఫ్‌లు ఇచ్చింది. అంటే దాదాపు 6వేల మందిని తొలగించింది. 2023లో 10 వేలమందికి ఉద్వాసన పలికిన అనంతరం ఇదే రెండో అతిపెద్ద తొలగింపు. మేనేజ్‌మెంట్ స్థాయిలను తగ్గించడం, సంస్థ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడమే ముఖ్య లక్ష్యమని సంస్థ ప్రతినిధి ఒకరు చెప్పారు. ఇక ఈ ఏడాది జనవరిలో కూడా పనితీరు ఆధారంగా కొంతమందిని సంస్థ తొలగించిన విషయం తెలిసిందే. ఈనెల ఆరంభంలో కూడా పలువురిపై సంస్థ వేటు వేసింది. డైనమిక్ మార్కెట్‌లో పోటీదారుగా నిలవడానికి, కంపెనీ పునర్ నిర్మాణ లక్ష్యాన్ని చేరుకోవడానికి కోతలు తప్పడం లేదని మైక్రోసాఫ్ట్ పేర్కొంది. 'మార్కెట్‌లో పైచేయి సాధించేలా సంస్థను ఉత్తమంగా ఉంచేందుకు అవసరమైన సంస్థాగత మార్పులను అమలు చేస్తూన్నాం' అని మైక్రోసాఫ్ట్ తెలిపింది.

# ఎకానమీపై వార్ ఎఫెక్ట్.. సంక్షోభంలోకి దేశ ఆర్థిక వ్యవస్థ



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచానికి చమురే చోదకశక్తి. ఆ చమురు సరఫరా అత్యధికంగా గల్ఫ్ దేశాల నుంచే జరుగుతుండగా, ఇందులో ఎక్కువగా హోర్ముజ్ జలసంధి మీదుగానే రవాణా అవుతున్నది. సరిగ్గా ఇదే.. ఇప్పుడు ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధాన్ని ప్రపంచ దేశాలు కలవరపడేలా చేస్తున్నది. అవును.. ఇజ్రాయెల్‌తో యుద్ధం తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేయవచ్చన్న ఆందోళనలు పెరుగుతున్నాయి మరి. ఇరాన్ తీర ప్రాంతం పొడుగూత ఆనుకుని ఉన్న ఈ 33 కిలోమీటర్ల సముద్ర మార్గం మూతబడితే భారత్‌సహా ఆసియా దేశాలకు చమురు కష్టాలు తప్పవన్నది నిజంగా నిజం.ఇదీ సంగతి..ఇరాన్ అణు కార్యకలాపాలు తమకు ముప్పేనని భావిస్తున్న ఇజ్రాయెల్.. ఆ దేశంపై దాడులు మొదలు పెట్టింది. ఇరాన్ ప్రతిదాడులతో ఈ రెండు దేశాల మధ్య యుద్ధం తీవ్రరూపం దాల్చగా.. ఇప్పుడిది యావత్తు ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్నే కుదిపేస్తున్నది. ఇరాక్, సౌదీ అరేబియా, కువైట్, బహ్రెయిన్, కతార్, యూఏఈ, ఒమన్ దేశాల నుంచి ముడి చమురు దిగుమతి చేసుకుంటున్న ఎన్నో దేశాల్లో గుబులు మొదలవుతున్నది. ఈ దేశాలన్నిటి సరిహద్దులు, ఇరాన్ దేశ సరిహద్దు మధ్య ఉన్న హోర్ముజ్ జలసంధి మీదుగానే ఆయా దేశాలకు నిత్యం ముడి చమురు, ద్రవరూప సహజ వాయువు (ఎల్ఎన్‌జీ) ఎగుమతులు జరుగుతూ ఉన్నాయి. అయితే ఇజ్రాయెల్ దాడుల దృష్ట్యా ఇరాన్ ఈ జలసంధిని మూసేయాలని చూస్తున్నట్టు సమాచారం. దీన్ని ఆ దేశ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) సీనియర్ కమాండర్ సర్దార్ ఇస్మాయిల్ కోసారి సైతం ధ్రువీకరిస్తుండటం గమనార్హం.భారత్‌కు దెబ్బ.. దేశ చమురు అవసరాలకు దిగుమతులే ఆధారం. ఆ దిగుమతుల్లో సగానికిపైగా సౌదీ తదితర గల్ఫ్ దేశాలే దిక్కు. ఇవన్నీ కూడా హోర్ముజ్ జలసంధి ద్వారానే భారత్‌కు చేరుతున్నాయి. ప్రపంచ ముడి చమురు సరఫరాలో గల్ఫ్ దేశాల వాటా సుమారు 25 శాతంగా ఉన్నది. రోజూ 20 మిలియన్లకుపైగా బ్యారెళ్ల క్రూడాయిల్, 25% ఎల్ఎన్‌జీ హోర్ముజ్ గుండా సరఫరా అవుతున్నది. అయితే ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ఈ మార్గంలో రవాణాకు ఆటంకాలు ఏర్పడితే వేల కిలోమీటర్లు తిరిగి చమురును దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. దీనివల్ల దేశీయ మార్కెట్‌లో చమురు ధరలు భగ్గుమంటాయని, తయారీ ఖర్చులు పెరిగి ద్రవ్యోల్బణం విజృంభిస్తుందని మెజారిటీ ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏ ద్రవ్యోల్బణమైతే తగ్గిందని, ఆర్బీఐ వృద్ధిరేటుపై దృష్టిపెట్టి వడ్డీరేట్లను తగ్గిస్తూపోతున్నదో.. మళ్లీ అదే వడ్డీరేట్లను పెంచేస్తుందని, దీనివల్ల రుణాలు ప్రియమై అన్ని రంగాలు కుదేలవుతాయన్న ఆందోళనల్నీ వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో భారత జీడీపీ ప్రగతి.. ఈ యుద్ధంపైనే ఆధారపడి ఉందంటున్నవారూ లేకపోలేదంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. నిజానికి ఈ సమస్య భారత్‌లోనేగాక, ఎన్నో ఆసియా, ఐరోపా దేశాల్లోనూ తలెత్తుతుంది.2022లో హోర్ముజ్ జలసంధి ద్వారా రవాణా అయిన ముడి చమురు, ఎల్ఎన్‌జీ ఎగుమతుల్లో 82% ఆసియా దేశాలకు వచ్చినవే. 2022, 2023 జనవరి-జూన్‌లో జరిగిన ఎగుమతుల్లో భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియాల వాటానే 67%. భారత్ ముడి చమురు అవసరాల్లో దాదాపు 90% దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. ఇందులో 40 శాతానికిపైగా హోర్ముజ్ జలసంధి మీదుగా మిడిల్ ఈస్ట్ దేశాల నుంచే వస్తున్నాయి.కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం దేశంలో ప్రస్తుతం సుమారు 74 రోజులకు సరిపడా చమురు నిల్వలున్నాయి.



ధనుష్, రశ్మిక మందణ్ణ, నాగార్జున కీలక పాత్రలు పోషించిన సినిమా 'కుబేర'. ఈ నెల 20న

## 'కుబేర'.. టచ్ చేసే పాట

మూవీ ప్రపంచవ్యాప్తంగా ఐదు భాషల్లో విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాలోని నాలుగో పాటను మేకర్స్ బుధవారం రాత్రి విడుదల చేశారు. బిచ్చగాడైన తన కొడుకుకు బాగు కోరుతూ ఓ తల్లి పాడే పాట ఇది. దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు సమకూర్చిన ఈ పాటను నందకిశోర్ రాయగా, సింధూరి విశాల్ పాడింది. నేపథ్య గీతంగా వచ్చే ఈ పాటను మూవీలోని కొన్ని సన్నివేశాలపై వీడియోగా కట్ చేసి మేకర్స్ రిలీజ్ చేశారు. హృదయానికి హత్తుకునేలా ఈ పాట ఉంది. ధనుష్ కు ఈ సినిమాతో మరోసారి జాతీయ అవార్డు వస్తుందనే ఆశాభావాన్ని దర్శకుడు శేఖర్ కమ్ముల ఎందుకు వ్యక్తం చేశాడో ఈ పాటలోని విజువల్స్ చూస్తే అర్థమౌతుంది. బిచ్చగాడిగా అత్యంత సహజమైన ఆహార్యంలో ధనుష్ కనిపించడం విశేషం.



## తప్పు ఎక్కడ జరిగింది శ్రీనిధి...?



కన్నడ ముద్దుగుమ్మ శ్రీనిధి శెట్టి ఇండస్ట్రీలో ఎంట్రీ ఇవ్వడంతోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంది. 2016 లో మిస్ సుప్రానేషనల్ కిరీటాన్ని గెలుచుకోవడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ సమయంలోనే ఈ అమ్మడికి కన్నడ సినిమా ఇండస్ట్రీ నుంచి ఆఫర్లు వచ్చాయి. చిన్న ఆఫర్లను సున్నితంగా తిరస్కరించి యశ్‌కి జోడీగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందిన 'కేజీఎఫ్' సినిమాలో నటించింది. కేజీఎఫ్ మొదటి పార్ట్‌లో శ్రీనిధి శెట్టి పాత్ర పెద్దగా లేదు. అయినా కూడా ముద్దుగుమ్మకు మంచి ఆఫర్లు వచ్చాయి. కానీ కేజీఎఫ్ 2 విడుదల అయిన తర్వాతే తాను కొత్త సినిమాలకు కమిట్ అవుతాను అంటూ భీష్మించుకు కూర్చుకుంది. దాంతో చాలా కన్నడ సినిమా ఆఫర్లతో పాటు ఇతర భాషల సినిమా ఆఫర్లు కూడా చేజార్చుకుంది. కేజీఎఫ్ 2లో కూడా శ్రీనిధి శెట్టి పాత్ర అంతంత మాత్రమే. అయినా కూడా ఆ సినిమా దక్కించుకున్న విజయం నేపథ్యంలో పాన్ ఇండియా రేంజ్‌లో శ్రీనిధి శెట్టికి మంచి గుర్తింపు దక్కింది. దాంతో ఆఫర్లు కూడా పెద్ద ఎత్తున వచ్చాయి. కానీ ఈమె పాత్రల ఎంపిక విషయంలో అతి జాగ్రత్త వహించినట్లు తెలుస్తోంది. కేజీఎఫ్ 2 సినిమా సమయంలోనే తమిల స్టార్ హీరో విక్రమ్‌తో కలిసి కోబ్రా సినిమాలో నటించింది. ఆ సినిమా డిజాస్టర్‌గా నిలిచింది, దాంతో ఆ సినిమాను కనీసం చెప్పుకునే పరిస్థితి శ్రీనిధి శెట్టికి లేదు. కేజీఎఫ్ సమయంలో వరుసగా ఆఫర్లు వచ్చినా పెద్దగా పట్టించుకోని శ్రీనిధి శెట్టి కోబ్రా తర్వాత ఆఫర్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చింది. లక్కీగా తెలుగులో ఈ అమ్మడికి రెండు ఆఫర్లు వచ్చాయి. నానికి జోడీగా హిట్ 3లో నటించే అవకాశం దక్కించుకున్న శ్రీనిధి శెట్టి ఆ తర్వాత సిద్దు జొన్నలగడ్డ సినిమా తెలుసు కదా లో ఇద్దరు హీరోయిన్స్‌లో ఒక హీరోయిన్‌గా నటించింది. హిట్ 3 మంచి విజయాన్ని సొంతం చేసుకున్నా కొన్ని కారణాల వల్ల ఆమెకు ఆశించిన స్థాయిలో రీచ్ రాలేదు. హిట్ 3 కారణంగా శ్రీనిధి శెట్టికి ఒక్కటంటే ఒక్క ఆఫర్ కూడా వచ్చిన దాఖలాలు లేవు అని ఇండస్ట్రీ వర్గాల టాక్. తెలుసు కదా సినిమాలో నటిస్తున్న కారణంగా అంచనాలు భారీగా పెట్టుకుంది. యూత్ ఆడియన్స్‌లో మంచి క్రేజ్ ఉన్న సిద్దు జొన్నలగడ్డ కచ్చితంగా ఈ సినిమాతో సాలిడ్ సక్సెస్‌ను అందుకుంటాడనే విశ్వాసం అందరిలోనూ వ్యక్తం అవుతుంది. అందుకే తెలుసు కదా విడుదల కోసం వెయిట్ చేస్తుంది.

## ప్రభాస్‌ను చూడగానే మొత్తం పోయింది : మాళవిక



ప్రభాస్‌కి పాన్ ఇండియా రేంజ్‌లో ఉన్న ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. బాహుబలి తర్వాత ప్రభాస్ రేంజ్ అమాంతం పెరిగింది. ప్రేక్షకులు మాత్రమే కాకుండా సెలబ్రిటీలు సైతం ప్రభాస్‌పై అభిమానం కనబర్చుతూ ఉంటారు. ప్రభాస్ ఈ మధ్య కాలంలో చేసిన సినిమాలు, చేస్తున్న సినిమాల కారణంగా ఆయనపై అభిమానం మరింతగా పెరుగుతుంది. హీరోయిన్స్ ఒక్క సినిమాలో అయినా ప్రభాస్‌తో నటించాలని కలలు కంటున్నారు. ఆ అవకాశం అతి కొద్ది మందికి మాత్రమే దక్కుతుంది. ప్రభాస్ ప్రస్తుతం 'రాజాసాబ్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఆ సినిమాలో ముగ్గురు ముద్దుగుమ్మలు నటించారు. అందులో ప్రధానంగా నిధి అగర్వాల్, మాళవిక మోహన్ కనిపించారు. టీజర్‌లో మాళవిక మోహనన్ పాత్ర ఆసక్తికరంగా ఉంది. సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి దశాబ్ద కాలం అయినప్పటికీ మాళవిక కొన్ని కారణాల వల్ల టాలీవుడ్ సినిమాల్లో నటించలేదు. అప్పట్లో ఒకటి రెండు చిన్నా చితకా ఆఫర్లు వచ్చినప్పటికీ సున్నితంగా తిరస్కరించినట్లు సమాచారం. ఎట్టకేలకు మాళవిక టాలీవుడ్‌లో 'రాజాసాబ్' సినిమాతో ఎంట్రీకి సిద్ధం అయింది. మొదటి సినిమాలోనే ప్రభాస్‌కు జోడీగా నటించడంతో టాలీవుడ్‌లో ఈ అమ్మడి ఫ్యూచర్ చాలా బ్రైట్‌గా ఉండబోతుందని సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో మాళవిక మోహనన్ కి ఉన్న ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ అమ్మడు రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తోంది. తాజాగా ఒక చిట్ చాట్‌లో ప్రభాస్‌తో వర్క్ ఎక్స్‌పీరియన్స్ గురించి చెప్పుకొచ్చింది. రాజాసాబ్ సినిమా కోసం దాదాపు మూడు ఏళ్లుగా ఈ అమ్మడు ఎదురు చూస్తుంది. మొదట్లో సినిమాలో హీరోయిన్‌గా ఎంపిక అయినప్పటికీ కండీషన్స్ కారణంగా చెప్పుకోలేదు. ఇప్పటికీ రాజాసాబ్‌లో తన పాత్ర గురించి బయటకు చెప్పకూడదని మారుతి కండీషన్ పెట్టినట్లు ఉన్నాడు. అందుకే సినిమా గురించి అడిగిన సమయంలో అద్భుతంగా ఉంటుంది అని తప్ప పెద్దగా స్పందించడం లేదు. తాజా చిట్ చాట్‌లో ప్రభాస్‌ను మొదటి సారి చూసిన సమయంలో తాను పొందిన అనుభూతిని గురించి చెప్పుకొచ్చింది. ప్రభాస్‌పై తనకు ఉన్న అభిమానం ఏంటి అనేది ఆమె మాటల్లో అర్థం అవుతుంది. మాళవిక మోహనన్ మొదటి రోజు షూటింగ్ సమయంలో ప్రభాస్‌ను అలాగే చూస్తూ ఉండి పోయిందట. ఇంకా మాళవిక మోహన్ మాట్లాడుతూ... రాజాసాబ్ సినిమా షూటింగ్ మొదటి రోజు చాలా స్పెషల్. ఆ రోజును ఎప్పటికీ మరచిపోను. ఆ సినిమా షూటింగ్‌కి ముందు తాను మరో షూటింగ్‌లో ఉన్నాను. వెంటనే షూటింగ్‌కు హాజరు కావాల్సి ఉండటంతో కనీసం విశ్రాంతి తీసుకోకుండా, కనీసం నిద్ర కూడా లేకుండా ప్రయాణం చేయాల్సి వచ్చింది. చాలా అలసటతో రాజాసాబ్ సెట్స్‌లో మొదటి రోజు అడుగు పెట్టాను. అప్పటికే అక్కడ ఉన్న ప్రభాస్‌ను చూడగానే నా అలసట మొత్తం పోయింది. ఆయనతో మాట్లాడటంతో ఎక్కడ లేని ఉత్సాహం నాలో కలిగింది. ఆయనతో కలిసి వర్క్ చేయడంను ఎప్పటికీ మరచిపోలేను. తప్పకుండా రాజాసాబ్ సినిమా ప్రతి ఒక్కరికీ నచ్చే విధంగా ఉంటుంది. ప్రభాస్‌తో నా సన్నివేశాలు వినోదాత్మకంగా ఉంటాయని మాళవిక మోహనన్ చెప్పుకొచ్చింది. డిసెంబర్‌లో విడుదల కాబోతున్న రాజాసాబ్ టీజర్ తాజాగా వచ్చింది. సంజయ్ దత్ ముఖ్య పాత్రలో కనిపించిన ఈ సినిమాలో ప్రభాస్ పాత్ర బుచ్చిగాడిని తలపిస్తుందనే విశ్వాసంను మేకర్స్‌తో పాటు, ఫ్యాన్స్ వ్యక్తం చేస్తున్నారు.

## వావ్.. ఇదేం సినిమా రా అనుకుంటారు



డైరెక్టర్ శేఖర్ కమ్ముల తెలుగు చిత్ర పరిశ్రమలో తన సినిమాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన దర్శకత్వంలో వస్తోన్న తాజా సినిమా కుబేర. ఈ సినిమా కోసం శేఖర్ కమ్ముల తన జానర్ ను మార్చి కొత్త జానర్ ను ట్రై చేశాడు. ధనుష్, నాగార్జున కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమా జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రానుండగా, ప్రమోషన్స్ లో భాగంగా శేఖర్ కమ్ముల పలు ఇంట్రెస్టింగ్ విషయాలను షేర్ చేసుకున్నారు.

**సినీ నిర్మాత అంత్యక్రియల ఆలస్యానికి కారణం?**

కుబేర కోసం కావాలని ప్లాన్ చేసి జానర్ ను మార్చడం లాంటిదేమీ జరగలేదని, రాసుకున్న కథకు తగ్గట్టుగా దాన్ని ఎలా తీస్తే బావుంటుందో అలా చేశానని, కుబేర సినిమా చూసినప్పుడు ఆడియన్స్ అందరూ వావ్.. ఇదేం సినిమారా అనుకుంటారని, కథలో భాగంగా కొన్ని పొలిటికల్ అంశాలు కూడా కనిపిస్తాయని, అలాగని మూవీ మొత్తం రాజకీయాలే ఉండవని అన్నారు. అందరూ పాన్ ఇండియా సినిమాలు చేయాలి కాబట్టి మనం కూడా చేసేయాలి అనుకుని కుబేరను పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కించలేదని, కుబేర స్టోరీ అన్ని వర్గాల ఆడియన్స్ కు కనెక్ట్ అయ్యే సబ్జెక్ట్ అని, ముంబైలో జరిగే ఈ కథ నార్త్ ఆడియన్స్ కు కూడా కనెక్ట్ అవుతుందని ఆయన చెప్పారు. ఈ సినిమాలో ధనుష్ పాత్రలో మరొకరిని ఊహించుకోలేమని, ఆయన ఇలాంటి కథను ఒప్పుకుని చేయడమే మెచ్చుకోవాల్సిన విషయమని, కుబేర కోసం ఆయన చాలా కష్టపడ్డాడని, ధనుష్ మాత్రమే ఇలాంటి క్యారెక్టర్ ను చేయగలరని సినిమా చూశాక అనిపిస్తుందని, ధనుష్ డైరెక్టర్ కూడా అవడంతో అతనికి నెరేషన్ ఇచ్చేటప్పుడు ఎంతో భయపడ్డానని శేఖర్ కమ్ముల తెలిపారు.

**ఎద్దీ సర్ ప్రైజ్: పవర్ఫుల్ బౌలర్ ఇతనే!**

స్టార్ కాస్టింగ్ తో సినిమా చేయడం వల్లే కుబేర సినిమా షూటింగ్ పూర్తవడానికి లేటైందని, పైగా ఎక్కువ షూటింగ్ ముంబైలోనే జరగడం కూడా సినిమా ఆలస్యానికి కారణమని, ఇక్కడ లాగా అక్కడ పర్మిషన్లు వెంటనే దొరకవని ఆయన అన్నారు. ఇప్పుడు స్టార్లతో సినిమా చేశానని, తర్వాతి సినిమాలు కూడా అలానే చేయాలనుకోవడం లేదని, పాన్ ఇండియా అనేది తనకు చాలా కష్టమని, అదే రూట్ లో కంటిన్యూ అవడం అనుకున్నంత ఈజీ కాదని అన్నారు. ఈ సందర్భంగా ఎంతో కాలంగా లీడర్2 పై వస్తున్న వార్తల గురించి కూడా ఆయన స్పందించారు.

## మాట తీసుకున్నాడు.. మరోసారి చేయబోతున్నాడట..

పవన్ కల్యాణ్ 'హరి హర వీరమల్లు' సినిమా చిత్రీకరణ పూర్తి చేశారు. 'ఓజీ'కీ కూడా కాల్షీటు ఇచ్చారు. త్వరలోనే ఆ చిత్రం కూడా పూర్తికానుందని మేకర్స్ వెల్లడించారు. ఇంకో వైపు హరీశ్ శంకర్ కూడా 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూటింగ్ షురూ చేశారు. ఈసినిమా సెట్‌లోనూ పవన్ పాల్గొంటున్నారు. అయితే తాజా సమాచారం ప్రకారం పవన్ కొత్త కథలు వింటున్నట్లు టాక్ నడుస్తోంది. ఆయనతో 'బ్రో' చిత్రం తీసిన తమిళ దర్శకుడు, నటుడు సముద్రఖని పవన్‌తో మరో సినిమా చేయాలనుందని ఎప్పటి నుంచో చెబుతున్నారు. అయితే ఇటీవల సముద్రఖని పవన్‌కు ఓ కథ చెప్పారట. ఇప్పటికే వీరిద్దరి కాంబోలో 'బ్రో' సినిమా వచ్చింది. పవన్ ఫ్యాన్స్‌ను మెప్పించిన



సినిమా అది. అప్పట్లోనే పవన్ సముద్రఖనితో ఓ సినిమా చేస్తానని మాటిచ్చారట. ఇప్పుడు అది పట్టాలెక్కబోతోందని తెలిసింది. పవన్‌కు ఇప్పటికే కొంతమంది నిర్మాతలు అడ్వాన్స్ ఇచ్చారు. ఆయన పార్టీ పనులతో బిజీ కావడం, సినిమాలకు కొంత గ్యాప్ ఇవ్వంతో కొందరికి అడ్వాన్స్‌లు తిరిగి ఇచ్చేశారు. అందులో కొంత మందికి ఇవ్వాల్సి ఉంది. వారిలో ఓ నిర్మాత కోసం ఇప్పుడీ సినిమా చేయబోతున్నారని ఫిల్మ్‌నగర్ టాక్. తక్కువ సమయంలో, లిమిటెడ్ బడ్జెట్ లో ఈ సినిమా ప్లాన్ చేశారట. ఇటీవల సముద్రఖని పవన్‌ని కలిసి కథ చెప్పేసినట్టు ఇన్ సైడ్ వర్గాల టాక్. ఉస్తాద్ భగత్ సింగ్ పూర్తయిన తర్వాత ఈ చిత్రం ఉండబోతోందని సమాచారం.

## సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీకి ఎప్పుడూ రుణపడి ఉంటాను : జెనీలియా

బొమ్మరిల్లు, సత్యం, హ్యాపీ, ఢీ, రెడీ, సై చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల మనసులు దోచుకున్న భామ జెనీలియా. తన నటనతో ఎన్నో అవార్డులతో పాటు తెలుగులో స్టార్ హీరోయిన్‌గా పేరు సంపాదించుకుంది. అయితే ఈ భామ బాలీవుడ్ నటుడు రితేష్ దేశ్‌ముఖ్‌ని ప్రేమ వివాహం చేసుకున్న అనంతరం చాలారోజులు సినిమాలకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. చాలారోజుల తర్వాత మళ్లీ రీఎంట్రీ ఇస్తుంది. ఆమిర్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం సితారే జమీన్ పర్. ఈ చిత్రంలో జెనీలియా కథానాయకగా నటిస్తుంది. ఈ చిత్రం జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇందులో వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నారు జెనీలియా. ఈ క్రమంలోనే ఒక యాంకర్ జెనీలియాని అడుగుతూ.. మీకు సౌత్ ఇండస్ట్రీలో మంచి సినిమాలు చెప్పుకోదగ్గ పాత్రలు అందలేదు కదా అని అడుగుతాడు. దీనికి జెనీలియా స్పందిస్తూ.. యాంకర్ మాటలను తప్పుబట్టింది. నాకు ఎప్పుడూ అలా జరుగలేదు. నా సౌత్ సినిమాలు చూసుకుంటే.. నాకు ఎప్పుడూ ఉత్తమ పాత్రలు వచ్చాయి. సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో నేను చేసిన పని నాకు చాలా గుర్తింపును తెచ్చిపెట్టింది. సౌత్ నా కెరీర్ ఎదిగిన స్థలం.. ఇక్కడ నాకు లభించిన పాత్రలను నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను అంటూ జెనీలియా చెప్పుకోచ్చింది.



## గిల్ సేన సాధించేనా
## రేపటి నుంచే ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్




**న్యూదిల్లీ-నవభూమి:** టెస్టుల్లో భారత్, ఇంగ్లండ్ పోరు దశాబ్దాలనాటిది. 1932 నుంచి ఇంగ్లండ్‌లో టీమిండియా పర్యటిస్తున్నా సిరీస్ గెలిచిన సందర్భం ఒక్కటే..! అంటే పర్యాటక జట్టుకు ఎంత కష్టమో రికార్డులను చూస్తేనే అర్థమవుతోంది. 2007లో రాహుల్ ద్రవిడ్ సారథ్యంలో మూడు టెస్టుల సిరీసను భారత్ 1-0తో దక్కించుకుంది. నాటింగ్‌హామ్‌లో జరిగిన రెండో టెస్టులో జహీర్ ఖాన్ నిప్పులు చెరగగా.. సచిన్, గంగూలీ, లక్ష్మణ్ బ్యాట్‌తో చెలరేగడంతో భారత్ 7 వికెట్ల తేడాతో నెగ్గింది. లార్డ్స్, ఓవల్‌లో జరిగిన మ్యాచ్‌లను టీమిండియా డ్రాగా ముగించింది. ఆ తర్వాత రోహిత్ శర్మ, కోహ్లి, అశ్విన్, బుమ్రాలతో భారత్ మేటి జట్టుగా ఎదిగినా.. ఇంగ్లండ్‌లో మాత్రం మరో సిరీసను సొంతం చేసుకోలేక పోయింది. 2021 పర్యటనలో భారత్ 2-1తో ఆధిక్యం సాధించినా.. కరోనా కారణంగా సిరీసలో నాలుగో, ఆఖరి టెస్టును 2022కు వాయిదా వేశారు. ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో భారత్ ఓడడంతో సిరీస్ 2-2తో సమమైంది. సంధి దశలోనే.. ఈసారి పర్యటనలో యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సారథ్యంలో భారత్ బరిలోకి దిగుతోంది. కోహ్లి, రోహిత్ రిటైర్మెంట్‌తో జట్టులో అనుభవలేమి కనిపిస్తోంది. అయితే, అరంగేట్రం బ్యాటర్ సాయి సుదర్శన్, యశస్వి జైస్వాల్, రాహుల్, కరుణ్ నాయర్, రిషభ్ పంత్, జడేజాతో బ్యాటింగ్ బలంగానే ఉంది. పేస్ విభాగానికి బుమ్రా, సిరాజ్ ప్రధానం కాగా.. అశ్విన్ లేకపోవడంతో స్పిన్ భారం జడేజాపైనే పడనుంది. మరోవైపు ఇంగ్లండ్ పరిస్థితి కూడా టీమిండియాలాగే సంధి దశలో ఉంది. అండర్సన్, బ్రాడ్ రిటైర్మెంట్ తర్వాత జరుగుతున్న తొలి సిరీస్ ఇది. ఓవర్టన్, క్రిస్ వోక్స్, షోయబ్ బషీర్‌తో బౌలింగ్ విభాగం కొత్తగా కనిపిస్తోంది.

## కోహ్లీ లేకపోవడంతో ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్



**లీడ్స్-నవభూమి:** బ్లాక్ బస్టర్‌లాంటి టెస్ట్ సిరీసలో విరాట్ కోహ్లీ వంటిగొప్ప ఆటగాడిని ఎదుర్కోలేకపోవడం ఎంతో విచారకరమని ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ వ్యాఖ్యానించాడు. కోహ్లీ లేని భారత జట్టులో మునుపటి పోరాటతత్వం, గెలవాలన్న తపన సన్నగిల్లుతాయని అన్నా డు. టెస్ట్ ఫార్మాట్‌కు గత నెలలో విరాట్ వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. అంతకుముందు కొద్ది రోజుల కిందటే రోహిత్ శర్మ కూడా టెస్ట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. దాంతో సంధి దశలో ఉన్న భారత జట్టు యువ కెప్టెన్ గిల్ ఆధ్వర్యంలో ఇంగ్లండ్‌ను ఐదు టెస్ట్‌ల్లో ఢీకొనబోతోంది. ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) విడుదల జేసిన ఓ వీడియోలో స్టోక్స్...కోహ్లీ నిష్క్రమణపై తన అభిప్రాయాలను వెల్లడించాడు. మైదానంలో తామిద్దరిదీ ఒకే తరహా మైండ్‌సెట్ అనీ, అతనితో తలపడే అవకాశం లభించకపోవడం తనకే మాత్రం నచ్చడంలేదని స్టోక్స్ చెప్పాడు. ఇదే విషయాన్ని కోహ్లీకి మెసేజ్ చేశానని అన్నాడు. 'జెర్సీ నెంబర్ 18ని విరాట్ తనదిగా చేసుకున్నాడు. ఇకపై ఆ నెంబర్ ఏ భారత జట్టు క్రికెటర్ జెర్సీపైనా కనిపించకపోవడాన్ని జీర్ణించుకోవడం కష్టమే. కోహ్లీ ఆ నెంబర్‌కు అంతలా వన్నె తెచ్చాడు' అని బెన్ చెప్పుకొచ్చాడు.

## ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ బ్రాండ్ అంబాసిడర్‌గా కంగన



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ బ్రాండ్ అంబాసిడర్‌గా కంగన

నటి, పార్లమెంట్ సభ్యురాలు కంగన రనౌత్ ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిపనకు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితురాలైంది.

న్యూఢిల్లీ: నటి, పార్లమెంట్ సభ్యురాలు కంగన రనౌత్ ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిపనకు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితురాలైంది. ఈ మెగా టోర్నమెంట్ ఈ సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 5 వరకు ఢిల్లీ వేదికగా జరగనుంది. వంద దేశాలకు పైగా పారా అథ్లెట్లు పోటీపడే ఈ చాంపియన్‌షిపనకు అసలైన అంబాసిడర్ కంగన అని భారత పారాలింపిక్ కమిటీ తెలిపింది. అంబాసిడర్ హోదాలో మన చాంపియన్లకు మద్దతుగా నిలిచే అదృష్టం దక్కినందుకు చాలా సంతోషంగా ఉందని కంగన వ్యాఖ్యానించింది.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**